SIR STEPHEN TIMMS MP


*Electronic mail: stephen@stephentimms.org.uk*

*Web: http://www.stephentimms.org.uk/*


2-3 Central Parade
Ley Street
Ilford
IG2 7DE
Sathyam
SUPERMARKET
020 8518 3355
Fresh Vegetables, Fruits
Asian Groceries - all brands
Butchery, Fresh Fish
Special Discount for TAL members
*Please collect coupons from TAL
*conditions apply
Free Marked Customer Parking
Bays at rear
Josh
Properties
020 8518 0444
5 Central Parade, Ley street,
Ilford IG2 7DE
Total Property Management
Residential Lettings
Residential Sales
Mortgages & Protection

# సాయికుమార్

## సినీ యాక్టర్ & డబ్బింగ్ ఆర్టిస్ట్





శ్రీ పూడిపెద్ది సాయి కుమార్ గారు, తెలుగు సినీ రంగంలో ప్రముఖ కళాకారులు. స్పష్టమైన తెలుగు మాట్లాడేవాళ్ళు, మంచి కంఠధ్వని కలిగిన అతికొద్ది మందిలో ఒకరు. ప్రముఖ నాటక, సినీ , డబ్బింగ్ కళాకారులైన పి.జె.శర్మ గారి తనయులు. అద్భుతమైన కంఠధ్వనిని తండ్రిగారి నించే వారసత్వంగా వచ్చిందంటే ఆశ్చర్యంలేదు. వీరి కుటుంబం మొత్తం పేరుపొందిన సినీ కళాకారులే. తాజాగా సాయికుమార్ గారి తనయుడు ఆది, కుటుంబంలో నటన ని కొనసాగిస్తున్నారు.

చాలావరకు భారతీయ భాషల్లో 250 కి పైగా సినిమాల్లో కీలకమైన పాత్రల్లో నటించారు. 1000 కి పైగా సినిమాల్లో వివిధ పాత్రలకు డబ్బింగ్ / వాయిస్ ఓవర్ చేశారు. అమితాబ్ బచ్చన్, రజనీకాంత్ లాంటి గొప్ప నటులకి తన గొంతు అరువిచ్చారు. అంతేకాదు తానే నిర్వాహకుడిగా 500 కు పైగా టీవీ కార్యక్రమాలు రూపొందించారు, వాటిలో కనిపించి నడిపించారు.

సినిమాల్లో నటనకు, తన స్వరానికి ఎన్నో అవార్డులు అందుకున్నారు. ఫిలింఫేర్, నంది అవార్డులు, IIFA, SIIMA అవార్డులు, బెస్ట్ యాక్టర్, యాంకర్, టీవీ యాంకర్, కన్నడ రాజ్యోత్సవ అవార్డులు ఇలా ఎన్నో మంచి అవార్డులు అందుకున్నారు.

సినిమాలతో పాటు అయన రాజకీయాల్లో కూడా రాణించారు. 2004 లో భారతీయ జనతా పార్టీ లో చేరిన ఈయన, కర్ణాటక లో తమ స్వస్థలమైన భాగేపల్లి నుంచి పోటీ చేశారు. కర్ణాటక లో ఇంకా దేశస్థాయిలో భారతీయ జనతా పార్టీ కి నమ్మకమైన ప్రచారకర్తగా, ఆ పార్టీ ఎదుగుదల లో తన వంతు పాత్ర పోషించారు.
భవిష్యత్తు లో వీరు సినిమా పరంగా రాజకీయ పరంగా మరిన్ని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని యూకే తెలుగు వారందరి తరపున ఆకాంక్షిద్దాం

తెలుగు సినీ రాజకీయ రంగాల్లో, మంచి వ్యక్తిగా రాణిస్తూ ఉన్న **'నాలుగో సింహం'** శ్రీ పూడిపెద్ది సాయికుమార్ గారు మన తాల్ ఉగాది కి ముఖ్య అతిధిగా రావడం, యూకే తెలుగు వారికి, తాల్ కుటుంబానికి చాలా సంతోషదాయకం. తాల్ కుటుంబం వారికి ఘనస్వాగతం పలుకుతున్నది.


Cakes & Treats
BESPOKE CAKE SPECIALISTS
For Birthdays, Weddings and All Your Special celebrations.
20 Kingsley Road, Hounslow East, TW3 1NP
020 8572 7722
Fresh Fruit
Celebration
Wedding
Eggless
Designer
Birthday
Uber Eats
JUST EAT
Celebrate your sweet moments with our yummiest Cakes & Treats in the town!!
cakesandtreats4u@gmail.com
/cakesandtreatsuk


WARDROBES ■ BUILT IN WARDROBES ■ FITTED KITCHENS ■ SLIDING WARDROBES
LUXURY BESPOKE WARDROBES & KITCHENS
Made to order in the UK ■ 10 Year Product Guarantee
Soft Close Doors As Standard ■ We fit wardrobes in less than 2-3 weeks
CONTACT US
01708756789 ■ 07961 070327
www.bestfittedwardrobe.co.uk
info@bestfittedwardrobe.co.uk
Best Fitted Wardrobe Ltd Unit A3, Seedbed Centre, Davidson Way, RM7 0AZ
BEST FITTED WARDROBE





# శ్యామల

## టాలీవుడ్ యాంకర్ & ఆర్టిస్ట్

శ్రీ శ్యామల గారు, అందరికి సుపరిచితమైన టీవీ యాంకర్. రోజు మన ఇంటిలో సభ్యుల్లాగా వివిధ టీవీ చానెల్స్ లో కనిపించి పలకరించే సుపరిచితమైన పేరు. సునిశితమైన హాస్యంతో, స్పష్టమైన వాచకంతో వీరు 1000 కి పైగా టీవీ కార్యక్రమాల్లో వ్యాఖ్యాత గా వ్యవహరించి, అందరి మన్ననలు పొందారు. తెలుగు రాష్ట్రాల్లో , ఇంకా తెలుగు వారు ఉంటున్న అన్ని దేశాల్లో వీరి పేరు తెలియని వారులేరు. వీరు చిన్నతనం లో వీణ, కూచిపూడి నాట్యం నేర్చుకున్నారు. తెలుగుదనం ఉట్టిపడే సంగీత, వాద్య విషయాల్లో నైపుణ్యం సంపాదించి, తరువాత టీవీ /సినిమాల్లోకి వచ్చినందుకు తప్పక అభినందించాలి.

మా టీవీ, జెమినీ టీవీ , ఈటీవీ , జీ నెట్వర్క్స లలో ఎన్నెన్నో ప్రోగ్రామ్స్కి హోస్ట్ గా వ్యవహరించారు. విజయవంతంగా నడిపించారు. మా వూరి వంట, పట్టుకుంటే పట్టుచీర, డాన్స షోస్, స్వరాభిషేకం వంటి సంగీతపు కార్యక్రమాలు, అలాగే లక్ష్మి రావే మా ఇంటికి లాంటి సీరియల్స్ ఇలా తెలుగు వారికీ నిత్య దర్శితులు. చాలా సినిమాల్లో కూడా నటించారు, అనేకమంది తెలుగు సెలబ్రిటీస్ ని ఇంటర్వ్యూలు కూడా చేశారు. టీవీ మాధ్యమంలో ప్రముఖులు.

రోజూటీవిలో కనిపిస్తూ , తెలుగు వారిని ప్రపంచ వ్యాప్తంగా అలరిస్తున్న శ్యామల గారు మనల్ని అలరించడంకోసం తాల్ ఉగాది వేడుకకు రావడం ఏంతో  సంతోషదాయకం. వారికి హృదయపూర్వక స్వాగతం.

Modulus 365

Pick Pack Ship your Online orders like Amazon.

hello@modulus365.com

Powered By creatum software.com

OXYGLOBAL.TECH

Marketplace | Fractional Ownership | Fundraise



# హారిక నారాయణ్

ప్లేబాక్ సింగర్

తెలుగు సినీ రంగంలో నవ యువ కెరటం గాయని శ్రీ హారిక నారాయణ్ గారు. పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది, సంగీతం వారి కుటుంబంలోనే ఉంది ఇలాంటి వ్యాఖ్యానాలన్నీ వారికి అతికినట్టు సరిపోతాయి. పద్మ విభూషణ్ శ్రీ మంగళంపల్లి బాలమురళి కృష్ణ గారి ముని మనవరాలు. అద్భుతమైన సంగీత వారసత్వం, దానితోపాటు చిన్న వయసు నుండీ మంచి గురువుల దగ్గర కర్ణాటక సంగీతం నేర్చుకున్నారు.

తండ్రిగారు ఎయిర్ ఫోర్స్ లో పని చేయడం వల్ల, దేశంలో వివిధ ప్రాంతాల్లో నివసించారు. తెలుగునాట ఎందరో గాయకులను అందించిన స్వరాభిషేకం కార్యక్రమం ద్వారా అందరికీ పరిచయమయ్యారు.

వీరు మెకానికల్ ఇంజనీర్, ఇంజనీరింగ్ చదువుతూ కూడా శాస్త్రీయ సంగీతంలో సాధన కొనసాగించారు, అందులో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా కూడా చేశారు. సంగీతం నేర్చుకోవడమేతప్ప ఎప్పుడు గాయని కావాలి అనుకోలేదు, కానీ చివరికి సంగీత ప్రపంచంలోనికే వచ్చారు.

2019 లో సూర్యకాంతం సినిమా లో తొలిసారి సినీ నేపథ్యగానం చేశారు, ఆ తరువాత వరుసగా విజయవంతమైన చిత్రాల్లో మంచి పాటలు, మంచి మంచి సంగీత దర్శకుల నేతృత్వంలో పాడుతూ వస్తున్నారు. ఉదాహరణకు ఆచార్య సినిమాలో 'లాహే లాహే' పాట, తమన్, కీరవాణి, మణిశర్మ లాంటి ఉద్ధండుల సినిమాల్లో పాటలు పాడారు.

ఏ కార్యక్రమం ద్వారా అందరికి పరిచయమయ్యారో అదే స్వరాభిషేకం కు అసిస్టెంట్ డైరెక్టర్ గా కూడా పని చేసారు. అమెరికా, ఆస్ట్రేలియా, యూకే , దుబాయ్ ఇలా అనేక దేశాల్లో పాడుతా తీయగా, స్వరాభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. ఇలా ప్రపంచ వ్యాప్తంగా తెలుగు ప్రేక్షకులకు తన మధుర గానం తో దగ్గరయ్యారు. అనేక ప్రముఖ టీవీ షోస్ లో పాల్గొంటూ, తెలుగుతోపాటు ఇతర భాషల చిత్రాల్లో కూడా నేపథ్యగానం చేస్తూ తన రంగంలో ఇంకా గొప్ప స్థాయికి ఎదగాలని, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరుకుందాం. వీరు మన తాల్ ఉగాది వేడుక కు రావడం చాలా సంతోష దాయకం. తాల్ మరియు యూకే తెలుగు వారి తరఫున ఘనస్వాగతం పలుకుతున్నాం.


NAMASTE INDIA
TO CELEBRATE
WWW.NAMASTEINDIA.LONDON


Digital invitations designed for any occasion...
suitable for any social media platform...
DESIGN & PRINT
ID CARDS
HAMLETS
VISITING CARDS
MENU CARDS
BROUCHERS
BOOKLETS
PRESENTATIONS
LED DISPLAY DESIGNS
Raj
07044 195 805
SRKUK
Telugu / English



# అరుణ్ కౌండిన్య

ప్లేబాక్ సింగర్

డా. అరుణ్ కౌండిన్యగారు, తెలుగు సంగీతం, సినిమాల్లో యువ తరంగం. వృత్తిరీత్యా డెంటల్ డాక్టర్ అయిన వీరు, చిన్నప్పటినుండి శాస్త్రీయ సంగీతంలో శ్రీ రామాచారి గారి లిటిల్ మ్యుజిషియన్స్ అకాడెమీ, భైరవి మ్యూజిక్ అకాడెమీలలో శిక్షణ పొందారు. శాస్త్రీయ సంగీతం నేపథ్యంగా తెలుగు సినిమాల్లోకి వచ్చి మంచి గాయకులు గా పేరుపొందారు.

మా టీవీ **'సూపర్ సింగర్ 7, పాడాలని ఉంది'** కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జెమినీ టీవీ **'బోల్ బేబీ బోల్'** లో పాల్గొన్నారు అలాగే అదే కార్యక్రమంలో మెంటార్ గా పనిచేశారు. తరువాతి కాలంలో జీ తెలుగు లో **'సరిగమపా'** కార్యక్రమానికి చాలా కాలంపాటు మెంటార్ గా, వాయిస్ ట్రైనర్ గా భవిష్యత్ గాయకులకు దిశా నిర్దేశం చేశారు.

ఈ మధ్య కాలం లో వచ్చిన అనేక విజయ వంతమైన సినిమాల్లో ఇంకా విజయవంతమైన తెలుగు పాటలు ఆలపించారు. మచ్చుకి RRR సినిమాలో **రామం రాఘవం** పాట. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో తెలుగు కార్యక్రమాల్లో తెలుగు పాటలు పాడి, ప్రపంచ తెలుగు ప్రేక్షకులకి దగ్గరయ్యారు. ఈరోజుల్లో తెలుగు పాటలు, సంగీతం వినేవారిలో ప్రపంచ వ్యాప్తం గా ఈయన తెలియనివారులేరు.

యూట్యూబ్ లోను, టీవీ చానెల్స్ లోను తెలుగు సినిమాల్లోనూ తన గాత్రంతో తెలుగు ప్రేక్షకులను అలరిస్తూ, దూసుకుపోతున్న శ్రీ అరుణ్ కౌండిన్య మునునూరి గారు, ఇంకా ఎన్నో గొప్ప పాటలుపాడి, అటు సినిమాలు, ఇటు శాస్త్రీయ సంగీతపు కార్యక్రమాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకుందాం. వీరు మన తాల్ ఉగాది వేడుకకు మనలను అలరించడానికి విచ్చేయడం ఆనందదాయకం. వీరికి సాదర స్వాగతం.





**Anmish Varma**

International Mountaineer and World Martial Arts Champion

# అన్మీష్ వర్మ

## ఇంటర్నేషనల్ మౌంటైనర్ & మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్

శ్రీ అన్మీష్ వర్మ గారు, తెలుగు వారికి గర్వకారణమైన వ్యక్తి. మార్షల్ ఆర్ట్స్ లో , పర్వతారోహణలోనూ ఒకేసారి వీరు సాధించిన విజయాలు చూస్తే ఒళ్ళు గగుర్పొడుస్తుంది. ఒక మామూలు స్థాయినుంచి వచ్చిన వ్యక్తి ఇంతటి విజయాలు సాధించడం వెనుక కఠోరమైన శ్రమ, గొప్ప దీక్ష కనిపిస్తాయి.

9 ఏళ్ళ వయసు నుండే వీరు మార్షల్ ఆర్ట్స్ లో శిక్షణ పొందడం ప్రారంభించారు. ఎంచుకున్నవి రెండు అత్యంత కష్టమైన విషయాలైనా, రెండింటిలోనూ అత్యున్నత స్థాయికి ఎదిగారు. మాటల్లో చెప్పలేనంత గట్టి పరిశ్రమ, మొక్కవోని మానసిక స్థైర్యం ఉంటె తప్ప ఇలాంటివి సాధ్యంకావు. 2018 లో ప్రపంచ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్ షిప్ సాధించిన మొదటి భారతీయుడిగా నిలిచారు. ఆ పోటీలో ఇంగ్లాండ్ మీద 0-6 తో గెలిచారు.

మౌంట్ ఎవరెస్ట్ ను అధిరోహించిన మొదటి తెలుగువాడు. ఈ రెండు విజయాలు చాలు, తెలుగు వారికీ, యువతరానికి ఈయన ఒక దిక్సూచిలా నిలవడానికి. మౌంట్ ఎవరెస్ట్ ను రెండు సార్లు, అదీ క్లిష్టమైన వాతావరణ స్థితుల్లో, ఎవరు ధైర్యం చేయలేని పరిస్థితి లో విజయవంతం గా అధిరోహించిన వీరుడు. మన జనరేషన్ X తెలుగు యువత ఎంతైనా ఆదర్శంగా తీసుకోవాల్సిన వ్యక్తి.

చెదరని దీక్షతో, సాంకేతిక, ఆర్థిక ఆటంకాలను దాటి, భూమి మీద ఏడు ఖండాల్లో ఏడు అత్యున్నత శిఖరాలను అధిరోహించడానికి  సన్నద్ధం అంటున్నారు.  అలాగే ఉత్తర, దక్షిణ ధృవాల్లో స్కేటింగ్ చేసిన మొదటి భారతీయుడిగా నిలవాలని సంకల్పించారు. వీరు ఆ ప్రయత్నాల్లో గెలవాలని, తెలుగు, భారతీయ ఖ్యాతిని పెంచాలని కోరుకుంటున్నాము. **వీర గంధము తెచ్చినారము వీరుడెవ్వడో తెల్పుడీ** అన్నట్టు వీరిని **యువ అనితరసాధకులు** గా గౌరవించుకోవడం తాల్ కు గర్వకారణం.

# నింగికెగసిన తారలు



## "రేపల్లియ యెద ఝల్లున పొంగిన రవళి..."

**కాశీనాధుని విశ్వనాధ్** గారి గురించి పై వాక్యం సరిగ్గా సరిపోతుంది, ఎందుకంటే ఆయన జన్మించినది రేపల్లెలో కాబట్టి ఫిల్మీగా అనిపించినా, సినిమా పరిశ్రమకు చెందినవారు కాబట్టి ఆయన సినిమాలోని, పాటలోని వాక్యంతోనే మొదలుపెట్టడం తప్పలేదు. సినిమా జీవితం తొలినాళ్ళలో వచ్చిన ఫోటోలు చూస్తే, ఖాకీ దుస్తుల్లో హాండ్సమ్ టెక్కీ లాగా కనిపించే ఈయన (నిజంగా టెక్కీయే తొలినాళ్ళలో సౌండ్‌ఇంజనీర్) జీవితం ఒక పి. హెచ్.డి చేయగలిగినంత కొన్ని తరాలవారికి మన సంస్కృతి గురించి, తెలుగు సినిమా గురించి పాటాలు నేర్పగలిగినంత, ఒక్క మాటలో చెప్పాలంటే తెలుగు జీవన సౌందర్యాన్ని 360 డిగ్రీలలో చూడగలిగినంత.

"ఆయన శుద్ధ శ్రోత్రియ జంధ్య బ్రాహ్మణుడండీ, ఇంట్లో పాలరాతితో చేసిన డైనింగ్ టేబుల్ ఉన్నా, కింద నేలమీద కూర్చొని అరిటాకులో భోజనం చేస్తారు రోజూని... ఆస్వాదన అనేది లేదు" విశ్వనాథ్ గారిపై ఇంటర్వ్యూల్లో చాలా మంది మాట్లాడిన మాటల్లో బాగా గుర్తుండిపోయిన మాట ఇది. ఎవరు అన్నారు అనేది ప్రస్తుతం అప్రస్తుతం కానీ వింతగా అనిపించినా ఇది నిజం. సినిమా ప్రపంచంలో ఉంటూ, సనాతన జీవన విధానాన్ని కొనసాగించడం, ఒక తపస్సు చేయడం లాంటిదే. ఎవరో అడిగారట, ఎందుకండీ ఇలాగ, దీనివల్ల ఏమొస్తుందీ అని, ఆయన ఇచ్చిన సమాధానం "దేనివల్లా ఏమీరాదు, అంతా ఇక్కడే ఉంటుంది, మనమే వస్తాం, వెళతాం" హాస్యంతో కూడిన తాత్వికత ఇక మనం దీని గురించి మాట్లాడడానికి ఏమీలేదు, జీవితాంతం గుర్తుపెట్టుకోవడం తప్ప.

సాగరసంగమం సినిమా బాగా చిన్న పిల్లాడిగా చూసినపుడు, తొందరగా అయిపోతే బాగుండు అనిపించింది, 15 ఏళ్ళ వయసులో చూసినపుడు, అప్పటికే కొద్దిగా ఇంట్లో సంస్కృతి, సంగీతం, పుస్తకాలు, సమాజం పరిచయం కావడంవల్ల, బాగుంది అనిపించింది, ఇక అప్పటినుండి ఎప్పుడు చూసినా ఆ బాగుండటం ఒక మెట్టు పెరుగుతూనే ఉంది. ఇక ఆయన సినిమాల గురించి చెప్పాలంటే, పెద్ద పెద్ద స్టార్ల స్థాయికి ఎలివేట్ చేశాయి. ఒక దేవాలయ నర్తకి ఒక వంటవాడు, ఒక చెప్పులు కుట్టుకునేవాడు, తల్లిదండ్రులు లేని పిల్లవాడు, వాణిజ్య ప్రకటనలకు బొమ్మలు వేసే వాడు, పశువుల కాపరి, ఇలా అప్పటి సమాజంలో తక్కువ స్థాయి వారి పాత్రలని, కథానాయకులుగా మలచడం, ఆ సినిమాలు మంచి విజయం సాధించడం, గొప్ప పరిణామం. మనందరం అలాంటి వాళ్ళని, వారిలోని మంచి తనాన్ని ఎప్పుడో ఒకప్పుడు నిజంగానే చూసి ఉంటాం.

సాత్వికత, తాత్వికత, హాస్యం, నిజాయితీ, సంగీతం, నృత్యం - ఇలా భారతీయ సంస్కృతిలోని అనేక మంచి కోణాల్ని తెరమీద అద్భుతంగా ఆవిష్కరించారు విశ్వనాథ్ గారు, ముఖ్యంగా శాస్త్రీయ నృత్యానికి, సంగీతానికి పెద్ద పీట వేసి, తీసిన సినిమాల వల్ల ప్రభావితమై అప్పట్లో చాలామంది తమ పిల్లలకు అవి నేర్పించారు. ఆ తర్వాతి కాలంలో ఆ పిల్లలే ఇవాళ నేల నాలుగు చెరుగులా ప్రవాస భారతీయులుగా వారి పిల్లలకు కూడా శాస్త్రీయ నృత్య సంగీతాలు నేర్పుతూ, భారతీయ, తెలుగు సంస్కృతిని గట్టిగా నిలబెడుతున్నారు. ఆయన సినిమాల్లోనే ఒక పాత్ర చెప్పినట్టు "పాశ్చాత్యపు సంగీతపు హోరులో రెపరెపలాడుతున్న శాస్త్రీయ సంగీతానికి, కళలకు, ఒకచెయ్యి అడ్డుపెట్టడమే కాదు, సాంస్కృతిక విలువల రూపంలో తరతరాలకు చెరగని కోట కట్టి వెళ్ళారు."

ఆయన సినిమాపాటలో లాగానే "అద్వైతసిద్ధీ, అమరత్వ లబ్ధి..." పొందిన కాశీనాధుని విశ్వనాధ్ మరియు జయలక్ష్మి గార్లకు మన తాల్ మరియు తెలుగువారి తరుపన కృతజ్ఞతాపూర్వక నమస్సుమాంజలి.

- పాలకొల్లు వంశీ కృష్ణ

# నింగికెగసిన తారలు



**శ్రీమతి జమున** గారు తెలుగు సినిమా తార, గొప్పనటి, ప్రజానాట్యమండలిలో "మా భూమి" నాటకంలో 13 ఏళ్ళ వయస్సులో నటించడం ద్వారా తన నటనా జీవితాన్ని మొదలుపెట్టారు. ఆ వయసుకే సంగీతం, హార్మోనియం నేర్చుకున్నారు. ఆతరం వారి గురించి చెప్పాలంటే భలే సంతోషంగా అనిపిస్తుంది. వాళ్ళు పురాణాలు, రామాయణ, మహాభారతాల కథలు నాటకాలు వేసినవాళ్ళు, లేదా సామాజిక నాటక మండళ్ళు లేదా శాస్త్రీయ సంగీత సాహిత్యాల్లో ఏదో ఒక పరిచయం ఉన్నవాళ్ళు.

13 ఏళ్ళ వయసులో నటించడం మొదలుపెట్టి, మొట్టమొదటి సినిమాలోనే నేరుగా కథానాయకురాలి పాత్రతో ఆరంగేట్రం చేశారు. జమున గారు అంటే మనకి ఎలా గుర్తుంటారంటే, చాలా ఆత్మాభిమానం, కొంత అభిజాత్యం, హుందాతనం కనిపించే నటిగా.

జమున గారి గురించి రాయడం కోసం చదువుతుంటే, ఆవిడ నటించిన మిస్సమ్మ సినిమా 1955 లో వచ్చిందట, అది 1990ల్లో చూసినట్లు గుర్తు. 55లో వచ్చిన సినిమా 90ల్లో చూసినా ఏమాత్రం పాతకాలం సినిమాల్లాగా అనిపించదు. ఎంత బాగుంటుందో. అందులో నలుపు తెలుపు రంగుల్లోనే జమున గారి మొహంలో కళ అద్భుతం అనిపిస్తుంది. చక్కటి తెలుగుదనం. అందులోనూ అప్పుడే వదిలివెళ్ళిన బ్రిటీష్ వారి 'ట్రాన్స్టమ్స్, మానరిజంస్' విరుపులు.

సంగీతం నేర్చుకున్నారు, ప్రజా నాట్యమండలినుంచి వచ్చారు, మొదటి సినిమాలోనే కథానాయకురాలు, మంచి కుటుంబం, క్రమశిక్షణ, అభిమానం కలిగిన వ్యక్తి. ఇంక విజయానికి అడ్డేముంది. ప్రయాణం ఎక్కడా ఆగలేదు. వరుసబెట్టి ఇవాళ తలచుకుంటే ఆహా అనిపించే సినిమాల్లో నటిస్తూ పోయారు.

భానుమతి గారికి మంచి స్నేహితురాలు. నాకు భానుమతి గారే ఇన్స్పిరేషన్ అని చెప్పారు కొన్ని ఇంటర్వ్యూల్లో. సిరివెన్నెల గారు ఒక పాటలో రాశారు, "స్నేహితులు నీలోని ఇష్టాలు" అని, కొన్ని లక్షణాలు కలిసే ఉంటాయి. మరి చెప్పేదేముంది, హీరోలతో సమానస్థాయిలో ఉన్నారు కాబట్టి, హీరోలతో అభిప్రాయ (అభిజాత్య) భేధాలు వచ్చాయి. పేర్లెందుకు గానీ మహామహావాళ్ళతో కూర్చోబెట్టి రాజీచేసి సినిమాల్లో కంటిన్యూ చేశారు. భానుమతి గారు, జమున గారు పెద్ద మేడం, చిన్న మేడం అనీ ఎవర్నీ లెక్కచేయరు అని అనేవారట. గోల్డెన్ డేస్ , హీరోయిన్స్‌కి హీరోలతో సమానంగా, కొన్నిసార్లు ఎక్కువ విలువ ఇచ్చే రోజులన్నమాట.

నటనకు తగ్గట్టే సినిమా అవార్డులు చాలా వచ్చాయి. రాజకీయాల్లోకి కూడా వచ్చారు. రాజీవ్‌గాంధీ గారి ఆహ్వానంతో రాజమండ్రి ఎంపీగా నిలబడి గెలిచారు కూడా. ఆ తర్వాతి కాలంలో మహిళా కాంగ్రెస్ నుండి, ఆగోల పడలేక వచ్చేశాను అని చెప్పారు. బంధువులలోనే పెద్దలు కుదిర్చిన పెళ్ళి చేసుకున్నారు. ఇద్దరు పిల్లలు, మంచికుటుంబం.

అంతా ప్రశాంతంగ సాగి, తెలుగువారి లైబ్రరీలో కలకాలం నిలిచే మంచి పాత్రల్లో నటించి, మంచినటిగా, కథానాయకురాలిగా, కుటుంబపరంగా పరిపూర్ణమైన జీవనం కొనసాగించి 86 ఏళ్ళ వయసులో కన్నుమూశారు.

– పాలకొల్లు వంశీ కృష్ణ

# నింగికెగసిన తారలు



" **ఈ ఘట్టమనేని శివరామకృష్ణయ్య మాటంటే మాటే** " ఇది కృష్ణ గారి సినిమాలో ఒక డైలాగ్.
ఆయన గురించి తెలిసిన వాళ్ళు నిజ జీవితంలో కూడా ఆయన పద్ధతి అదే అంటారు. చెప్పింది చేసి, చేసిందే చెప్పగలిగే లక్షణం ఉండటం చాలాకష్టం. అదృష్టం కూడా. పాత తరం వ్యక్తుల్లో ఎక్కువగా చూడగలిగే మంచి లక్షణం అది.

తొందరగా ఎక్కువ లాభాలు, తక్కువ కాలంలో ఎక్కువ స్థాయికి ఎదగటం అనేవి ఇవాల్టి రోజుల సూత్రాలు, ఇలాంటప్పుడు ఒక జీవిత కాలపు కష్టం, రాగ్స్ టు రిచెస్ ఇన్ వన్ లైఫ్ టైం అనేది బోరింగ్ సబ్జెక్టు కావచ్చు కానీ అదే ఎక్కువ కాలం నిలబడే విజయాలకు దగ్గరి దారి అని కృష్ణ గారిని చూస్తే అనిపిస్తుంది.

350 సినిమాల్లో కథానాయకుడు. భూమ్మీద తెలిసినంతలో ఎవరూ ఇన్ని సినిమాలు హీరోగా చేయలేదు. అన్ని సినిమాల్లో కనిపించడమే ఒక విజయం అనే రోజుల్లో ఉన్నాం, ఇక కథానాయకుడిగా చేయడం అంటే అద్భుతమే. ఐతే ఊరికే రాలేదు, రోజుకి 18 గంటలు పనిచేస్తే వచ్చింది అంటారు ఆయన. అంతేగా విజయానికి దగ్గర దారులుండవు మరి. ఎప్పుడు వచ్చారు, ఎన్ని సినిమాల్లో నటించారు, వీటికంటే ఆయనలోని మంచి లక్షణాలకు నివాళిగా చూద్దాం.

జూదంలాంటి సినిమా రంగంలో , తీసుకున్న డబ్బులకు న్యాయంచేసేలా నిర్మాతల వైపు నిలబడటం, తాను సరిపోని పాత్రలను నిర్మొహమాటంగా తిరస్కరించడం చేశారంటారు. ఇచ్చిన డబ్బులు వెనక్కి ఇచ్చేసిన రోజులున్నాయు. నష్టపోయిన వారికోసం ఏమీ తీసుకోకుండా సినిమాలు చేసిన రోజులున్నాయి. పైగా తన సినిమా ఐనా, ఏమాత్రం సిగ్గుపడకుండా సరిగా విజయం సాధించలేదు అని చెప్పుకునే నిజాయితీ ఉన్నవారు అని సినిమా వాళ్ళు చెప్తారు.
హీరోగా రోజుకి 2 గంటలు మాత్రమే పడుకుని, 20 గంటలు పనిచేశాను అని ఆయన ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. రోజుకి 18-20 గంటలు కొన్నేళ్ళపాటు అది కూడా విజయవంతమైన సినిమా హీరో అయ్యాక కూడా... ఇదొక గొప్ప లక్షణం.

ఈయన సినిమాల్లో  చేసినన్ని ప్రయోగాలు ఎవరు చేయలేదు అంటారు. తెలుగులో **మొదటి సినిమాస్కోప్, మెదటి జేమ్స్ బాండ్ మూవీ, మొదటి కౌబాయ్ మూవీ, అలాగే 14 సినిమాలకు దర్శకత్వం** కూడా చేశారు.

ఇక రాజకీయాలకొస్తే ఈనాడు, నాపిలుపే ప్రభంజనం సినిమాలు చూస్తే సరిపోతుంది. ఎన్టీయార్ ప్రభంజనం ఉన్న రోజుల్లో, ఈయన ఏలూరు నుండి 71వేల మెజారిటీతో గెలిచారు. అధికారానికి ఎదురు నిలవాలి అనుకోవడం, నిలబడి గెలవటం అనేది కథానాయకుడి మొదటి లక్షణం కదా మరి.
సింహాసనం సినిమాలో ఈయన జయప్రద వీరిద్దరి జోడి, గ్లామర్ వారి అందం, ముఖ వర్చస్సు నిజమైన సినిమా "తారలు" అనిపిస్తుంది. ఆ సినిమా నుంచి ఒక పాట " **ఆకాశంలో ఒక తార... నాకోసమొచ్చింది ఈ వేళా...** " అని. మనందరి కోసం ఆకాశం నుండి దిగివచ్చి, గొప్ప సినిమాలతో అందర్నీ మెప్పించి తిరిగి మళ్ళీ వెళ్ళి పోయిన తార, మన సూపర్ స్టార్!
పద్మభూషణ్ ఘట్టమనేని కృష్ణ గారికి తాల్ మరియు యూకె తెలుగువారి ఘన నివాళి. – **పాలకొల్లు వంశీ కృష్ణ**

# నింగికెగసిన తారలు



**శ్రీకైకాల సత్యనారాయణ** గారు – "యముండ..." ఈ డైలాగ్ వింటే చాలామంది తెలుగువారికి వెంటనే గుర్తొచ్చే పేరు. భారీకాయంతో గంభీరంగా కనిపించేవారు. హాస్యరస ప్రధాన పాత్రలు పోషిస్తే, చూడడానికి చాలా సరదాగా వుంటుంది. ఇక దానికి గొప్ప నటన తోడైతే చెప్పనక్కరలేదు. కలకాలం గుర్తుండిపోతాయి. అటువంటి నటులలో సినిమా మొదటి జనరేషన్‌లో యస్వీ రంగారావు గారు, ఆ తర్వాత కైకాల సత్యనారాయణ గారు.

వీరు దాదాపు 750 సినిమాలకు పైగా వివిధ పాత్రల్లో నటించారు, నాటక రంగం నుండే వచ్చారు. ఆ నాటకాల్లో ఈయన్ని చూసినవారు అచ్చు ఎన్టీఆర్ లాగా ఉన్నారు అనుకునేవారట. దానివల్లనే ఈయనకు సినిమాల్లో అవకాశాలు వచ్చాయి. విశేషం ఏమిటంటే ఈయన చాలా సినిమాల్లో రామారావు గారికి డూప్‌గా నటించారు. ఎన్టీఆర్ తనకి డూప్‌గా ఉండటానికి ఒప్పుకున్నారంటేనే ఇంకా వేరే సర్టిఫికెట్స్ అవసరంలేదు కదా మరి. ఆ పోలికే తనకి వరం, శాపం కూడా అని అన్నారు కొన్ని ఇంటర్వ్యూల్లో...

ఇక యముడి పాత్రలకి వీరు తెలుగులో పేటెంట్ తీసుకున్నారనవచ్చు. యముడు అంటే ఇలాగే ఉంటాడేమో అన్నట్లు తెలుగువారిలో ముద్ర పడిపోయింది. ఎస్వీ కృష్ణారెడ్డి గారి యమలీల సినిమాలో యముడిగా భలే హాస్యరసం పండించారు. అన్నిటికంటే విలన్‌పాత్రలు అందునా రామారావు గారి సినిమాల్లో చాలా కష్టమండీ " ఫైటింగుల్లో ఆయనకి దెబ్బ తగలకుండా నేనే చూసుకోవాలి, నాకు దెబ్బ తగలకుండా నేనే చూసుకోవాలి" అనేవారు.

కథానాయకుల పాత్రలు, గంభీరమైన పౌరాణిక పాత్రలు, అమ్మాయిలవెనుక తిరిగే జులాయి, కామెడీ విలన్ పాత్రలు సీరియస్ విలన్ పాత్రలు, కరుణ, హాస్యరసంతో కూడిన పాత్రలు ఇలా ఎన్నో కోణాలు. అందుకే కాబోలు ఈయన పేరుముందర "నవరస నటనా సార్వభౌమ" అని బిరుదు కూడా వేసేవారు సినిమా టైటిల్స్‌లో. బాగా గుర్తుండిపోయే పాత్ర ఒకటి శృతిలయలు సినిమాలోని "శరణు శరణు సురేంద్ర సన్నుత... అంటూ త్యాగరాయ ఆరాధనోత్సవాలకి నగర సంకర్తన చేసే పతాక సన్నివేశం" చూస్తే ఆహా అనిపిస్తుంది. ఇటువంటి ఉదాత్తమైన పాత్రలు అలవోకగా పోషించారు. సినిమా జీవితం తరువాత రాజకీయాల్లోకి వచ్చారు (తేబద్దారు.). మచిలీపట్నం నుండి 1996లో పార్లమెంటుకి ఎన్నికయ్యారు.

నాటకరంగం నుండి వచ్చి, నటననే జీవితంగా ఎంచుకొని, చివరి వరకు కొనసాగించి, నటనతో చాలా అవార్డులు గెలిచి, ఎన్నికల్లో గెలిచి పార్లమెంటుకి వెళ్ళి పరిపూర్ణమైన జీవితాన్ని గడిపి వెళ్లారు.

– పాలకొల్లు వంశీ కృష్ణ

# నింగికెగసిన తారలు



తెలుగు తెరపైన పెద్ద కథానాయకులలో ఒకరైన **ఉప్పలపాటి చిన వెంకట కృష్ణంరాజు** గారు 82 ఏళ్ళ పరిపూర్ణ జీవితాన్ని గడిపి సెప్టెంబరు 2022లో శివ సాన్నిధ్యాన్ని పొందారు. రెబల్‌స్టార్ కృష్ణంరాజుగా పేరొందిన ఆయన అన్నీ ఉన్న విస్తరాకు లాంటి జీవితాన్ని గడిపిన వ్యక్తి. ఈయన జీవితంలో ఇదిలేదు అనేది లేదని, సంతుష్టమయిన జీవితాన్ని గడిపిన ఇలాంటి వారి గురించి తెలుకుకోవడం సంతోషాన్ని ఇస్తుంది.

గొప్ప మోతుబరి కుటుంబంలో జన్మించారు. బాల్యంలో జమిందారీ, చిన్న సైజు రాజరికపు జీవితం. తోటివాళ్ళు సమవయసువాళ్ళు, ఊరిలో పెద్దవాళ్ళు సైతం, ఈ చిన్న పిల్లవాడిని "రాజు గారు" అని సంబోధించేవారట. తర్వాతి రోజుల్లో ఈయనను, నరసాపురం నుంచి కాకినాడలో బంధువుల ఇంటికి చదువుకోడానికి పంపితే " నా స్థాన బలం అంతాపోయింది. అక్కడ వున్న 2ఏళ్ళలో నేను చాలా మారిపోయాను మనిషిగా, అహంకారం మొత్తం తగ్గిపోయింది" అన్నారు. ఏది నరసాపురం నుండి కాకినాడ వెళ్ళినందుకే? ప్రవాస భారతీయులుగా మనం బాగా అర్ధం చేసుకో గలిగిన మాట.

బద్రుకా కాలేజీలో బీకాం చదివేవారు, ఆంధ్రరత్నలో విలేఖరిగా పనిచేశారు. రాయల్ స్టుడియో అని ఒక ఫోటో స్టూడియో నడిపారు. సినిమాల్లో ప్రవేశించే ముందు కొన్ని నాటకాలు కూడా వేశారు. ఈ దశలు అన్నిట్లో సుఖ వంతమైన, విలాసవంతమైన జీవనమే తప్ప కష్టాల్లేవు, సినిమా కష్టాలు అసల్లేవు. అందుకే మొహంలో, కళ్ళలో సంతోషం, స్థిరత్వం కనిపిస్తాయి తప్ప ఏదో సాధించేయాలన్న తపన, ఆకలి, కలలు కనిపించవు.

1968 నుంచి 2022 వరకు అంటే 50 ఏళ్ళపాటు సినిమాల్లో నటించారు. చాలా మంచి, గొప్ప పాత్రలు చేసారు. తెలుగు సినిమా ప్రపంచంలో పెద్ద కథానాయకులలో ఒకరుగా నిలబడ్డారు. ఎంచుకున్న పని అక్కడక్కడా విరామం వచ్చినా, అర్ధశతాబ్దం పాటు చేయగలిగారు. నటనా కౌశలం విషయానికి వస్తే మొదటి 3–4 సినిమాల్లోనే ఫిలింఫేర్, నంది అవార్డులు వచ్చాయి. ఇక చెప్పేదేముంది.

సినిమా నుంచి రాజకీయాల్లోకి ప్రవేశించిన తర్వాత, మెంబర్ ఆఫ్ పార్లమెంట్‌గా 5 సంవత్సరాల్లో 4 శాఖలకు (గ్రామీణ, రక్షణ, విదేశీ వ్యవహారాలు, పౌరసరఫరాలు) సహాయమంత్రిగా పనిచేశారు. చేసిన మంచి పనుల్లో ఒకటి – గ్రామీణ సడక్ యోజన కింద పల్లెటూర్లకి అప్పట్లో రోడ్లు వేయడానికి పెట్టిన పథకంలో ఈయన పేరు ఆంధ్ర, తెలంగాణల్లో చాలా మటుకు ఊర్లలో కనిపిస్తుంది. అలాగే ఇంకొకటి, యోగి ఆదిత్యనాథ్ గారితో కలిసి **"గోవధ నిషేద చట్టం"** తేవడంలో పనిచేశారు.

ఒక రైతు జమీందారు బిడ్డ, కోనసీమ రాజుగారు, ఒక గ్రాడ్యుయేట్, ఒక విలేఖరి, ఒక ఫోటోగ్రాఫర్, మంచి నటుడు, పెద్ద సినిమా హీరో, నలుగురు ఆడపిల్లల తండ్రి, సినిమా నిర్మాత, మెంబర్ ఆఫ్ పార్లమెంట్, కేంద్ర సహాయ మంత్రి వెరసి నిండు కుండలాంటి జీవితం మన కృష్ణంరాజు గారిది.

వారికి మన తాల్ మరియు యూకె తెలుగువారి ఘన నివాళి.

– పాలకొల్లు వంశీ కృష్ణ

# TAL ఉగాది వేడుకలు

## *with Proud Sponsors...*















# TAL ఉగాది వేడుకలు

## with Proud Sponsors...














# TAL ఉగాది వేడుకలు 2022




























# TAL ఉగాది వేడుకలు 2022

















# TAL ఉగాది వేడుకలు 2022




























# TAL ఉగాది వేడుకలు 2022















# TAL Children's Day వేడుకలు 2023


















# TAL Children's Day వేడుకలు 2023

















# TAL Children's Day వేడుకలు 2023































# TAL క్రిస్మస్ వేడుకలు 2022















Happy Christmas

# TAL సంక్రాంతి వేడుకలు 2023



















# TAL సంక్రాంతి వేడుకలు 2023



















TAL ఉగాది వేడుకలు

# TOLLYWOOD WORK SHIOP

















# తాల్ ఆధ్వర్యంలో జరిగిన...

భారతదేశ మాజీ ఉప రాష్ట్రపతి

# గౌ॥ శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు గారి

## సన్మాన కార్యక్రమ దృశ్యమాలిక

















# TAL ఉగాది వేడుకలు

## Kickoff Programmes...




















Telugu Association of London (TAL) has successfully conducted its flag ship sporting event the **"SUBHODAYAM TAL Premier League (TPL)"** Cricket Tournament this year. The mega final matches were played on Sunday 21st August 2022 at Indian Gymkhana Club, Osterley, TW7 4NQ. The final match was played between "Superstars" and "Vizag Blues" teams.

## TPL 2022

**Champions**
**SUPER STARS**
*Captain*
***Venugopal Krishna Navuluri***
Franchise Owner :
**Venugopal Krishna Navuluri**

**Runner Up**
**VIZAG BLUES**
*Captain*
***Sandeep Moova***
Franchise Owner :
**Sandeep Moova**

**2nd Runner Up**
**YODHAS**
*Captain*
***Anand Vemuri***
Franchise Owner :
**Anand Vemuri**

Man of the Series :
**Pavan Kumar Chesetty**
**(DJ WARRIORS Team)**

Best Bowler :
**Sai Kumar Poojari**
**(DJ WARRIORS Team)**

Best Batsman :
**Chandu Nuthalapati**
**(SUPERSTARS Team)**

Over 150 people and families attended this wonderful event and enjoyed the family fun filled day. The event started with National Anthems of both India and Britain and paid homage to all freedom fighters. Chief Guest Mayor of the London borough of Hounslow **Mr. Raghwinder Siddhu**, and Mrs Adriana Gheorghe – Councillor of Heston West with their gracious presence presented awards to the winners and other participants of the tournament.

Speaking at the post match presentation, TAL Sports Trustee Anita Nomula appreciated and thanked TPL-2022 In-charge **Mr Vasudeva Mayreddy** and TPL committee members **Sharath Putta & Mukesh Chakravarthy** for their tireless efforts and relentless commitment, saying that it wouldn't have been possible to conduct the TPL – 2022 Championship successfully with such high standards.

Anita Nomula also mentioned that since past 14 Years, TAL is conducting Cricket Tournament in UK, connecting many Telugu families across UK, Premium League model started in 2012 it's the biggest T20 Cricket League in Europe that is being organised by a community organisation. This year 12 teams played over 16 weeks, 74 matches by 240 players with full of sportsmanship and great quality of the games.




**TAL Chairman Bharathi Kandukuri** also spoke at the ceremony and Congratulated winners, runners and entire TPL franchise owners for making **SUBHODAYAM TPL-2022** successfully. Conveyed special thanks to TPL Advisors: **Ravi Sabba, Sharath Jetty, Sanjay Bhiraju and Sridhar Somisetty** and all the volunteers, core members for their continued support and advises to organise the Championship smoothly. Bharathi Kandukuri reminded that TAL was formed in 2005 with a motto **"UNITE CHERISH AND SHARE"** to serve Telugu community in Britain. On this occasion TAL Trustees, Advisors, Founder members and other life members were present in this celebration.

TAL TPL - 2022 Lead Mr Vasudeva Mayreddy thanked all the Franchise Owners, TAL Committee, Players and their families for their continued support throughout the tournament. TAL Fund Raising Trustee Mr Ravinder Reddy Gummakonda praised and thanked all TPL sponsors for their generosity and support of the TPL. On this occasion Membership Trustee Mr Anil Ananthula invited Non-life members who attend the event to Join TAL family.

# TPL - 2023 KICKOFF MEETING






TPL
TAL
PREMIER LEAUGE
2022






TELUGU ASSOCIATION OF LONDON (TAL)
TAL PREMIER LEAGUE - 2022
12 TEAMS
16 WEEKS
74 MATCHES
MEGA FINAL


12 TEAMS
16 WEEKS




SUPER STARS

# TPL

# TAL PREMIER LEAUGE 2022


















# TAL PREMIER LEAGUE

## WITH MAYOR TEAM













# TAL PREMIER LEAGUE
## (TPL 2023)

KICKOFF MEETING

*with franchise owners*





# TAL PREMIER LEAGUE
## (TPL 2023)
### COMMITTEE'S

**TPL Steering Commttee**


Anita R Nomula


Ravi Sabba


Vasu Mayreddy

**TPL Core Commttee**


Sharath Putta


Mukesh Chakravarthy Vippanapalli


Satya Pedireddi

**TPL Advisory Commttee**


Sanjay Bhiraju


Sridhar Medishetty


Srinivas Reddy

**TPL Disciplinary Commttee**


Sharath Jetty


Sridhar Somishetty


Vamsee Mohan Singaluri

# TAL PREMIER LEAGUE

## (TPL 2023)

### FRANCHISE OWNERS & CAPTAINS

| Franchise Name | Franchise Owner | Franchise Captain |
|---|---|---|
| Team - BLUE RANGERS |  Vasu Mayreddy |  Sathvick |
| Team - DJ Warriors |  Mukesh Chakravarthy |  Pavan Cheshetty |
| Team - Kings of Herts |  Rajinkanth |  Naresh Parchuri |
| Team - Rocking Royals |  Satya Pedireddi |  Harsha Kagitala |
| Team - Super Star's |  Venu Gopal Nuvuluri |  Krishna Chaitanya |

| Franchise Name | Franchise Owner | Franchise Captain |
|---|---|---|
| Team - Cool Cruisers |  Suresh Mangalagiri |  Sharath Putta |
| Team - IT Tree |  Vikas Parre |  Dhananjaya Maddukuri |
| Prime North Cricket |  Krishnakanth Nakka |  Krishna Angara |
| Spectrum Strikers |  Ravi Sabba |  Sanjay Bhiraju |
| Team - Vizag Blues |  Ravi Bandaru |  Sandeep Mova |




# My Path to LSE

- by SHARANYA VEMULA

Attending the London School of Economics was always a massive dream of mine since I learnt about the prestigiousuniversity and the variety of opportunities it has. My journey started at The Heathland School in Hounslow which offered me immense support throughout secondary and sixth-form schooling. I was able to learn a lot from my teachers and peers who always gave me great competition. I took part in activities such as Duke of Edinburgh and NCS which helped me boost my personal statement in year 12, allowing me to talk about the skills I gained through these experiences. I believe that Duke of Edinburgh is a fun experience, it allowed me to build teamwork skills and help me socialise morewith others in my year group.

Picking my A Levels was not a hard decision for me because I had a great passion for maths and an immense interest in current affairs, so I was able to easily choose my three choices, whichwere Maths, Further Maths and Economics. Doing Maths and Further Maths was quite scary at first due to the fast-paced learning, but lots of practice and resilience helped me excel through the course. Being the only girl in my school doing further maths was also quite intimidating, but it provided me with a greater sense of competition and motivation throughout the two-year course. Not being able to do GCSEs due to the pandemic was quite unsettling, as it meant that the A-level exams would be the first public exams Iwould sit and so made me quite anxious about the future. Throughout the two years, I made sure to have a good school-life balance, where I occasionally went out with my friends and family while also maintaining a good revision timetable, this boosted my confidence, preparing me for any scenario I faced in the future.

During the first year of sixth form, I made sure to explore work experiences in banking, which is the area of the industry I want to be in. This is something that helped me obtain various skills in communication and allowed me to gain insight into real-life scenarios while talking to current employees of banks such as HSBC and Morgan Stanley. Towards the summer of year 12, I started to explore what courses I want to study at university and what universities, other than LSE, I wanted to apply to. Initially, I was overwhelmed by the various universities there are in England. I was glad to receive amazing support from my older sister, Shravya, who went to Kings College London, during the whole process. She guided me through all the options and helped me decide what course is best for me. Not to mention, sitting with me while correctingseveral drafts of my personal statements. Without her, this process would have been much harder. My parents also played a large role in my acceptance as they encouraged me to pursue the path that I want and helped me in every way possible. They taught me to be patient and not stress about the weight that my exams had on my future.

Choosing what degree was not as tough as I thought it would be as I wanted to do Economics and my love for maths made me want to do it at university and LSE offered me just that. It became my first choice for my application and was followed by Warwick and UCL. After my application was sent off, it was a waiting game where it became the perfect opportunity for me to fully focus on my A-Levels.

During that waiting period, I constantly practised till I was confident about unsure concepts, I strengthened my weaknesses and sharpened my strengths so by the time it was exams I can be fully prepared. As time went by people in my year started receiving offers from their universities, I had also heard back from some that I applied but not from LSE, which started to worry me a little. Mid-March I received my offer from LSE, and I was overjoyed. I was extremely happy that I was one step closer to going to the university of my dreams. Then it was back to the routine of more revision, mocks and finally, exams. When results day came, I and my family were huddled around the small screen of my laptop, waiting for my grades and when I saw that I had got in, I jumped and down in joy. My hard work had paid off and I had made my parents and myself extremely proud. I was elated that I had gotten into the university of my dreams and could study the course that combines subjects that I love.

Now having completed Term 1 of my first year, I can say that going to LSE is one of the best decisions I have made. LSE allowed me to become more social and meet new people and form new bonds and new friends who have gone through the same process as me. I cannot wait for what the future holds, and I am excited to continue studying the subjects that I love and enjoy. Moreover, I would be happy to help anyone feel more comfortable about this process and support them by offering any advice they need.

## - by MOKSHA PALLAPOTHU



**Moksha Pallapothu** is Number 1 player for Berkshire in Under 15 category and ranked 7th in England Badminton rankings. Moksha started to play Badminton at the age of 6 when he saw his father playing and he encouraged him to play with him and from there on he started training and worked his ways up the ranks by training every week.

Moksha plays for Berkshire county team for U14,U16 and U18. Last year he was part of Berkshire team who won U16 Shires league. He also won many medals and trophies including winning Gold in singles at U15 Gold at Sheffield in 2022 and also a couple of months prior won Gold in singles at U13 Hertfordshire Gold Tournament. But his most significant achievement came at U13 National Championships where he won Bronze in Boys double narrowly missing out to go to the final.

Moksha currently trains at BJBA, Reading (Berkshire Junior Badminton Association) with Chris Tonks (Head Coach).
Moksha plans to be Number 1 for England and to continue playing the sport professionally.

## Lavanya Murki, Medicine Student at Imperial College, London.

I'm **Lavanya**, I'm 19 years old and I'm currently studying medicine at Imperial College London. The journey of getting into medicine is long, demanding and challenging which requires patience, perseverance and determination. However, I did not get into medicine without the support of so many others, to whom I owe this achievement.

My journey started in a state school close to our house, where I did my GCSEs and A levels. There are of course many challenges and obstacles involved in studying at a state school such as not having the correct resources or having a lack of support. However, I am grateful to have had a school that helped me and allowed me to take part in the human whipworm genome project and through this project I gained many invaluable skills. From the same state school, I completed my secondary school and sixth form education and continued my academic journey by pursuing medicine at university.

I would like to thank my parents for their constant help and encouragement in pursuing my dreams and ambitions. I am very grateful for the fact that they took care of me and supported me allowing me to focus on my studies. My parents instilled within me a curiosity to learn and a mindset to be optimistic and ambitious from a young age.

I am also very grateful to have such supportive and compassionate siblings. My sister and brother have always been there to believe in me and to support me. I am especially thankful to have had my sister guiding me throughout my whole journey of getting into medical school, as she herself studies medicine too.

Medicine is such a noble degree, and I am so lucky to be able to study it. In the future, I look forward to becoming a doctor and helping people.

# " సంపాదక తపస్వి "

స్వాతి బలరామ్

తెలుగు పత్రికారంగంలో స్వాతి ఒక ప్రభంజనం. పత్రిక రచనల నాణ్యతల నిర్ణయంలో, కొత్త వారిలోని టాలెంటిని గుర్తించి, అవకాశం ఇచ్చి, ప్రోత్సహించి ఉత్తమ రచనలను పాఠకులకు పంచటం స్వాతి విజయానికి కారణమైతే, ఆ విజయ ఒరవడిని సృష్టించిన సంపాదకుడు వేమూరి బలరామ్ గారు. పత్రికారంగంలో గతంలో స్థిరపడిన అంశాలన్నింటినీ తిరగరాసిన సాహసి స్వాతి బలరామ్ గారు. పాఠకులను దేవుళ్ళుగా పలకరించటం గతంలో ఏ పత్రికా చెయ్యలేదు. మనం ఇచ్చింది పాఠకుడు చదవాలన్న ధోరణిలో పత్రికలు నడుస్తున్నవేళ, పాఠకులు ఏమి కోరుకుంటున్నారో తెలుసుకుని, దానికి అనుగుణంగానే పత్రికను రూపొందించి పాఠకదేవుళ్ళకు 'స్వాతి' నైవేద్యం సమర్పించిన సాహిత్య పూజారి శ్రీ వేమూరి బలరామ్ గారు.

కవులు, రచయితలు, పండితులకు మాత్రమే సంపాదక స్థానం అనే నమ్మకం బలంగా నడుస్తున్న వేళ ఒక మంచి పాఠకుడు సంపాదకుడిగా వ్యవహరిస్తే మరిన్ని మంచి రచనలు సమాజానికి అందుతాయని విశ్వసించి అమలుచేసి విజయం సాధించిన పాఠక సంపాదకుడు స్వాతి బలరామ్ గారు.

కథ అంటే ఇలా వుండాలి... ప్రతి కథ కంచికి చేరే సందేశం ఉండాలన్న మూసధోరణిలో రచయితలు ఉన్న వేళ, సమాజంవైపు చూసి, అక్కడ జరుగుతున్నది గమనించి రచనలు చేయండి, మీకు నచ్చిన వాటితోపాటుగా పాఠకులు కోరుకునేవి రాయండి.

మీకు అండగా నేను, నా స్వాతి తల్లి నిలుస్తామని హామీ ఇచ్చి రచయితలు, రచయిత్రిలు స్వాతి సంపాదకుడి మార్గంలోకి నడిచేలా చేయించిన ప్రాక్టికల్ సంపాదక సారథ్యం స్వాతి బలరామ్ గారు నిర్వహించారు. కొత్తతరం కలాలు కొంగొత్తరీతిలో రచనలు చేసి పేరు తెచ్చుకుని, సాహితీరంగంలో స్థిరపడింది సంపాదకులు బలరామ్ సాహచర్యంలోనే.

స్వాతే ఊపిరి. స్వాతి సంపాదక నిర్వహణే పవిత్ర పూజ. ఉదయం లేచినప్పటినుండి పడుకునేవరకు స్వాతి తలంపే. ప్రతి అక్షరం, ప్రతి వాక్యం, కథ, నవల ఏదిఅయినా తనచేతిమీదుగా పాఠకుల ముంగిటకి చేర్చటం ఒక బాధ్యతగా స్వీకరించారు వేమూరి బలరామ్ గారు. కష్టపడి పనిచేయకు, ఇష్టపడి పని చేయి అనే సూత్రాన్ని యాభై ఏళ్ళ క్రితమే మనసులో స్థిరపరుచుకున్న బలరామ్ గారు తన జీవితం మొత్తం స్వాతి తల్లికి అంకితంచేశారు.

ప్రతి సంచికను ఒక ప్రత్యేక సంచికగా తయారు చేయటం స్వాతి బలరామ్ గారికే చెల్లింది.

గ్రామం, పట్టణం, నగరం, ప్రపంచంలోని ఏ మారుమూలకైనా గురువారం ఉదయాన్నే చేర్చి, 'స్వాతి స్వాగతం' పాఠకులను నిద్రలేపి, గురువారాన్ని తెలుగువారంతా స్వాతివారంగా గుర్తుపెట్టుకునేలా చేయటం బలరామ్ గారు సాధించిన అతి పెద్ద విజయం. సంపాదకం విషయంలో కొత్త ఒరవడి తీసుకువచ్చింది బలరామ్ గారు.

చిరుచినుకుల్లా మనసుకు ఆహ్లాదం పంచే పదాలతో ఆయన సృష్టించి కురిపించిన 'స్వాతి చినుకులు' దేశంలోని అన్ని భాషాప్రాంతాలలో విస్తరించి, మిగిలిన భాషా సంపాదకులందరికీ కొత్తబాట ఇది అని చూపించారు స్వాతి బలరామ్ గారు.

ఆంధ్రదేశంలోని కృష్ణాతీరాన ఒక సాదాసీదా రైతు కుటుంబంలో పుట్టి, ఉన్నత చదువులకు కుటుంబపరంగా ప్రోత్సాహం లభించనివేళ, నా దారి నేను వెతుకుతాననే సాహసిగా బయలుదేరి భాగ్యనగరంలో కాలు పెట్టిననాడే బలరామ్‌గారు సాహస జీవితం మొదలైంది.

స్థిర ఆదాయ ఉద్యోగం కాదు, మనసుకు నచ్చిన పనిచేయటంలో ఆనందం, తృప్తి ఉన్నాయి అంటూ సాహితీ సేద్యం ప్రారంభించారు. బలరామ్ గారి సాహితీ సేద్యంలో ఎన్నెన్ని కొత్త ప్రయోగాలు, విలువైన సాహితీ పంటలు పండాయో లెక్కలేదు.

స్వాతి పంటలరుచిని అనుభవించటం 1970లో మొదలు పెట్టిన పాఠకులు 53 సంవత్సరాల తర్వాత కూడా బలరామ్ గారి సాహితీ సేద్య స్వాతిలో నుండి ఎప్పటికప్పుడు వస్తున్న కొత్త రుచులను ఆస్వాదిస్తున్నారు. సుదీర్ఘకాలం ఒక పత్రికను నడిపిన రికార్డు స్వాతి బలరామ్ గారిది, ఐదుదశాబ్దాల పైచిలుకు సంపాదక సారథ్యం వహించినవారు మరొకరు లేరు.

స్వాతి స్వర్ణోత్సవం, బలరామ్ గారి నిజజీవిత వజ్రోత్సవం దాటినా స్వాతి బలరామ్ గారు మాత్రం నిత్యయవ్వనులు. బలరామ్ గారి మనసు సున్నితం. కొత్తదనంకోసం ఆయన దృష్టి ఎప్పుడూ

వెతుకుతుంటుంది. ఆ శ్రమ, పట్టుదల, కృషి స్వాతి బలరామ్ గారికి ఖండాంతర ఖ్యాతి తెచ్చిపెట్టింది.

తెలుగువారి జ్ఞానపీఠ్ సినారే వంటి కవి కొనియాడిన లోక్‌నాయక్ ఫౌండేషన్ అవార్డు, తెలుగు వారి ఇలవేల్పు ఎన్టీఆర్, తెలుగు లోగిళ్ళలో నిత్యం తన కంఠం నిలిపిన మధుర గాయకుడు ఘంటసాల శతజయంతి సందర్భంగా జీవన సాఫల్య పురస్కారాలు స్వాతి బలరామ్ గారిని వరించాయి. ఆయన ఇంకా ఎన్నో అవార్డులకు అర్హుడు.

గిన్నీస్ బుక్ వారు గుర్తించాల్సిన సుదీర్ఘకాల సంపాదకుడు. రచయతలను గౌరవించటంలో స్వాతి బలరామ్ గారికి సాటిగా నిలవగలిగిన పత్రికాధిపతులు, సంపాదకులు మరొకరు ఉండరు.

అక్షరం విలువ తెలిసిన మనిషి, పత్రికా వ్యాపార పరంగా కాక సాహిత్య సేవగా భావించి ప్రారంభించినవారు. నాటకాలలో నటుడిగా వెలిగారు. కలం పట్టి సంపాదకీయాలను వెదజల్లారు. ఎందరెందరో పాతతరం రచయితలను ఆదరించారు. స్నేహశీలిగా ఎందరికో దగ్గరయ్యారు.

ప్రతి తరంవారితో కలిసిపోయి. వారిలో ఒకరిగా మెలగ గలిగిన బలరామ్ గారి మనస్తత్వమే ఆయనకు శ్రీరామరక్ష. మరెన్నో సంవత్సరాలు బలరామ్ గారు స్వాతి సాహిత్య సేద్యం విజయవంతంగా కొన సాగించాలన్నది తెలుగువారందరి కోరిక.



దుబాయ్‌లో జరిగిన ఎన్టీఆర్-ఘంటసాల శతజయంతి ఉత్సవాలలో ఎన్టీఆర్-ఘంటపాల శతాబ్ది అంతర్జాతీయ జీవన సాఫల్య పురస్కారంతో శ్రీ వేమూరి బలరామ్ గారిని సత్కరిస్తున్న శ్రీయుతులు తెలంగాణ ముఖ్య ఎన్నికల కమీషనర్ సి.పార్థసారథి, హీరో డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, తోట రామ్కుమార్, డాక్టర్ మహ్మద్ రఫీ, చేరాల నారాయణ



# “ నాటు నాటు నాటు ”

మాధురి ఇంగువ

“కవయా క్రాంతి దర్శనః” అన్నది ఒక ఆర్యోక్తి. ఆ ఆర్యోక్తిని నిజం చేస్తూ, ‘రవి గాంచని చో కవిగాంచున్’ అన్నట్టు భవిష్యత్తుని గాంచి, గేయాలెన్నో అల్లిన తెలుగు సినీ గేయ రచయిత ఆయన. ప్రాచీనాధునిక సాహిత్యాలను లోతుగా చదివి “నాన్ ఋషి: కురుతే కావ్యం” అన్నది నిజమని నిరూపించేలా సహితీ తపస్సు చేసిన కావ్యాఋషి ఆయన.

తాను రాసిన గేయాలలో ఎన్నో పంక్తులు ఋషి వాక్యాలవలే నిజాలైన వైనాలు కోకొల్లలు!

అందుకే

“తగిలే రాళ్ళను పునాది చేసి ఎదగాలని, తరిమేవాళ్లని హితులుగ తలచి ముందుకెళ్లాలని, కన్నుల నీటిని కలల సాగుకై వాడుకోవాలనీ”

అని రాసిన ఆ కలంతోనే

“ఏవడ్రా ఎవడ్రా నువ్వు?<br>
రాయిని రాయిని నేను<br>
గాయంగానీ చేశారంటే<br>
ఖాయంగానే దేవుణ్ణవుతాను”

అన్నాడు ఆత్మవిశ్వాసంతో.

“నవ్వే వాళ్లు నవ్వనీ ఏడ్చే వాళ్లు ఏడ్వనీ, పొగిడే వాళ్లు పోగడనీ తిట్టే వాళ్లు తిట్టనీ డోంట్ కేర్” అని ఏదో ఒకనాడు అనాల్సి వస్తుందని ముందే ఊహించినట్టు రాసిన కవి ఆయన.

ఆ కవిరించి’లోని శారదాంశ నేడు జగజ్జేతగా నిలవడం అన్నది చరిత్ర సైతం చదవని కొత్త అధ్యాయం. ఆయనే తెలుగు సినీ గేయ రచయిత, ప్రపంచ ప్రఖ్యాత గోల్డెన్ గ్లోబ్ అవార్డు పొందిన “నాటు నాటు నాటు” పాట రచయిత శ్రీ చంద్రబోస్ గారు.

ఈ శిఖరం చేరే యాత్రలో ఆయన బాటని ఆయనే నిర్మించుకున్నారు. బహుశా ఈ శుభతరుణం తప్పక వస్తుందన్న నమ్మకంతోనేనేమో

“ఎవరేమి అనుకున్నా,<br>
నువ్వుండే రాజ్యాన రాజూ నువ్వే,<br>
బంటూ నువ్వే, మంత్రీ నువ్వే సైన్యం నువ్వే,<br>
ఏమైనా ఏదైనా నువ్వెళ్లే బడిలోన<br>
పలక నువ్వే, బలపం నువ్వే, ప్రశ్న నువ్వే, బదులు నువ్వే”

అని శంఖంలా ఘోషించారు.

“చెమట నీరు చిందగా, నుదిటిరాత మార్చుకో, మార్చలేనిదేదీ లేదని గుర్తుంచుకో.”

అని నిరూపించారు. ఒకరికి తాను ప్రేరణ ఇచ్చే గీతాలు రాయడమే కాదు, అవి తనజీవితానికి కుడా అన్వయించుకొని, సాధనతో నిజం చేసుకున్నారు.

ఆ కడలికి కెరటాలెన్నో ఆయన కలానికి భావవైశిష్ట్యాలు ఎన్నో.

“పెదవే పలికిన మాటల్లోనే తీయని మాటే అమ్మ”

“కనిపెంచిన మా అమ్మకే అమ్మయ్యానుగా” అని మాతృప్రేమని ఒలికించిన కలంతోనే

“ తెలుగు భాష తీయదనం, తెలుగు జాతి గొప్పదనం తెలుసుకున్న వాళ్లకి తెలుగే ఒక మూలధనం”

అంటూ సమస్థాయిలో మాతృ భాషాభిమానాన్ని కుడా చాటారు. ఆ మాతృభాషా మూలధనంతోనే ఈనాడు, గోల్డెన్ గ్లోబ్ అవార్డు కైవశం చేసుకునే స్థాయికి ఎదిగారు. ఆ ఎదగడంలో భాగంగా

“ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి ఇక్కడే కలిశాము చదువులమ్మ చెట్టు నీడలో”

అన్నట్టు “కళా– మతల్లి” ముద్దు బిడ్డలు అందరూ ఆయన ప్రయాణంలో కలిశారు. వారిలో ముఖ్యంగా చెప్పుకోవలసిన వారు , మొదటి అడుగు నించీ చంద్రబోస్ గారిని వెన్నుతట్టి ప్రోత్సహిస్తూ నేడు, ప్రపంచ ప్రఖ్యాత గోల్డెన్ గ్లోబ్ అవార్డు సాధించిన మన తెలుగు సంగీత దర్శకుల, శ్రీ ఎం.ఎం.కీరవాణి గారు.

చంద్రబోస్ గారిలోని భావకవిత్వపు ప్రణయ రసఝరికి “మెచ్చుతునక” ఈ పంక్తులు

“కడవని నువ్వు నడుమునబెట్టి<br>
కట్ట మీద నువ్వు నడిసొస్తూ ఉంటే,<br>
సంద్రం నీ సంకెక్కినట్టు” అంటూ లోతైన అభివ్యక్తి చేయడంలో, ఎంతో సునిశిత సౌందర్య పరిశీలనా శక్తి ఇమిడి ఉంది .

“నీ యెనకే యెనకే అడుగేత్తాంటే<br>
ఎంకన్న గుడి ఎక్కినటుంది

నీ పకాపక్కన కూసుంటాంటే
పరమేశ్వరుడే దక్కినట్టుంది"

అన్న సాహిత్యంలోని భాష జానపదం అయినా భావసాంద్రత మాత్రం కావ్యసమానం. నిజానికి ఇటువంటి వర్ణన కావ్యాలలో సైతం కానరాదు.

" నిశబ్దంలోన, నీ గుండెచప్పుడై ఉంటా తోడుంటా,
శబ్దాలెన్నున్నా నీ రెప్పల చప్పుడే వింటా.. నే వింటా
చేదు కలలకు మెలకువలాగ వస్తా
బాధ మెలుకుంటే నిదురై కాపు కాస్తా"

అన్న లోతైన, పరిపూర్ణమైన భావాల ప్రకటన ఏ కవికీ సాధ్యం కాదేమో!.

"నందేమో నాన్నకీ, సింహం మీ అమ్మకీ వాహనమై ఉండలేదా,
ఎలకేమో తమరికి, నెమలేమో తంబికీ
రథమల్లే మారలేదా,
పలుజాతుల భిన్నత్వం కనిపిస్తున్నా
కలిసుంటూ ఏకత్వం బోధిస్తున్నా"

అంటూ భక్తి పాట రాసినా అందులో సామాజిక ప్రయోజనం చేకూర్చే పదునైన యోచన ఉంది.

"నువ్వే నడిచేటి తీరుకే
తారలు మొలిచాయి నేలకే
నువ్వే వదిలేటి శ్వాసకే
గాలులు బ్రతికాయి చూడవే"

లాంటి గాఢమైన భావకవిత్వపు ఆలోచన రావాలంటే ఎంతో లోతైన ప్రేమ అనే భావోద్వేగం నిక్షిప్తం అయి ఉండాలి కవి రసహృదయంలో.

"సంగీతం - సప్తస్వర సాంగత్యం
వేదౌషధ మంత్రం
సంసారం - ఏడడుగుల సంబంధం
ఒడిదుడుకుల నిలయం
శృతిలయ తెలిపే అనుబంధాలు
బ్రతుకును నడిపే భవబంధాలు.
ఆదీ-అంతం ఒకటే అనుటకు
సరిగమపదనిస తగు సాక్ష్యాలు."

సంగీతాన్నీ సంసారాన్నీ ముడిపెట్టిన జీవన గీతాసారమిది.

ఇన్ని విభిన్న భావాల దారులలో ప్రయాణం చేసి ఈనాడు శిఖరాగ్రాన చేరి

"తనొంక తానే తలెత్తి చూస్తాదే" అన్న తన మాట తానే నిజం చేసుకున్న గోల్డెన్ రచయిత శ్రీ చంద్రబోస్.

ఆ "స్వర్ణగోళ" పురస్కారం అందుకున్న పాట నేడు ప్రపంచమంతా ప్రభంజనంలా అన్ని దిక్కులా వినిపిస్తోంది.

ఒక్కసారిగా కోట్లమంది హృదయం కొల్లగొట్టిన పాట - ప్రపంచవేదిక మీద తొలిసారిగా ఆసియాఖండం నుండి, అందునా మన తెలుగు గడ్డ నుండి దూసుకు వచ్చిన పాట - "గోల్డెన్ గ్లోబ్ 2023 - బెస్ట్ ఒరిజినల్ సాంగ్" అవార్డు కైవసం చేసుకున్న "నాటు నాటు నాటు" పాట.

"RRR" చిత్రం కోసం కీరవాణి గారి సంగీత సారథ్యంలో గీత రచయిత చంద్రబోస్ గారు రాసిన అచ్చ తెలుగు జానపద నృత్య గీతం"నాటు నాటు నాటు " . ఈ పాటని ఇష్టపడని తెలుగువాడు ఉండడు.

"ఇది మన పాట, మన తెలుగుదనం ఉన్న పాట, వీక్షకులు అవాక్కయ్యేలా మన అభిమాన హీరోలు స్టెప్పులు వేసిన పాట. కనక మనకి నచ్చింది. మరి పాశ్చాత్య దేశాలలోని నూట అయిదుగురు జ్యూరీ సభ్యులకు ఎందుకు అంతలా నచ్చింది? లేడీ గాగా, టేలర్ స్విఫ్ట్, రెహానా వంటి ప్రపంచ ప్రఖ్యాత గాయనీమణుల పాటలను వెనక్కి నెట్టి, గోల్డెన్ గ్లోబ్ అవార్డును కైవసం చేసుకొనే అంత గొప్పతనం ఆ పాటలో ఏముంది?"

అన్న విషయాలు ఆయన ద్వారానే తెలుసుకోవాలన్న కుతూహలంతో గీతరచయిత చంద్రబోస్ గారిని సంప్రదించినప్పుడు , ఆ పాటలోని సాంద్రత బోధపడేలా ప్రతీవాక్యానికీ అర్థం వివరించి చెప్పారు. ఆయన చెప్పిన అర్థం ఇలా నా వాక్యాల్లో మీ ముందు ఉంచుతున్నాను.

ముందుగా ఆ పాటను ఒక్కసారి ఆసాంతం గమనిద్దాం.

పల్లవి:-

పొలంగట్టు దుమ్ములోన
పోట్లగిత్త దూకినట్టు
పోలేరమ్మ జాతరలో
పోతరాజు ఊగినట్టు
కిర్రు సెప్పులేసుకొని
కర్రసాము సేసినట్టు
మర్రిసెట్టు నీడలోన
కుర్రగుంపు కూడినట్టు
ఎర్రజొన్న రొట్టెలోన
మిరపతొక్కు కలిపినట్టు

నా పాట సూడు
నా పాట సూడు
నా పాట సూడు
నాటు నాటు నాటు నాటు నాటు నాటు వీర నాటు
నాటు నాటు నాటు నాటు నాటు నాటు ఊర నాటు
నాటు నాటు నాటు పచ్చి మిరపలాగ పిచ్చ నాటు
నాటు నాటు నాటు విచ్చు కత్తిలాగ వెర్రి నాటు
చరణం1#
గుండెలదిరిపోయేలా
దండనకర మోగినట్టు
సెవులు సిల్లు పడేలాగ
కీసుపిట్ట కూసినట్టు
ఏలు సిటికలేసేలా యవ్వారం సాగినట్టు
కాలు సిందు తొక్కేలా దుమ్మారం రేగినట్టు
ఒళ్ళు సెమట పట్టేలా వీరంగం సేసినట్టు
నా పాట సూడు
నా పాట సూడు
నా పాట సూడు నాటు నాటు నాటు నాటు
నాటు నాటు.. వీర నాటు
నాటు నాటు నాటు నాటు నాటు నాటు....ఊర నాటు
నాటు నాటు నాటు... గడ్డపారలాగ చెడ్డ నాటు
నాటు నాటు నాటు.... ఉక్కపోతలాగ తిక్క నాటు
చరణం 2#
భూమి దద్దరిల్లేలా
ఒంటిలోని రగతమంతా
రంకెలేసి ఎగిరేలా
ఏసేయ్ రో ఎకాఎకీ
నాటు నాటు నాటు... వాహ్.. ఏస్కో
అరె దుమ్ము దుమ్ము దులిపేలా
లోపలున్న పానమంతా దుముకు దుముకులాడేలా
దూకెయ్ రో సరాసరి
నాటు నాటు నాటు

—**—

ఈ పాట రాయవలసిన నేపథ్యం గురించి దర్శకులు రాజమౌళి గారు గీతరచయిత చంద్రబోస్ గారికి చెప్పినప్పుడు 'ఇది నృత్య ప్రధానగీతం, సాహిత్యంలో సబ్జెక్ట్ మాత్రం మీ ఇష్టం' అని పూర్తి స్వేచ్ఛని ఇచ్చారుట. 'నృత్య ప్రధాన గీతం కాబట్టి, చిత్రం ప్రకారం వందేళ్ళ క్రితం నాటి కథ కాబట్టి- ఆనాటి పల్లె ప్రజల నృత్యంలో ఉన్న ఊపు, వేగం, నాటుదనం, తెలుగుదనం గురించి ఈనాటి యువతకు అర్థం అయ్యే రీతిలో అచ్చతెలుగు పదాల అల్లికతో ఒక పాట రాయాలి' అని భావించారు చంద్రబోస్ గారు. ఇలాంటి చక్కని సందర్భం, స్వేచ్ఛా దొరికినప్పుల్లా తెలుగు భాషాభిమానాన్ని చాటుకుంటూనే ఉన్నారు ఆయన. ఈ పాటలో అంతర్లీనంగా ఉన్న ఎన్నో అంశాలలో ఒకటి – కథలో రామ్ ఆంధ్రా నించీ, భీమ్ తెలంగాణ నించీ వస్తారు కనక, ఆయా మాండలికాలు కుడా అక్కడక్కడా స్పృశించారు రచయిత. ఇంకా లోతుగా గమనించే కొద్దీ అంతర్లీనంగా ఎన్నో ప్రత్యేకత అంశాలు ఉన్నాయి ఈ పాటలో. అవన్నీ ఈ వ్యాసంలో ముందుకెళ్ళే కొద్దీ సంపూర్ణంగా తెలుస్తాయి. ఈ నాటు పాట ఇప్పటి మాస్ సాంగ్ అనే పదానికి అప్పటి తెలుగు రూపం. అప్పట్లో నాటు – మోటు – మొరటు వంటి అచ్చతెలుగు పదాలు వాడేవారు పల్లెల్లో.

ఈ నాటు పాటలో నృత్యం ఎలా ఉండబోతోందో పల్లవిలోనే చెప్పారు కవి.

"పొలంగట్టు దుమ్ములోన పోట్లగిత్త దూకినట్టు"
అనడంలో ఒక పల్లె పౌరుషం కనిపిస్తుంది.

" పోలేరమ్మ జాతరలో పోతరాజు ఊగినట్ట"
అనడంలో పల్లె సంప్రదాయ నృత్యంలో ఉన్న భక్తి, చిన్న గగుర్పాటుతో పాటు గొప్ప ఊపు, వేగం, పారవశ్యం... తెలీకుండానే పక్కవాడి చేత కూడా కాలు కదిపించే గుణం కనిపిస్తుంది

" కిర్రు సెప్పులేసుకొని కర్రసాము సెసినట్టు "
అనడం ఒక కుర్రకారు సాహస విన్యాసాన్ని సూచిస్తుంది.

" మర్రిసెట్టు నీడలోన కుర్రగుంపు కూడినట్టు"
అంటే ఒక సంఘటిత యువశక్తికి సూచకం.

"ఎర్రజొన్న రొట్టెలోన మిరప తొక్కు కలిపినట్టు"
అనడం ఆనాటి మన వ్యవసాయ సంప్రదాయాన్ని, ఆర్థిక స్థితినీ, ఆహారపుటలవాట్లనీ, అదిచ్చే చేవనీ సూచిస్తుంది.

పల్లవిలో ఆ నాటు నాట్య విన్యాసాలను- ఆనాటి మన సామాజిక అంశాలలోని చేవతో పోల్చారు.

మొదటి చరణంలో... ఆ నృత్యం వల్ల ఒంట్లోని ప్రతీ అంగం ఎలా పూనకాలతో పులకరించిపోతోందో చెప్పారు చంద్రబోస్ గారు.

" గుండెలదిరిపోయేలా దండనకర మోగినట్టు
సెవులు సిల్లు పడేలాగ

కీసుపిట్ట కూసినట్టు
ఏలు సిటికలేసేలా యవ్వారం సాగినట్టు
కాలు సిందు తోక్కేలా దుమ్మారం రేగినట్టు
ఒళ్ళు సెమట పట్టేలా వీరంగం సేసినట్టు"

అనడంలో ఆ పల్లె నాటు నృత్యానికి గుండె అదురు పెరిగి, వేళ్లతో చిటికెలు వేసి, కాలు కదం తొక్కి, ఒళ్ళు చెమట పట్టి ఆపాదమస్తకం పరవశంతో ఊగిపోతుంది అని స్వభావోక్తి అలంకారం స్ఫురించేలా చెప్పారు కవి. ఇక్కడ కీసుపిట్ట గురించి చెప్పుకోవాలి, ఇదేదో పిచ్చుకలాగా కాలగర్భంలో కలిసిపోయిన పిట్ట కాదు, తెలంగాణా మాండలీకంలో కీసుపిట్ట అంటే ఈల వేయడం.ఇది పాతకాలం నాటి పల్లెపదం.

అలాగే రెండో చరణంలోని ఉపమానాలలో కవితాత్మక భావావేశం గోచరిస్తుంది.

"భూమి దద్దరిల్లేలా... ఒంటిలోని రగతమంతా రంకెలేసి ఎగిరేలా,
దుమ్ము దుమ్ము దులిపేలా
లోపలున్న పానమంతా దుముకుదుముకులాడేలా"

అనడంలో, వేగం హెచ్చిన నాట్యం వల్ల రక్తం అంతా ఎగజిమ్మడాన్ని కూడా రోషంగా, కవితాత్మకంగా..."రగతమంతా రంకెలేసి ఎగరడం" అంటూ పౌరుషాన్నీ, పోటీతత్వాన్ని సూచించేలా గొప్పగా భావవ్యక్తీకరణ చేశారు రచయిత.

"లోపలున్న ప్రాణం అంతా ఆవేశంగా ఉప్పొంగింది" అనే ఉత్ప్రేక్షని తెలంగాణా మాండలీకంలో "లోపలున్న పానమంతా దుముకు దుముకులాడటం" అంటూ కవితాత్మకంగా వ్యక్తపరిచారు చంద్రబోస్ గారు.

అలాగే, తొక్కు, కీసుపిట్ట, పానం దుముకులాడటం వంటి తెలంగాణ మాండలీకాలనీ, వాటితోపాటే ఆంధ్రా మాండలీకాలనీ కూడా సమానంగా పాటనిండా పోదిగారు రచయిత.

కళారూపం ఏదయినా... అది ప్రజల వాడుక మాటల్లో ఉన్నప్పుడే అది అన్ని వర్గాల వారిని చేరి సంపూర్ణత్వం సంతరించుకొని పదికాలాల పాటు నిలబడుతుంది.

ఇంత భావసాంద్రత ఉన్న ఈ పాటను "గోల్డెన్ గ్లోబ్" జ్యూరీలోని సభ్యులయిన దర్శకులు, రచయితలు, విమర్శకులు, సామాన్య శ్రోతలు, విభిన్న విభాగాలకు చెందిన నూటయిదుగురు జడ్జీలు, ఆంగ్లంలోకి అనువదించుకొని, ప్రతీ మాటను క్షుణ్ణంగా అవగతం చేసుకొని, అందులో అభ్యంతరకరమైన అంశాలు కానీ, ఎవరి మనోభావాలు దెబ్బతినే అంశాలు కానీ లేవని ఒకటికి వందసార్లు గమనించుకొని, భావవ్యక్తీకరణ శైలిని కుడా గమనించి ఒక నిర్ణయానికి వచ్చారు, శ్రోతల ఉత్సాహం ద్విగుణీకృతం చేసే గొప్ప సంగీతం అందించిన కీరవాణి గారి బాణీ కుడా, నూటైదుగురు జ్యూరీ సభ్యులకు వంక పెట్టడానికి లేనివిధంగా నచ్చి ఈ గోల్డెన్ గ్లోబ్ 2023 అవార్డుని సగర్వంగా ప్రకటించారు.

ఈ పోటీలో ప్రపంచ ప్రఖ్యాత గాయనీమణులు, లేడీ గాగా, టేలర్ స్విఫ్ట్, రెహానా వంటి వారిని దాటుకొని ఒక తెలుగువాడి పాట గెలిచింది. ఆసియా ఖండం నించి తొలిసారిగా, నిజానికి భారతదేశం నుండి కుడా తొట్టతొలిసారిగా ఒక సంగీత దర్శకుడు, గీత రచయిత ఈ గోల్డెన్ గ్లోబ్ అవార్డు దక్కించుకోవడం, తెలుగు పాట ఘనతను లోకానికి సగర్వంగా చాటిచెప్పడం అనేది చారిత్రకం. ఆ సంగీత దర్శకుడు – గీత రచయిత మన తెలుగువారైన కీరవాణి గారు చంద్రబోస్ గారు అవడం ప్రతీ తెలుగోడి గుండెకీ ఆనందదాయకం.

"చరిత్రలో నీకో కొన్ని పెజీలుండాలి"

అని తన కలంతో చెప్పి ఆగక, దాన్ని నిజం చేసి చూపించారు చంద్రబోస్ గారు.

ఈ సందర్భంగా, గోల్డెన్ గ్లోబ్ అవార్డు గ్రహీత శ్రీ కీరవాణి గారికీ, శ్రీ చంద్రబోస్ గారికి ప్రతీ తెలుగు ప్రేక్షకుడి తరపున శతాధిక శు భాకాంక్షలు. త్వరలో మీరు ఆస్కార్ అవార్డు కుడా గెలుచుకొని మరోసారి చరిత్ర సృష్టిస్తారని నమ్ముతున్నాము.

జైహింద్.

**మాధురి ఇంగువ**
రచయిత్రి
USA

<u>రచయిత్రి గురించి</u>:–

**మాధురి ఇంగువ**

MA తెలుగు.

రేడియో జాకీ, న్యూస్ ప్రెజెంటర్, ఆంకర్, డబ్బింగ్ ఆర్టిస్ట్ గా 15 ఏళ్ల అనుభవం. 30 యేళ్ళుగా రచయిత్రిగా, వీణాకారిణిగా గుర్తింపు. ప్రస్తుతం కెనడా, న్యూజిలాండ్, ఇంగ్లండ్, అమెరికా లో నివసించిన డయాస్పోరా నవలా రచయిత్రిగా పలు ఆన్లైన్ పత్రికలలో గుర్తింపు.



# " నేనే జనతా!! "

రవి కిషోర్ పెంట్రాల

**నేనే జనతా!!**

ప్రజలు సమూహం సమాజం
సైన్యం సమస్తం నేనే
మహాద్భుతమైన పనులనెన్నో
ప్రపంచంలో చేసింది నేనే!

పొలాల్లో పంటలు పండించిందీ
ఫ్యాక్టరీల్లో చెమట చిందించిందీ నేనే
కూడూ గుడ్డా గూడూ నీడా
మేడా మోటారు సృష్టించిందీ నేనే!

భయంకర తుఫానులు మీదపడినా
పీడకలలనుకోని మరిచిందీ నేనే
అరుదైన సంపదలన్నీ దోచుకున్నా
ప్రాప్తంలేదని వదులుకుందీ నేనే!

శ్రమశక్తిని నిలువెల్లా దోపిడీజేసినా
ఎదిరించలేక బెదిరిందీ నేనే
బండచాకిరీజేసి కడదాకా కూడబెట్టి
మరణంతో పోగొట్టుకుందీ నేనే!

జరిగిన చరిత్రను ప్రేక్షకుడిగా
కళ్లారాజూచిన సాక్షినీ నేనే
హక్కులకై పోరాడిన వీరుల
పోరుకు భుజందట్టి పంపిందీ నేనే!

ధీరులు సమరంలో అమరులైతే
ఇంకొందరిని తయారుజేసి పంపిదీ నేనే

బంగారు నల్లరేగడి భూమిని నేను
అందులో కోట్లసైన్యం పుట్టింపజేసిందీ నేనే !
అప్పుడప్పుడు అసహనం
అరకొరగా అక్కడక్కడా చూపిందీ నేనే
చరిత్రలో గుర్తుగా ఎర్రసిరాతో
నాలుగు ముక్కలు లిఖించిందీ నేనే!

వార్తమానపు ప్రస్తుతంలో
గతచరిత్ర యాదు మరిచిందీ నేనే
దారుణాలు దాష్టికాలు జరుగుతుంటే
చేష్టలుడిగి నిలిచి చూస్తుందీ నేనే!

కుయుక్తుల ఎత్తుగడల వెనుకమర్మాలు
గతంలోకిజూసి ఒడిసి పట్టిందీ నేనే
చేతగాని సంఘమని విర్రవీగిన
అహంకారుల నోర్లమూయిస్తుందీ నేనే!

పిచ్చివాళ్లనుజేసి ఆడించేవాళ్లను
వారి ఆలోచనల తీరును గుర్తించిందీ నేనే
ఎదిరించిందీ ఎదుర్కొంటున్నదీ
పోరాడుతుందీ నేనే ప్రజలు సమాజం నేనే!

**నా గొడవ!**

నా రచనలు నీ గురించి కాదులే
అక్షరాల్లో అక్కడక్కడా ఉన్నావేమోలే
తీక్షణంగా వెతికినా గుర్తించలేవులే
చివరిలైనులోపు నీ ఊసులే వుండవులే!

అంతర్లీనంగా మూలనెక్కడో కనపడొచ్చు
మెల్లగా కైతనొదలడానికి సిద్ధపడ్తుండొచ్చు
పరవాలేదులే నీ గొడవలేకనే సాగించొచ్చు
శ్లేషలు వర్ణనలు ప్రాసలతోనే ముగించొచ్చు!
పదాలు ప్రాణంలేని బొమ్మలేగావచ్చు
పొడిపొడి రంగుల ప్లాస్టిక్ పూలేగావచ్చు
సువాసనల ఆనవాళ్లే దొరక్కబోవచ్చు
పేపర్లునిండి పేజీలు కోల్పోయిండచ్చు!

నీ యోగక్షేమాల స్తోత్రాలకు చోటులేదిక్కడ
నిస్పృహ విత్తేస్తూ రాత్రంటే చీకటాకాశమిక్కడ
అంతులేని నక్షత్రాలల్లె లెక్కలేనంత నిరాశిక్కడ
మిణుగురులపాటి చిట్టాశకీ తావులేదిక్కడ!

అర్థం కావట్లేదా కావాల్సినవసరంలేదులే
విసుగొస్తుందేమోగా ఇదుగో అయిపోతుందిలే
ముగిస్తున్నావా నిన్నీరాత మర్చిపోయేలోపలే
తన్నుతానునరుక్కొని గోరీల్లోకి నెట్టుకుంటుందిలే!

జీవనగమనంలో సమస్యల సుడిగుండాలో
వ్యవస్థల పతనాలో అరాచక రాజకీయాలో
హక్కులకై పోరాటాలో నాకవసరంలేదులే
అయినా నా గోల నీ గురించి కాదులే మిత్రమా!

**లోపలి మనిషి!!**

వసపిట్టొకటి అంతరంగంలో
బయటకొచ్చి కూసేసేయాలనీ
నా వైఖరిని సరిదిద్దేయాలనీ
కుదరదు గమ్మునుండమని నేను!

కులమతప్రాంతాలమధ్య చిచ్చులెట్టి
భావోద్వేగాలు పెంచబోతుంటే
సమాజాన్ని నిలువునా చీల్చబోతుంటే
అధర్మమంటది గమ్మునుండమని నేను!

గుప్పించిన హామీలు మర్చిపోతుంటే
మదమత్రిప్పి నడకలు మారుస్తుంటే
అస్మదీయులకు ఆస్తులు దోచిచ్చేస్తుంటే
అన్యాయమంటది గమ్మునుండమని నేను!
కుయుక్తుల సమరంలో గెలిచినసీట్లు
అక్రమాలతో ఆర్జించిన సంపద కోటానుకోట్లు
పైరవీలతో పైపదవులకు వేసుకున్నమెట్లు
వదిలించేస్తావేమిటీ గమ్మునుండమని నేను!

అర్ధరాత్రులప్పుడప్పుడు నిశ్శబ్దంలో
ప్రపంచం గాఢనిద్రలోనున్నపుడు
మనం నిర్భయంగా మాట్లడుకోవట్లేదూ
ఇప్పుడుగాదులే గమ్మునుండమని నేను!

నిష్ఠూరంగా వాగివాగి విసిగిస్తున్నావు
విస్కీరమ్ముల్తో నిలువెల్లా ముంచేసినా
సిగిరెట్టుపొగల్తో ఉక్కిరిబిక్కిరిజేసినా
చంపేస్తున్నావు గమ్మునుండమని నేను!

తెలుసుగా మిత్రమా నేనెవరినో
అలవోకగా రంగులు ఫిరాయించగలను
మనస్సాక్షివైతేమాత్రమేం ఏమార్చగలనూ
నిన్నూ మార్చేయగలనూ గమ్మునుండమని నేను!

**నిశ్శబ్దం!**

మిమ్మల్నే కానివ్వండి మొదలెట్టండి
మీరేం మాట్లాడాలని మదనపడేవారో
మీకు ప్రసంగించే అవకాశమొచ్చింది
గదిలో నిశ్శబ్దం రాజ్యమేలుతోంది!

గడబిడా గోలజేసే ఫ్యానుపీకేశాం
టెలివిజన్ న్యూసు రగడ తీసేశాం
కంప్యూటర్ మౌసుక్లిక్కులు ఆపేశాం
ఇకజెప్పండి మీ మైండులో ఏముందో!

రైళ్ళలసి ప్లాటుఫారంమీద కూలబడ్డాయి
స్టీమర్లూ హార్బరులో రెస్టుతీసుకుంటున్నాయి
శునకాలన్నీ తలలువాల్చి పడుకున్నాయి
పక్షులన్నీ గూళ్ళలోకిజేరాయి మాట్లాడండి!
నగరవాసులకు జోలలుపాడి నిద్రబుచ్చి
నగరం ఆదమరచి గాఢనిద్రలోనుంది
కీచురాళ్ళూ కిమ్మనకుండా కునుకేస్తున్నాయి
ఇకనైనా గొంతు సవరించుకుని మాట్లాడండి!

వినాలనుంది మీ పలుకులశబ్దాల్లో
భద్రంగా దాచుకున్న మీ మనోగతాన్ని
ఒంటరితనపు ఆక్రందనల జ్ఞాపకాలు
అణచివేతకు పెల్లుబికిన విప్లవగీతాలు!

నచ్చని అరాచకరాజకీయ గొడవలు
రాకెట్టులతోబాటు ఊరేగే ధరల దడదడలు
క్రూరపు కీచకపర్వాల కలవరపు కలతలు
తెలిసినవీ విన్నవీ అనుకున్నవన్నీ మాట్లాడండి!

పోనీ నాన్నమోసిన బాధ్యతలమోతలు
అమ్మపంచినప్రేమ పిల్లల్నిపెంచినరోజులు
నచ్చినపుస్తకం మెచ్చినప్రదేశం ఊరించేవంట
మీ అంతరంగాన్ని ఆవిష్కరించండి ఎవ్వరూ లేరులే !

**మనోరథములు!!**

అనంతాకాశాన్నావరించి
నెలల్నిండిన నిండుచూలాల్లలా
అపుడోనిపుడో అంబరాన్ని విడువగా
కతిమబ్బులు వర్షించగసిద్ధమై!

కుంభవృష్టికి ప్రసవం యాతనై
చినుకుచినుకుగా జడివానై కురుస్తూ
నింగినొదలక పట్టేసి మోడమైకప్పేసి
ముసురై సొంతం చుట్టేసినట్టు!

ఉప్పెనల హోరులోన లహరులు
యమజోరుగా తీరందాటేసినా
ప్రశాంత సముద్రగర్భంలోనుంచి
కెరటాలు మళ్ళీ ఎగసితరలొచ్చినట్టు!
హృదిలోతున దాగిన వాంఛలు
తరగపొంగుల్లా తిరిగొచ్చేవికొన్నీ
తృణీకరించి వద్దనుకున్నా వదలక
వానమబ్బులై మదినెప్పుడూ కప్పేసేవికొన్ని!

**దొంగలు బాబోయ్ దొంగలు!!**

ఏవండే దొంగిలించారండే
మా ఆలోచనల్నీ
మా బుర్రలనుగూడా
ఎవరో దొంగిలించారండే!

ఏవండే దొంగిలించారండే
మా స్పందనలనీ
మా భావోద్వేగాలనుగూడా
ఎవరో దొంగిలించారండే!

ఏవండే దొంగిలించారండే
మా నడకల్నీ
మా దారులనుగూడా
ఎవరో దొంగిలించారండే!

ఏవండే దొంగిలించారండే
మా భావప్రకటననీ
మా స్వరపేటికలనుగూడా
ఎవరో దొంగిలించారండే!

ఏవండే దొంగిలించారండే
మా నిబద్ధతల్నీ
మా వ్యక్తిత్వాలనుగూడా
ఎవరో దొంగిలించారండే!

ఏవండే దొంగిలించారండే
మా స్వేచ్ఛనీ
మా ప్రాథమిక హక్కులనుగూడా
ఎవరో దొంగిలించారండే!
ఏవండే దొంగిలించారండే
మా మేధావులనీ
మా మేధనుగూడా
ఎవరో దొంగిలించారండే!

ఏవండే దొంగిలించారండే
మా ఉనికినీ
మా ఆవాసములనుగూడా
ఎవరో దొంగిలించారండే!

ఏవండే దొంగిలించారండే
మా భక్తినీ
మా దేవుళ్ళనుగూడా
ఎవరో దొంగిలించారండే!

ఏవండే దొంగిలించారండే
మా ఆత్మవిశ్వాసాన్నీ
మా జీవితాలనుగూడా
ఎవరో దొంగిలించారండే!

**శ్రీ రాధామాధవీయం!**

కృష్ణపక్షపు కడపటి నిశిరాతిరిలా
మనస్సాకాశమంతా నిండుగా చీకటావరించి
అవలోకనకేచిట్టణువూ గోచరించక
దిశనెరగకదిరుగు ఒంటరిదిమ్మరి నీరదమౌదు!

ఎగుభుజ లతలనొదిగి సేదదీరదలతు
మందహాసా మదనమోహనా మానసందోచేవనివేతు
విదియచందురునొసల మరుని విరివిల్లుదీరుతో
చిరుతప్రాయపుజూపుల విరిశరములగుచ్చేవనిజూతు!
అంతరంగసీమల్లాడు పరితోషమొందక
కొదమసింగపునడుము విభుని జతగూడక
కుసుమశరునికే మరులుగొల్పుమనోహరా
స్వప్నదర్శనభాగ్యమేనా ప్రత్యక్షమైనన్నేలుకోవా!

ఇదిందిరనై సంపుల్లమందారాల
కిసలయమేదుర చాంపేయాలగ్రోలబోదు!
మధుమాసపు చలాచలకలకంఠినై
మరునిబంటై మావిపూలగుత్తులపై వ్రాలబోదు!

దివారాత్రాలుపాంథుడై సంచరించుతూ
హేమంత ప్రాభాతసంధ్యల్లో
నీహారలేశమై సకలాణువలతోగూడి
పరిష్వంగమొనరించబోదు సఖీ నినుగలవ!

శుక్లపక్షపు చంద్రబింబోన్నతిలా
విరహమతిశయించునే మధురమనోహరలతాంతా
దోబూచులాడుతూ తిరుగేవు తలిరబోణీ
మనస్దర్పణంమంతా తరిచిజూసేనుపట్టగా!

నీలాకాశాన్ని సింగారించుకొనోసారి
వెన్నెలచీరని ధరించోసారి
మంచుమేఘాల్ని కప్పుకొనోసారి
మేఘమాలికలజుట్టుకోనోసారి తలంపునకొచ్చేవు!

ఇందువదనా కుందరదనా
నీయనుస్మరణల అందోళికలొనూరేగుతున్నా
ప్రాణనాథుని కరుణించిజతగూడి
మనసిజునితూపుల తాకిడిని శమింపజేయవా!

శ్రీరాధామాధవుల మిథున ప్రణయమిది
ప్రకృతీపురుషుల ప్రేమ సల్లాపమిది
ప్రియుడూ ప్రియురాలూ అన్నీతానై
అద్భుతం అమేయం అనంతం అజరామరం!

**రవి కిషోర్ పెంట్రాల, లాంగ్లీ, లండన్!**

# "పెట్టెలో ఏముంది!!"

సూర్యాకాంతం

బయట మంచు కురుస్తుంది. చీకటి తెరలు ఇంకా వీడలేదు. సూర్యుడు కూడా మా పిల్లల్లాగ బారెడు పొద్దెక్కితే కానీ దర్శనమివ్వలేదు.

వేడివేడి కాఫీనీ, వెచ్చటి సూర్యరశ్మిని ఆస్వాదిస్తూ సమయం చూసుకున్నాను. విమానం ఆగడానికి ఇంకా రెండు గంటలు ఉంది. మా శ్రీవారు భారతదేశం వెళ్లి మూడు వారాలు అవుతోంది. వెళ్లే ముందు ఏం కావాలి అంటే ఏ కళన ఉన్నానో.. 'నాకేం కావాలి ఏమీ అక్కర్లేదు' అని అన్నాను (ఈ మధ్య కాస్త ఆధ్యాత్మిక మార్గం వైపు చూస్తున్నాను అడుగు వేద్దామని, సావాస దోషం కూడా కావచ్చు). పిల్లలు మాత్రం భారతదేశం నుంచి తీసుకురమ్మని వాళ్ళ నాన్నకు పెద్ద జాబితా ఇచ్చేశారు. ఈ మూడు వారాలు నేను పని ఒత్తిడితో ఆలోచించే సమయం లేకపోయింది. మధ్యలో ఒకటి రెండు సార్లు అనిపించింది ఫోన్ చేసి నాకు జార్జెట్ చీరో లేక ఉప్పాడ పట్టు చీరో.. అదేదో ప్రకటనలో చూసి మనసు పారేసుకున్న గాజులో తీసుకురమ్మందామని. కానీ నేర్చుకుంటున్న భగవద్గీత గుర్తుతెచ్చుకొని ఇటువంటి భౌతిక వాద సంపదపై వైరాగ్యం తెచ్చుకోవాలి అనుకుని ఏమీ కావాలని అడగలేదు. పైగా ఏమీ అక్కర్లేదు అని కూడా అన్నాను.

మా వారు వెనక్కి వచ్చే రెండు రోజులు ముందు కూడా హైదరాబాదులో షాపింగ్ చేస్తున్నారు అని తెలిసినా నేను ఏమీ అడగలేదు. మనసులో మాత్రం కొంచెం కొంచెంగా ఆత్రం పెరుగుతుంది. నా కోసం ఏమైనా తీసుకువస్తారా? లేదా? అని. మొదటిసారి మా నాన్నగారిని కానీ మా అత్తగారిని కానీ ఇది పంపించండి అని అడగలేదు. ఏమీ అడగకపోయినా వాళ్ళందరికీ నా ఇష్టాలు తెలుసు కదా ప్రేమతో ఏదో ఒకటి పంపించక మానరులే అని నన్ను నేను అనునయించుకున్నాను.

సెలవు రోజు కావడంతో మా వారిని చూడాలన్న ఆత్రంతోపాటు పెట్టెలో ఏంటో తీసుకొని వస్తున్నారని ఎక్కడో మూల చిన్న కుతూహలం లేకపోలేదు. ఫ్లైట్ రావటం, మేం వెళ్లి ఇంటికి తీసుకురావడం అయ్యి, పలకరింపులు వగైరా వగైరా అయ్యాక మా వారు పెట్టెలు తీయడం మొదలుపెట్టారు.

పిల్లలు వాళ్ళ నాన్నకు సహాయం చేస్తూ వాళ్లకు తీసుకొచ్చిన వాటిని చూసుకొని తెగ ఉత్సాహపడిపోతున్నారు. నేను వంట చేయాలి అన్న వంకతో వంటింట్లోకి వెళ్లాను. ఒక విధంగా నా నిరాశక్తత తెలియ చేద్దామని అసలు ఉద్దేశం. మధ్య మధ్యలో నా కాళ్లు నా ప్రమేయం లేకుండానే వాళ్ళ దగ్గరకు తీసుకొని వెళ్ళిపోతున్నాయి ఏదో వంక పెట్టి. భగవద్గీత పుస్తకం వేరే పుస్తకాలు అడుగున చేరింది. దాని ప్రభావం నా మీద క్షీణించిన ఘడియలు స్వీయ సానుభూతి నా మనసు నింపేస్తున్న సమయంలో మా ఆయన మాటలు నా చెవిన పడ్డాయి. మనసులో విచారం సుడిగుండమై నేత్రద్వారాలను ఛేదించి ప్రవాహం అయ్యే లోగా మావారి మాటలకి ఆనకట్ట వేసినట్టు ఆగిపోయింది. ఈ పెట్టెలోవి నీ కోసమే అన్నారు. సిరికించజెప్పడు మాదిరిగా వేయిస్తున్న పోపు గరిట జారవిడిచి, పొయ్యి ఆర్పకుండా ఒక్క ఉదుటన పెట్టి పక్కన చేరాను. అత్యుత్సాహంతో తరచి చూస్తే నాలుగు ప్యాకేజీలు కనపడ్డాయి. మా ఆయన ఒక ప్యాకెట్ తీసి నవ్వుతూ ఇదేంటి ఇది ఇందులోకి ఎలా వచ్చింది? అని బయట పెట్టారు. నా ఆశ బుడగ ఒకటి ఫట్. అందులో ఆయన బాటలో కొనుక్కున్న చెప్పులు, వగైరా ఉన్నాయి. ఏంటో ఎవరి ఆనందం వాళ్ళది అనిపించింది. అది తీసుకొని ఆయన అక్కడి నుండి వెళ్ళిపోయారు. రెండో ప్యాకెట్ కోడలికి ప్రేమతో "మా అత్తగారు పంపించిన స్వయంగా చేసిన గోంగూర పచ్చడి". దానితోపాటు నేను ఎప్పుడో అడిగిన పాత ఇత్తడి గిన్నె. (దాని సంగతే మర్చిపోయాను) పైకి అబ్బా మా అత్తగారికి నా మీద అంత ప్రేమో అన్నా. నా మనసులో ఇంకో బుడగ ఫట్. ఇక మూడో ప్యాకెట్ తెరుస్తుంటే నాలో ఉత్సాహం ఓపిక రెండూ సన్నగిల్లాయి. అది మా నాన్నగారు పంపించారుట. మొదటి కవర్ తీస్తే, ఇంకొక కవర్. తర్వాత ఇంకొకటి. మాంత్రికుడు ప్రాణం ఎక్కడో దాచినట్టు ఆఖరి విప్పగానే నా పాత నైటీలు.. మధ్యలో కాగితం పొట్లాలు. అందులోంచి గుప్పుమని వాసన. ఎక్కడో తెలిసిన ఘాటులా ఉంది. కానీ, ఏమిటో పోల్చలేకపోతున్నాను. అదే సమయానికి మా నాన్నగారు వీడియో కాల్ చేస్తే 'నువ్వు పంపించినవి ఇప్పుడే

తెరుస్తున్నాను' అని అన్నాను. మా నాన్నగారు 'మొన్న మీ ఇంటికి వచ్చినప్పుడు అక్కడ ఇంగువ' బాగోలేదు అని, పాల ఇంగువ పంపించాను. చారు పెడతావు, సరైన ఇంగువ ఉండాలి కదా? నేను మరి ఈ రెండు ఏంటి నాన్న? క్రితం వారం నెలవారి సరుకులు వేయిస్తుంటే కొత్త అగరబత్తి అని కొట్టు వాడు ఇచ్చాడు. నీకు నచ్చుతుంది అని పంపించాను. అప్పుడు అర్థమైంది ఆ వాసన ఏంటో ఇంగువ సంపెంగ వాసన అగరబత్తి కలిసిన వాసన.

ఆ సమయంలో ఆయన ముఖంలో ఒక సంతృప్తి, నాకు అవసరమైనవి పంపించానని. నేను రెండు వేర్వేరుగా ప్యాక్ చేయించలేకపోయావా అని అడుగుదామనుకున్నా, కానీ చాలా బాగుంది నాన్న అన్నాను. నువ్వు క్రితం సారి వదిలేసిన నైటీలు కూడా పంపించాను నీకు అవసరం ఉంటాయి అని. సరే నాన్న అని ఫోన్ పెట్టేసాను.

నాలుగో ప్యాకెట్ తీసే సమయానికి మావారు వచ్చి నీకు ఇష్టమని తీసుకొని వచ్చాను అని ఆయనే కవర్ తీశారు. అది భగవద్గీత బౌండ్ పుస్తకం. నేను చదివే పుస్తకం కాస్త చిరిగిపోయిందని ఆయన గమనించి కొత్తది తెచ్చారు. ఆయన ముఖంలో నేనేమీ అడగకుండానే నాకు ఇష్టమైంది తీసుకు వచ్చాను అని ఆనందంతో కూడా గర్వం తాండవిస్తుంటే, నాకు 'పార్థాయ ప్రతి బోధితాం' మనసులో రీప్లే అవుతుంది.

# " కంచె లేని దేశం కోసం "

రమణ

ఇది మా దేశం
మా పాలరాతి గోడల మీద
మీ చేతి రక్తపు మరకలు
మా aesthetis ని degrade చేస్తాయి
ఇది  మా సంస్కృతి
ఖరీదైన fragrance తో
సువాసన చల్లే మా ఇల్లు
మీ చెమట వాసన ఏమాత్రం భరించలేవు!
మా పిల్లల సున్నితమైన చేతులు
మీ మురికి చేతులతో shake hands చేయలేవు
మా Autonomous Robots, Driverless Cars,
మిమ్మల్ని కనీసం గుర్తుపట్టావు కూడా
అందుకే మీ తాకిడి తట్టుకోలేక
మా దేశం చుట్టూ కంచెలు వేసాం!!
లారీల్లో వస్తు ట్రక్కుల్లో వేడికి మాడి మసైపోతారు
పడవల్లో సముద్రం అలల కింద సమాధులవుతారు మీ ఇష్టం
మీరు మరీ అంతగా రావాలనుకుంటే

మరికొన్నిళ్లు ఆగండి
మేము మా మేధస్సుతో టెక్నాలజీతో
రాత్రి పగలను శ్రమిస్తూ
మరో ఉపగ్రహాన్ని పురోగమిస్తున్నాం
త్వరలో అక్కడికి షిఫ్ట్ అయ్యే ఆలోచన కూడా ఉన్నాం
అప్పుడు ఈ భూభాగం అంతా మీదే
అప్పటివరకు మనందరం కలిసికట్టుగా
ఈ పర్యావరణానికి ఏ మాత్రం హాని చేయకూడదు సుమా



# "మర్రి - మనిషి !!"

రమణశాస్త్రి రాయప్రోలు

మర్రి కీ,
మనిషి కీ
ఎంత సారూప్యత!

చిన్న విత్తు మహా వృక్షంలా మారి –

అవని అంతా ఆక్రమించాలని
కొమ్మలు పెంచుకుంటూ
ఊడలు దించుకుంటూ
ఎక్కడా వంగనంటుంది!!

చిట్టి మెదడు తో విజయాలెన్నో సాధించి –

అంతా తనకే చెందాలంటూ
కొమ్మల్లా ఆశలు పెంచుకుంటూ
ఊడల్లా స్వార్థం పోషించుకుంటూ
ఎవరికీ లొంగనంటాడు!!

మర్రి నీడలో
మరో మొలక పెరగదు!

మనిషి ఆశలో
మరో మనిషి చింత వుండదు!!
( రా. శా. )

# "మలినం!"

రమణశాస్త్రి రాయప్రోలు

బసవేశ్వర్రావు కొత్త ఆఫీసులో చేరి మూడు రోజులైంది. ఈ మూడు రోజుల్లోనే తోటి ఉద్యోగులకు పరిశుభ్రత, ప్రాముఖ్యత, అదంటే తనకెంత పట్టింపో తెలిసేటట్టుగా చేశాడు. ఎప్పుడూ పరిశుభ్రతతో నలగని బట్టలతో కనబడతాడు. తెలుపు రంగు ఫ్యాంట్ దానిమీద లైట్ బ్లూ లెనిన్ చొక్కా ఎక్కువగా అతను వేసే దుస్తులు. ఆహార్యంలోనే మనోవికాసం తెలుస్తుందని అతని ప్రగాఢ విశ్వాసం! తన టేబుల్ మీద కానీ డ్రాయర్లో కానీ ఎక్కడా కాగితాలు, పరికరాలు చిందరవందరగా పడి ఉండనివ్వడు. ఎవరి టేబుల్ మీద అయినా అలా కనబడితే అలా ఉంచుకోవద్దని, దానివల్ల నెగిటివ్ వైబ్స్ కలిగి, తెలియకుండానే మన పనితీరు దెబ్బతీస్తాయని పాఠం చెబుతుంటాడు. కొంతమంది నిజమని నమ్ముతుంటారు, కొంతమంది కొట్టిపారేస్తుంటారు.

ఆఫీసులో చేరిన నాలుగో రోజు పని మధ్యలో ఎక్కడి నుండో మురుగు దుర్గంధం రావటం గమనించాడు బసవేశ్వర రావు. ఆ మాటే అడిగినప్పుడు సహచర ఉద్యోగుల నుండి తెలిసింది ఆ దుర్గంధం తమ ఆఫీస్ పక్కనే ఉన్న ఖాళీ ప్లాట్ లో పడేసిన చెత్త నుండి అని. ఆ ప్లాట్ లో కార్పొరేషన్ వాళ్ల చెత్త జమ చేసే డబ్బాలు కూడా ఉండడంతో అది ఆ వీధి మొత్తానికి అప్రకటిత చెత్త డంపింగ్ యార్డ్ అని ఇట్టే తెలిసిపోతుంది చూసినవాళ్ళకి.

ఆ స్థలం ఆనుకుని ఉన్న వాళ్ళ ఆఫీస్ ప్రహరీ గోడవారగా చెత్తను ప్రోదిచేయడంలో ఆఫీస్ బంట్రోతు సంపదయ్య చేయూత ఎంతో ఉంది. మన దేశంలో ఇంటి పక్కన ఉన్న ఖాళీ స్థలం కన్నా చెత్త పడేసే మరో సరైన అనువైన ప్రదేశం కనబడేది ఎవరికీ. అందుకు బసవేశ్వర రావు ఆఫీసు ఉండే వీధి మినహాయింపేం కాదు. పైగా వాళ్ళ ఆఫీసు ఉండేది ఒక ఆవాస వీధిలో వ్యాపార సముదాయములో కాదు. ఆ స్థలం వారసుల మధ్య వివాదాల కారణంతో పూర్తిగా గాలికి

వదిలేయబడింది. బసవేశ్వరరావు బయటకు వెళ్లి చూశాడు. ఎవరో ఒక నడి వయసు మనిషి ఆ చెత్తని అటు ఇటు మరులుస్తూ తనకు కావలసినవి ఏరి తన గోతంలో వేసుకుంటున్నాడు. దానివల్లనే వాసన ముక్కుపుటాలు పగిలేలా వస్తోంది. అతని బట్టలు పూర్తిగా మలినమై ఉన్నాయి . బసవేశ్వరరావు కోపం కట్టలు తెంచుకుంది. "చెత్త వెధవ" అప్రయత్నంగా అతని నోటి వెంట వచ్చింది.

రోడ్డుమీద నిలబడే, అతన్ని పిలిచి అరచి చివాట్లు పెట్టి ఇంకోసారి అక్కడ కనబడితే కేసు పెట్టి లోపల వేయిస్తానని బెదిరించి పంపేశాడు. ఆరోజు చాలాసార్లు బసవేశ్వరరావు మది, ఆఫీస్ పక్క స్థలంలో అలా చెత్త చేరకుండా ఎలా చేయాలో అని ఆలోచించింది. ఇది జరిగిన వారం రోజులకి..

బసవేశ్వరరావు అందరికంటే ముందు ఆఫీస్‌కి వచ్చి తను కూర్చునే గదంతా దేనికోసమో వెతుకుతున్నాడు. తనకు కావలసిన వస్తువు కనపడట్లేదు. సహ ఉద్యోగులు ఒక్కొక్కరే వస్తున్నారు. బసవేశ్వరరావు గాబరాని చూసి వాళ్ళు అడిగారు ఏమైందని?

కూతురు పైచదువుల కోసం ఇల్లు తాకట్టు పెట్టి బ్యాంకులో అప్పు చేయాలనుకున్నట్లు, ఆ ప్రక్రియలో లాయరు ఒపీనియన్ రిపోర్ట్ దాంతో పాటుగా తిరిగి ఇచ్చిన యాజమాన్య అసలు దస్తావేజులు కనపడటం లేదని, అవి మొన్న లాయర్ గారి మనిషి వచ్చి ఇచ్చాడని, ఆ కవర్ అలాగే తన టేబుల్ మీద ఉంచానని, పని ఒత్తిడిలో వేరే కాగితాల్లో కలిసిపోయి ఉండొచ్చు అని చెప్పాడు కంగారు ఆవేదన బాగా కలబోసిన స్వరంతో. సానుభూతి చూపిస్తూ మిగిలిన ఉద్యోగులు కూడా వెతికారు కవరు కోసం. అయినా లాభం లేకపోయింది! ఎవరికి కనపడలేదు అతను పోగొట్టుకున్న కాగితాలు!

అవి బ్యాంకులో ఇస్తేనే లోన్ మొదటి వాయిదా మొత్తం విడుదల చేస్తారు. అందులోంచి యూనివర్సిటీ కట్టాల్సిన ఫీ, ప్రయాణ టికెట్లకు కావాల్సిన మొత్తం ఏర్పాటు చేయాలి కూతురికి. వారం రోజుల్లో అక్కడ మొదటి సెమిస్టర్ మొదలవుతుంది. ఆలోచనలు పిచ్చెక్కిస్తుంటే.. పని వదిలి, వెతికిన చోటే మళ్లీ మళ్లీ వెతుకుతున్నాడు. పని కూడా చేయలేకపోతున్నాడు.

అప్పుడే ఆఫీసుకు వచ్చిన సంపదయ్యను విచారించగా ఆ కాగితాల గురించి తెలిసింది ఏమిటంటే "మొన్న సాయంత్రం అందరూ ఆఫీసు వదిలి వెళ్ళిపోయాక వూడుస్తుంటే బసవేశ్వరరావు టేబుల్ పక్కన ఉన్న చెత్తబుట్టలో ఏదో ఒక నీలం రంగు కవరు పడి ఉందని అవసరం లేకపోతేనే పడేసి ఉంటారని, చెత్తంతా పడేసేటప్పుడు అది కూడా ప్రక్క ప్లాటులోని ఆఫీస్ ప్రహరీ గోడవారీగా ఉన్న చెత్తలోకి వెళ్లిపోయిందని."

ఆ నీలం రంగు దస్తావేజు కాగితాల కవరే బసవేశ్వరరావు టేబుల్ మీద పెట్టినది, తనకు తెలియకుండా టేబుల్ పక్కన ఉన్న చెత్తబుట్టలో పడి ఉంటుందని, పని ఒత్తిడిలో గమనించలేదని తెలుసుకున్న బసవేశ్వరరావు పై ప్రాణాలు పైనే పోయాయి! ఎందుకంటే పైగా నిన్ననే తను ఆ వార్డు కార్పొరేటర్‌ని కలిసి పక్క ప్లాట్ లో చెత్తంతా కార్పొరేషన్ వాళ్ళు తీసుకెళ్లేలా దగ్గరుండి మరీ చూసుకున్నాడు. నిజానికి బసవేశ్వరరావు ఆ చెత్తను తీయించడంలో చూపించిన పట్టుదల మరే విషయంలోనూ చూపించలేకపోయాడు. ఆ ఆఫీసులో చేరినప్పటి నుండి ఒకసారి పట్టుదలకు పోయి చిన్న చిన్న విషయాలకు ఎక్కువ రాద్ధాంతం చేసి వాటి అంతు చూసి తన అహాన్ని తృప్తి పరచుకుంటాడు మనిషి. ఆ ప్రహసనంలో ముఖ్యమైన వాటిని చిన్నచూపు చూస్తాడు అదే జరిగింది. బసవేశ్వరరావు విషయంలో ఫలితం కూతురు పై చదువులు డోలాయమానంలో పడ్డం.

సంపదయ్య మీద కోపం పెల్లుబుకుతున్నా అతనితోనే పనుంది కాబట్టి తమాయించుకున్నాడు బసవేశ్వరరావు. తనకి ఇప్పుడు ఆ కవరు వెతికిపెట్టే బాధ్యత అతని మీదే ఉన్నదన్నట్లు మాట్లాడాడు. ఆఫీసుకు ఆరోజు సెలవు పడేసి సంపదయ్యను తీసుకుని కార్పొరేషన్ చెత్త డంపింగ్ యార్డ్‌కు బయల్దేరాడు. దారి పొడుగంతా ఆ కవరులో ఎంత ముఖ్యమైన కాగితాలు ఉన్నాయో వివరించడమే కాకుండా అలాంటి కవర్లు కనపడినప్పుడు ఒకసారి కనుక్కొని పడేయాల్సిన బాధ్యత ఉందని హెచ్చరిక లాగా చెప్పాడు. ఆ కాగితాలు పోవడంలో సంపదయ్యదే ఎక్కువ పాత్ర ఉందనిపించేలా మాట్లాడాడు! పాపం సంపదయ్య మాత్రం ఆ కాగితాలు దొరక వాళ్ళ అమ్మాయి విదేశీ చదువులకు వెళ్లలేకపోతే ఆ పాపం తనకు చుట్టుకుంటుందని రెపరెపలాడిపోయాడు. యార్డులో తమ ఆఫీసు లోకాలిటీ చెత్త తీసుకెళ్లే లారీ డ్రైవర్, సిబ్బంది తనకు పరిచయమే అవటం వల్ల కొంచెం శ్రమిస్తే కాగితాలు దొరికే అవకాశం ఉందని ఆశతో ఉన్నాడు, అదే అన్నాడు కూడా బసవేశ్వరరావుతో సంపదయ్య. అదే దొరకచ్చు అనే ఆశనే ఇద్దరినీ డంపింగ్ యార్డ్‌కు పరిగెత్తుకు వెళ్లేలా చేసింది. కాగితాలు పోవడంతో తన అశ్రద్ధకు బసవేశ్వరరావు, కవరు చూసి కూడా అనాలోచితంగా పారేసినందుకు సంపదయ్య ఇద్దరు దారి పొడుగంతా వ్యథ చెందుతూనే ఉన్నారు.

యార్డు చేరుతూనే సంపదయ్య లోపలికి పరిగెత్తి తెల్సిన వాళ్ల కోసం వెతకడం మొదలుపెట్టాడు. బసవేశ్వరరావు బండి పార్కింగ్

చేస్తుంటే గేటు దగ్గరున్న సెక్యూరిటీ అతను వచ్చి అక్కడ బండి ఆపకూడదని వచ్చిపోయే వాహనాలకు అడ్డం అవుతుంది అని చెప్పి దూరంగా పార్క్ చేయించాడు. అవును మరి ఇక్కడ చెత్త (మోసుకొచ్చే) బండ్లకే ప్రాముఖ్యత బసవేశ్వరరావు మెదడు ఘోషించింది ఉక్రోషంతో.

సంపదయ్య పరిగెత్తుకుంటూ వచ్చి ముక్కుకు అడ్డంగా దస్తి పెట్టుకున్న బసవేశ్వరరావుతో నిన్న తమ ఆఫీసు పక్క స్థలంలో చెత్తను తెచ్చిన లారీ ఇంకా అన్‌లోడ్ అవ్వలేదని అక్కడికి కొంత దూరంలో ఉందని చెప్పాడు వగరుస్తూ. సంపదయ్య వెనకనే కొన్ని రోజులు ముందు తన చేత చెత్త వెధవ అని తిట్టించుకున్న నడి వయసు మనిషి కూడా రావడం చూసాడు బసవేశ్వరరావు. సంపదయ్యే మళ్ళీ చెప్పాడు వీడి చేత నేను వెతికిస్తాను. మీరు ఇక్కడే ఉండండి మీరు అక్కడికి రాలేరు అంటూ ఆ మనిషి చేయి పట్టుకొని యార్డు వైపు తిరిగాడు. వెళ్తూ వెళ్తూ వెనక్కి తిరిగి చూసిన ఆ నడివయస్సుకుడికి బసవేశ్వరరావు చేతులు అప్రయత్నంగా నమస్కరించాయి.

లారీలు వచ్చే పోయే త్రోవ అంతా తడితడిగా, జారిపడిన చెత్తతో అడుగు వేయడానికి వీలులేనట్లుగా ఉంది. ఊగుతూ చెత్తని జార్చుకుంటూ పెద్ద శబ్దంతో తిరుగుతున్న పాత వాహనాలు తనని వెక్కిరిస్తున్నట్లన్పించ సాగింది బసవేశ్వరావుకు! అవును మరి! తను రోడ్డు మీద వెళ్తున్నప్పుడు ఏదైనా చెత్త తీసికెళ్ళే వాహనం తను వెళ్ళే వైపు వచ్చిందంటే తన బండిని రోడ్డు ప్రక్కన నిలుపుకొని, ఆ వాహనం వెళ్ళిన అయిదు నిముషాలకి గానీ మళ్ళీ కదిలే వాడు కాదు తను. దానికీ తనకూ కిలో మీటరు దూరం ఉండేలా చూసుకునే వాడు. ఇప్పుడు తను ఉన్న పరిస్థితికి తన ప్రక్కనుండి వెళ్ళే లారీలు తన గర్వభంగ పర్వాన్ని వీక్షిస్తున్నట్లు అన్పిస్తోందతనికి!

కొద్దిసేపు అక్కడే తచ్చాడిన బసవేశ్వరావులో కాగితాలు దొరుకుతయ్యా? లేదా? అన్న ఆందోళన ఎక్కువ కాసాగింది. ఆందోళన మోతాదు పెరిగితే అశాంతి! అది అతన్ని నుంచోనివ్వక వాళ్ళు వెళ్ళిన వైపే నడిపించింది. చెత్త నిండిఉన్న లారీలను దాటుతూ, క్రింద పడివున్న కసువు మీద కాలు పడకుండా అడుపులు వేస్తూ, ముక్కుకు అడ్డు పెట్టుకున్న రుమాలు తొలగకుండా చూసుకుంటూ నడుస్తున్నాడు.

ఒకచోట మురికి దాటడానికి వేసిన పెద్ద అంగ వల్ల, పట్టుతప్పి కాలుజారి పడబోయి, ప్రక్కనే ఉన్న లారీ చక్రం టైర్ దన్ను దొరకడంతో నిలద్రొక్కుకున్నాడు. టైర్ కు ఉన్న బురద, మట్టి బసవేశ్వరరావు బట్టలకు అంటుకున్నాయ్. చేతిలో రుమాలు క్రింద మురికిలో పడిపోయింది.

మహాభారత యుద్ధంలో కర్ణుడి రథం నేలలో కూరుకు పోయినప్పుడు అతడు పడ్డ వేదన బసవేశ్వరావు అనుభవానికి వచ్చింది! క్రింద పడిన రుమాలు తీసి, పూర్తిగా విప్పదీసి చేతులకంటిన మట్టి, మలినం తుడిచి అక్కడే పడేశాడు. అతనిలో నిర్వేదపు బీజం ఊపిరి పోసుకున్న సమయం అది! కళింగ యుద్ధం తర్వాత శవాల కుప్పల మధ్య నడిచేటప్పుడు అశోకుడికి కలిగిన నిర్వేదం అది!

నడుస్తున్న అతనికి కొంచెం దూరంలో సంపదయ్య గొంతు వినరావడంతో ఆ దిశగా నడిచాడు. నాలుగైదు బండ్ల అవతల ఒక లారీ చక్రం టైరు మీద నిలబడి, లారీ కంటైనర్ లో దిగి చెత్తని తిరగ తోడుతున్న రెండో అతనితో మాట్లాడుతున్నాడు సంపదయ్య.

బసవేశ్వరావు రావడం చూసి, " మీరెందుకొచ్చారయ్యా ఈడికి" అన్నాడు.

"దొరికిందా కవరు?". దొరికితే ఇంకా ఎందుకు వెతుకు తుంటాడు? అనేది స్ఫురించ లేదు అడిగే బసవేశ్వరావుకు. అనాలోచితంగా తన నుండి వచ్చిన మాటలు తననే వేళాకోళం చేసిన భావన కలిగింది అతనికి!

బసవేశ్వరావు కొంచెం కష్టపడి, సంపదయ్యకి అవతల ప్రక్క ఉన్న లారీటైరు మీద ఎక్కి కంటైనర్ అంచు పట్టుకుని నిలబడ్డాడు. అతనికి ఇప్పుడు అక్కడ వీచే గాలి తెరల్లో దుర్గంధం తెలిసిరావడం లేదు. సంపదయ్య చూపించిన వైపు చెత్త తిరగదోస్తున్నాడు రెండో అతను. బసవేశ్వరావు ముఖంలో శంకని చదివిన సంపదయ్య అన్నాడు " కంగారేం వద్దయ్యా, దొరుకుద్దని నాకు నమ్మకంవుంది". సినిమా హాలు సిటుకు అతుక్కుపోయి సస్పెను విడబోయే సీను వీక్షిస్తున్న ప్రేక్షకుడైపోయాడు బసవేశ్వరావు.

కష్టపడి దాచుకున్న డబ్బుతో ఇష్టపడి కొనుక్కున్న ఇంటి కాగితాలు చెత్తలో వెతుక్కునే పరిస్థితి తెచ్చిన నిర్లక్ష్యం అతని కళ్ళలో నీరై కంటి చూపును కప్పేసింది. "అదుగో అయి మా ఆఫీసు పేపర్లే. అక్కడే సూడు లోపలికి" సంపదయ్య ఉత్సాహంగా రెండో అతనికి చెప్పాడు. అతను రెండు చేతులూ లోపలికి చొప్పించి లోతుగా లోపల ఉన్న కాగితాలు లాగి వెనక్కి పడేశాడు. కొన్ని ఎగిరి వచ్చి బసవేశ్వరావు మీద పడినయ్ . అతను వాటిని దులుపుకో లేదు – అవి అతనికి చెత్త అనిపించడం లేదిప్పుడు! మరోసారి అలాగే తోడి కాగితాలు పడేస్తుంటే సంపదయ్యకి నీలం రంగు కవరు కనిపించడంతో "ఆ... అదే తియ్యి " అరిచాడు పెద్దగా. రెండో అతను ఆ చెత్త మీద పడిపోయి లోపలిదాకా చేయి దూర్చి లాగాడు ఆ కవరుని. అదే బసవేశ్వరావు ఇంటి ఒరిజినల్ దస్తావేజు కాగితాలున్న కవరు! ఆగలేక వాళ్ళున్న లారీలోకి దూకి కవరు తీసి చూసుకున్నాడు.

అవి తన ఇంటి దస్తావేజులే. ఆ క్షణంలో ఆ వెతికి తీసిన

వ్యక్తి దేవుడిలా కన్పడ్డాడు బసవేశ్వర్రావుకి. ఆనందంలో అతన్ని అక్కడే కౌగలించుకున్నాడు. " నన్ను క్షమించు.... నిన్ను అసహ్యించుకున్నాను ఆ రోజు" గద్గదికమైన అతని కంఠం నుండి వచ్చినయ్ మాటలు.

"నాకు నమ్మకంగా అనిపించిదయ్యా దొరుకుద్దని, యాడికి పోద్ది" అంటూ టైరు మీదనుండి క్రిందకి దూకాడు. సంపదయ్య. తను పడేసిన కాగితాలు తనే దొరికిపించడంతో తప్పు చేసిన భావన సంపదయ్య మనసు నుండి మాయమయ్యింది.

కవరు చేత పట్టుకుని వస్తున్న బసవేశ్వర్రావును చూసి ఆశతో కూడిన నవ్వుతో చేయి చాచాడు. అంతకు ముందు తన వాహనాన్ని దూరంగా పెట్టించిన సెక్యూరిటీ అతనే. పర్సు తీసి కొన్ని నోట్లు అతని చేతిలో ఉంచాడు బసవేశ్వర్రావు. గేటు దాటి బయటకి వచ్చాక ఆ నడివయసు అతని చేతిలో కరెన్సీ నిండి బరువుగా పర్సు ఉంచుతూ " నీ సహాయాన్ని ధరకట్టి అవమానించలేను. నీవు ఎంత తీసుకున్నా నాకు సంతోషమే" అభ్యర్ధనగా అన్నాడు.

"వద్దయ్యా.... నేను డబ్బులు తీసుకుంటే మీకు జేసిన సాయం మరిసి పోతా. మరిసి పోతే ఆ తృప్తి మనసు లోంచి పోద్ది. అది నిలిచి ఉంటే పది కాలాలు ఊపిరిస్తది" అంటూ పర్సు వెనక్కిచ్చేశాడు అతను.

చెమర్చిన కళ్ళు తుడుచుకుంటూ అతన్ని మరోసారి కౌగలించుకున్నాడు బసవేశ్వర్రావు. కొద్దిరోజుల క్రితం చెత్తవెదవ అనిపించిన అతను, గోవర్ధనమెత్తి గోకులాన్ని రక్షించిన గోపాలుడు, సంజీవని తెచ్చి లక్ష్మణుడిని బ్రతికించిన ఆంజనేయుడు కోవలో తోచసాగాడు బసవేశ్వర్రావుకు. మెల్లగా అతన్ని వదిలి సంపదయ్య భుజం చుట్టూ చేయి వేసి పార్కింగ్ చేసిన బండి వైపు నడవసాగాడు. బసవేశ్వర్రావు తన మనసు పలికే మాటల్ని వింటున్నాడు ..

పాలు వేసే వాడు పాలవాడూ, పేపర్ వేసే వాడు పేపర్ వాడూ అయినప్పుడు చెత్తవేసే వాడు కదా "చెత్తవాడు"! పరిశుభ్రం చేసేవాడు కాదు కదా!? అతణ్ణి "చెత్త వెధవ" అనేశావే! మలినంలో ఉపాధిని వెతుక్కునే అతని మనసు ఎంత శుభ్రం! వేసే దుస్తుల్లో చూపే శుభ్రత, వాడే మాటల్లో చూపలేని తను ఎంత మలినం నింపుకున్న మనిషి!?
రియల్ వ్యూ మిర్రర్‌లో దూరమౌతున్న డంపింగ్ యార్డ్, సిద్ధార్థుడికి జ్ఞానాన్ని ప్రసాదించిన బోధివృక్షం కంటే ఏ మాత్రం తక్కువగా అనిపించలేదు బసవేశ్వర్రావుకు!!
( రా. శా. )



# " అత్యధికులు "

చిన్ని అజయ్

పుట్టిన తేదీ ని బట్టి కాకుండా, జీవితంలో పొందిన అనుభవాలను బట్టి లెక్కిస్తే... ఇక్కడ అత్యధికులు అప్రాప్త వయస్కులే..

**మాతృత్వాన్ని పితృత్వాన్ని..**
కేవలం కన్నందుకే కాకుండా, ఇండివిడ్యువల్ గా పెరగడానికి ఎంతవరకు దోహదపడ్డారు అనేదాన్ని బట్టి నిర్ణయిస్తే ..
ఇక్కడ అత్యధికులు అనాధలే..

**మగతనాన్ని..**
శృంగారం చేసే స్టామినా ని బట్టి కాకుండా, అపోజిట్ జెండర్ కి వాళ్ళ ప్రమేయం లేకుండా ప్రకృతిపరంగా ఏర్పడ్డ బలహీనతల్ని, లోపాలని అర్థం చేసుకుని, వాటిని అడ్వాంటేజ్‌గా తీసుకోని మనస్తత్వాన్ని బట్టి నిర్ధారిస్తే.. ఇక్కడ అత్యధికులు నపుంసకులే..

**పిచ్చిని...**
మెదడు నరాలలో తేడాగొట్టి ఏర్పడ్డ కెమికల్ రియాక్షన్ బట్టి కాకుండా, ఒక అబ్సెర్వర్ గా ఆబ్జెక్టివ్ గా ఆలోచించలేని అశక్తతని బట్టి నిర్వచిస్తే.. ఇక్కడ అత్యధికులు మూర్ఖులే..

**మత్తుని...**
ఎత్తిన బాటిల్ ద్వారా ఎక్కిన కిక్కుని బట్టి కాకుండా, వద్దు అనుకునేదాన్ని దేన్నైనా వదులుకోలేని బలహీనతను బట్టి వ్యాఖ్యానిస్తే .. ఇక్కడ అత్యధికులు వ్యసనపరులే...

# " వరాలు "

కౌండిన్య (రమేష్ కలవల)

పచ్చటి పైరు లో చల్లటి గాలి వీస్తూంటే ఆ బోరు ప్రక్కన ఉన్న ట్యాంకు నీళ్ళతో ఆడుకుంటోంది. చిలకపచ్చని పరికిణి, ఎర్రటి ఓణీ వేసుకొని రెండు జెడలతో నీళ్ళని దోసిటతో తీసుకొని మొహం మీద పోసుకుంటూ ఆ ప్రక్కనే వాలిన పక్షులతో కబుర్లు చెబుతోంది. క్రొత్తగా వాలిన పిచుకకు నిన్నంతా రానందుకు చివాట్లు పెడుతోంది. నీళ్ళు తీసి ఆ పిచుక మీద జల్లడంతో తుర్రున పైకి ఎగిరి మళ్ళీ వ్రాలి ఆ నీట్లో జలకాలాడటం మొదలు పెట్టింది. ఒక్క పిచుకలేంటి ఉడతలు, బారు కొంగలు, కీచురాళ్ళు, కప్పలు అన్నీ ఆ పొలంలో తన నేస్తాలే.

అటు వీస్తున్న చల్లటి గాలితో పాటు "ఆ నీళ్ళల్లో తడవద్దని ఎన్ని సార్లు చెప్పాను" అన్న మాటలు కొట్టుకు రావడం అది విని అటు దగ్గరలో ఉన్న గుబురు మొక్కల వైపుకు పరిగెత్తింది. తనతో పాటే అటు పరిగెత్తిన ఉడతను చూసి "యెనకాలే రాకపోతే అయ్య వస్తున్నాడో లేదో చూడచ్చుగా" అని కసురుకోంది. అది దీర్ఘంగా ఓ సారి తనవైపుకు చూసి అటు వెళ్ళింది, మళ్ళీ తిరిగి రానే లేదు. ఎంతకీ రానందుకు ''రేపు నీ పని చెబుతాను ఉండు'' బుంగమూతితో అంటూ కొంత సేపటికి బయటకు వచ్చి ఊపిరి పీల్చుకొంది. అటు కుడి ప్రక్కన ఉన్న చేను వైపుకు చూసింది. అక్కడ ఉన్న బారు కొంగతో "ఏవే, యాదగిరి మావ కనపడ్డాడా ఈ రోజు" అని అడిగింది. ఏమీ పట్టించుకోనట్లు తన దారిన అది ఎగిరిపోయింది.

చుట్టూ ఎటు చూసినా పచ్చని చేలు, అందరూ అన్నదాతలే, కానీ వీళ్ళ తిండి మాత్రం పచ్చడి మెతుకులే. ప్రతీ ఏటా వరి కోతలకు పనివాళ్ళు వచ్చి పోతుంటారు. ఓ పన్నెండేళ్ళ క్రితం ఆ దిష్టి బోమ్మ దగ్గర పరిచిన గడ్డి మీద దొరికింది ఈ పిల్ల. దేముడు ఇచ్చిన వరంలా ''వరాలు'' అని పిలుస్తుంటాడు. బడికి పంపించి చదివించాలని ఆయన కోరిక, వరాలకి మాత్రం ససేమీరా చదువు ఇష్టం లేదు. పొలం పనులలో తోడుగా ఉంటానని మారాం చేస్తుంది. పక్క చేనులో మావ కనపడితే సిగ్గు మొగ్గలతో వగలు పోవడం చేస్తూ కాలక్షేపర చేయడం అంటే ప్రాణం. తల్లి తనకు ఇష్టమైనవి ఏదైనా చేసి ఇస్తే దాచుకొని గట్టు మీద మావతో కలిసి తినటం తనకు అదో తృప్తి.

పైన ఆకాశంలో కొంగల బారులు దీరి ప్రయాణం చేస్తూ వెడుతున్నాయి. ప్రతీ ఏటా లానే ఆ ఏడాది కూడా పంట కోతల సమయం వచ్చింది. చుట్టు పక్కల పొలాల్లో ఎటు చూసినా పనివాళ్ళతో కిటకిటలాడుతోంది.. రోజంతా వరి కోతలతో హడావుడిగా ముగిసింది. ఆ రోజు దాదాపు ముగిసింది. అందరూ ఎవరి గూళ్ళకి వాళ్ళు బయలుదేరారు.

పక్క చేనులోనుండి ఒక జంట చిన్నగా వరాలు వాళ్ళ అయ్య దగ్గరకు వచ్చి నిల్చున్నారు. ఎలా అడగాలో తెలియడం లేదు వారికి. అతను తను కట్టుకున్న తలపాగా విప్పి మొహం మీద చమట తుడుచుకొని, మళ్ళీ తలకు కట్టుకున్నాడు. చేతులు వెనక్కు పెట్టుకొని "సామీ, మీరెమనుకోక పోతే ఓ మాటడగాలి" అన్నాడు. పనిలో ఉన్న వాడల్లా ఒక సారి తల ఎత్తి చూసాడు. "ఓ పదేళ్ళ పై చిలుకు క్రితం ఓ పసి బిడ్డని మీ చేనులో వదిలిన పాపిష్టోళ్ళము. బిడ్డని తలుచుకోని క్షణం లేదు. ఎట్టా ఉందో సామి " అన్నాడు. ప్రక్కనే ఉన్న భార్య కూడా కంటతడి పెట్టుకుంటూ "మాకే తిండికి గతిలేక బిడ్డ మాకు భారం అనుకున్నాం" అంటూ "పరిస్థితులు చక్కబడ్డాక వచ్చి తీసుకెడదాం అనుకొని, పాడు పని చేసాం" అంటూ రోదించింది. అతను సందిగ్ధంలో పడ్డాడు. ఈ చేతులతో పెంచిన బంగారు తల్లిని అకస్మాత్తుగా వాళ్ళకి అప్పగించాలా? భగవంతుడిచ్చిన ప్రసాదంలా భావించే మురిపాల బిడ్డని వదులుకోవాలా? అనుకుంటూ ఏమి చెప్పాలో తెలియడం లేదు, ఏం చెప్పాలో అని మనసులో మదన పడుతున్నాడు. ఒక్క సారి ఇద్దరినీ చూసాడు, పోలికలు కనపడుతున్నాయని నిర్ధారించుకున్నాడు. ఎక్కడ పొరపాటున వరాలు ఇటు వస్తుందో, వస్తే వాళ్ళకు తెలిసిపోతుందని కుమిలిపోతున్నాడు, తనకు చెప్పలేని గాబరా మొదలయ్యింది. చుట్టూ పరికించి చూసి వరాలు అక్కడ లేదని అనుకొని ఏమీ ఎరగనట్లు మొహం పెట్టాడు, మాట పలుకు లేకండా తన పనిలో మళ్ళీ నిమగ్నమయ్యాడు. ఇద్దరూ ఒకరి మొహాలు ఒకరు చూసుకొని దీనంగా బయలుదేరారు.

చీకటి పడగానే తన పని ముగించుకోని వడి వడిగా ఇల్లు చేరాడు. చేరగానే వరాలని దగ్గరకు తీసుకొని గట్టిగా కౌగలించుకున్నాడు. ఎన్నడూ అంత గట్టిగా అయ్య తనను పట్టుకోనందుకు ఎలా ప్రతి స్పందించాలో తెలియలేదు ఆ పిల్లకు. ప్రక్కనే ఉన్న భార్య చూసి

"ఏందయ్యా, ఈ రోజు ఎక్కడ లేని ప్రేమ నీకు మన అమ్మాయి మీద" అంది మురిసిపోతూ. భార్య చూడకుండా కళ్ళు తుడుచుకోని లోపలికి నడిచాడు.

తరువాత రోజు పొలంకి వెళ్ళే ముందు భార్యతో చెప్పి వరాలను చేను దరిదాపులకు కూడా పంపకుండా చూసుకునే భాధ్యత తనదేనని ఒట్టు పెట్టించుకున్నాడు. భార్య ఆ ప్రక్క పెరట్లో ఆడుకొంటున్న వరాల్ని పిలిచి పదే పదే చెప్పింది. అయ్యకు కోపం తెప్పించకూడదని పలు సార్లు అర్థం అయ్యేలాగా చెప్పింది. అకస్మాత్తుగా ఇలా ఎందుకు అంటున్నారు అర్థం కాలేదు ఆ పసి ప్రాణానికి. కొన్ని రోజులే కదా మావని ఇటే రమ్మని కబురంపాలి అనుకొంటోంది.

ఆ తరువాత ఏడూ వరి కోతల సమయానికి వరాల తల్లితండ్రులు మళ్ళీ కనపడనే లేదు. ఈ సంవత్సం రాలేదు అని మనసు కుదుటపరుచుకున్నాడు. అలాగే మరో నాలుగు సంవత్సరాలు గడిచాయి. వరాలుకు పెళ్ళీడు రానే వచ్చింది. వాళ్ళ అయ్య ఉండబట్టలేకపోయాడు. తన భార్యతో ఐదేళ్ళ క్రితం జరిగిన విషయం చెప్పి కుమిలి కుమిలి ఏడ్చాడు. తాను తప్పు చేసానని పదే పదే పశ్చాత్తాపపడ్డాడు. ప్రతీ ఏటా తను ఎదురు చూసినా వాళ్ళు తిరిగి రాలేదని దుఃఖంతో మునిగిపోయాడు. వయసు ముదరకుండానే పెళ్లి చేయాలని ఇద్దరు నిశ్చయించుకున్నారు. వరాలకి, తను ప్రేమించే మావతో పెళ్ళి కుదిరించారు.
ఆ రోజు సాయంత్రం పెళ్ళి జరుగుతోంది. చుట్టు పక్కల వాళ్ళు, దూరాల నుండి అందరూ వచ్చారు. తమకు తోచినంతలో పెళ్ళి బాగా చేయాలని నిశ్చయించారు. ఎప్పటి లానే వరికోతలు ముగించుకొని ఇళ్ళ కు వెడుతున్న వారు కొందరు ఆగి ఆ పెళ్ళి చూసి మురిసిపోతున్నారు.

ఒక జంట మాత్రం ఆగి "సూడు.. ఆ పిల్ల అచ్చం నీ లానే ఉంది" అన్నాడు. "అవునయ్యా, అచ్చం నాలానే ఉంది" అంటూ తన తల మీద ఉన్న భారీన్ని దింపి నేల మీద పెట్టింది. కళ్ళు నలుపుకోని మరీ చూసింది, అచ్చా తనలానే ఉంది అనుకుంటోంది. కొంచెం ముందుకు వెళ్ళి చూద్దాం అంటూ ముందుకు నడిచారు. దూరంగా వరాలు వాళ్ళ అయ్య కు కూడా అటు వెడుతున్న జనాల పై ధ్యాస వెడుతూనే ఉంది. వాళ్ళని దూరం నుండి గమనించాడు. భార్యను తీసుకొని పరుగు పరుగున వాళ్ళ దగ్గరకు వెళ్ళి వరాల సంగతులు రెండు ముక్కల్లో వివరించి "కన్యాదానం సమయానికి ఆ దేవుడే మిమ్మల్ని పంపాడు" అంటూ "మీ చేతుల మీదుగా కన్యాదానం చేయాలి" అన్నాడు. "ఇన్ని రోజులు కంటికి రెప్పలా కాపాడిన తమకు ఏమి ఇచ్చి ఋణం తీర్చుకోగలము" అన్నారు. ఆ మాట అనగానే "ఇప్పటి నుండి మీరు పొలం పనులకు ఎక్కడికో వెళ్ళకుండా వరాలు దగ్గరే ఉంటే అంతకన్నా మేము ఏమి కోరుకోము" అన్నాడు.

వరాలకు అసలు ఏమి జరుగుతుందో అర్థం కాకపోయినా మావ చెయ్యి పట్టుకొని బెంగగా చూస్తూ ఉండిపోయింది. అన్నీ విషయాలు మెల్లిగా చెబుతాను అంటూ బుజ్జగించాడు అయ్య వరాలని.







# "నిర్ణయం"

సుమంత దేశ్పాండే

"చెప్పినట్టు విని, ప్రేమా గీమా అంటూ పిచ్చి పిచ్చి వేశాలేయకుండా అశోక్ సంబంధానికి ఒప్పుకో." ముందు హాల్లోంచి మురళి లయ పై అరిచే అరుపులు కఠినంగా చెవిని తాకాయి వంటింట్లో ఉన్న గీతకి.

"అయాం సారీ డాడీ... కానీ.. రంజిత్ లేకుండా నేను జీవించలేను." లయ గొంతు కాస్త వణికినా దృఢంగా ఉంది.

''అయితే నీకు ఎంతో అల్లారుముద్దుగా పెంచుకున్న అమ్మానాన్నలకన్నా ఆ కులం తక్కువ వాడే ఎక్కువయ్యాడన్నమాట."

"ఐ లవ్ హిం డాడీ."

"లవ్ అట లవ్. అసలు ప్రేమ గురించి మీ తరానికేం తెలుసని? లస్ట్ నే లవ్ అనుకుంటారు,"

"డాడీ...!"

"ఈ చెత్త లవ్వు గివ్వు కన్నా జీవితంలో ఎన్నో ముఖ్యమయిన విషయాలున్నాయి తెలుసా? నువ్వనుకునే ఆ 'లవ్' గురించి ఇంత తెలిసినదానివయితే, నిన్ను పెంచిన మా ప్రేమనేమంటావు?" మురళి గొంతులో ఉద్రుతం, "మేమెంత నిన్ను ప్రేమిస్తున్నామో ఎందుకు అర్థం చేసుకోలెక పోతున్నావు?"

"తెలుసు డాడీ.. అయి లవ్ యౌ టూ డాడీ కానీ...," లయ కంఠంలో కన్నీటి జీర.

''మరైతే మేము నీ మంచికోరేవాళ్ళమే అని తెలుసుకదా? అలాంటప్పుడు మేము అన్ని విధాలా అలోచించి తెచ్చిన లక్షణమయిన సంబంధం ఎందుకు కాదంటున్నావు? ఎందుకు మన కుటుంబాన్ని వర్ణ సంకరం చేయాలనుకుంటున్నావు? మా పరువు గంగలో కలుపుతున్నావనే ఆలోచన కూడా లేదా నీకు?"

'అర్థం చేసుకోండి డాడీ! నామనసుకు నచ్చని వాళ్ళను చేసుకోమ్మంటే ఎలా సాధ్యమవుతుంది? అదీగాక ఇంకా ఈరోజుల్లో జాతి మత సంకరాలు ఏంటి?

''అంటే నువ్వు ఆ రోగ్ కోసం మమ్మల్ని వదులుకోడానికి సిద్ధపడ్డావన్నమాట."

"రంజిత్ రోగ్ కాదు డాడీ. చాలా మంచివాడు. నిజానికి మనలో చాలామందిలాగా తన కులమే గొప్ప తన మతమే గొప్ప అనుకుంటూ ఇతర కులాలను కించపరచడు. అన్ని కులమతాలనూ సమానంగా గౌరవిస్తాడు."

"ఆహా ఏం ఆదర్శాలు," హేళనగా అన్నాడు మురళి .

"ఒక్కసారి మీరు అతణ్ణి కలుసుకుంటే మీకే తెలుస్తుంది."

"అవసరం లేదు. నువ్వు చేసిన ఈ నిర్వాకం చాలు. రేపు మీకు పిల్లలు పుడితే వాళ్ళ కులం ఏదని చెపుతావు?"

"ఉన్న నిజమే చెపుతాను. వాళ్ళది మానవ కులమని."

"నాన్సెన్స్...రబ్బిష్..మతి చెడి మాట్లాడుతున్నావు," మురళి కోపంతో ఊగిపోయాడు.

ఇక గీత వినలేకపోయింది. పని మధ్యలోనే వదిలేసి, త్వరత్వరగా చేతులు కడుక్కుని ముందు రూం లోకి పరుగెత్తింది.

లయ బయటికి వెళ్ళడానికి రెడీ అయి, తన హాండ్ బాగ్ ను గట్టిగా, ఏదో ఆధారంలాగా పట్టుకుని గది మధ్యలో నిలబడి ఉంది. రెండు చేతులు కట్టుకుని తలుపుకడ్డంగా నిలబడి ఉన్నాడు మురళి. అతని ముఖం కోపంతో జేవురించి ఉంది.

గీత ను చూడగానే లయ కళ్ళల్లో ఏదో ఆశ. "మమ్మీ..." అంటూ ఏదో చెప్పబోయి ఆగిపొయింది.

కూతురు కళ్ళల్లో నీళ్ళు చూడలేక, మురళి చూపుల్లోని తీక్షణతను భరించలేక తల దించుకుంది గీత.

ఒక్క క్షణం అసౌఖ్యమయిన నిశ్శబ్దం ఆవరించింది.

ఇంతలో, పక్కగది తలుపులు తెరుచుకుని చేతికర్ర టకటకలాడించుకుంటూ అత్తగారు రాజ్యం రావడం గమనించింది. గీతకర్థమయిపోయింది ఇందాకట్నించీ జరిగిన తండ్రీకూతుళ్ళ సంభాషణ ఆమెకూడా విందని.

"ఎంత ధైర్యమే నీకు నా కొడుకుకు ఎదురు చెప్పడానికి?" మనమరాలినుద్దేశించి అంటూ బరువుగా నడుచుకుంటూ వచ్చి సోఫాలో కూలబడింది రాజ్యం. "ఇప్పుడేమనుకుని ఏం లాభం రా మురళి , చేతులు కాలాక ఆకులు పట్టుకుంటున్నావు," చేతులూపుతూ గదంతా ప్రతిధ్వనించేలా గోలపెట్టింది.

"నీభార్యననాలి అసలు. గారాబం చేసి పిల్లను పాడుచేసింది."

ఒక్క క్షణం కళ్ళెత్తిన గీతకు అత్తగారి చూపులు నిప్పుసెగలా తాకాయి. మురళి కూడా విసురుగా వచ్చి తల్లి పక్కన సోఫాలో కూర్చుని తనవేపు విసిరిన అసహనమయిన చూపుల్లో ఏదో జుగుప్స. గీతకు తెలుసు అతను రాజ్యం మాటలు పూర్తిగా విశ్వసిస్తున్నాడని.

"నీకప్పుడే చెప్పానుకదరా, ఆ డిగ్రీలూ గట్రా చదివిన్చకముందె ఆ అశోక్ కిచ్చి పెళ్ళి చేయమని లేకుంటే ఇది ఏ కులం తక్కువ వాణ్ణో, జాతి తక్కువ వాణ్ణో తెచ్చి కొంప ముంచుతుందని. అంతగా కావాలంటే ఆ పక్కింటి పిల్లలాగా పెళ్ళైంతర్వాత చదువుకోలేకపోయిందా? అప్పుడు నామాట పెడచెవిని పెట్టి, నీ భార్య మాట విన్నావు. ఇప్పుడు చూడు ఏం జరిగిందో, ఉద్యోగం కూడా వెలగబెట్టి ఊళ్ళేలుతా అంటూ బయల్దేరి, ఏకు మేకై ఆ అప్రాచ్యపు వాడిని తప్ప చేసుకోనని భీష్మించుకుని కూర్చుంది. చేసుకున్నవారికి చేసుకున్నంత...అనుభవించండి"

"గీతా..," ఉరిమాడు మురళి , "నీ కూతుర్ని తీసికెళ్ళి ఆ స్టోర్ రూంలో పడేసి లాక్ చేయి."

'నీకూతురు...తనకిష్టమయినప్పుడు తన కూతురు, లేకపోతే నీ కూతురు...లయ పుట్టినప్పట్నించీ ఇది వింటూనే ఉంది.

"గీతా...వినిపించడం లేదా?"

ఉలిక్కిపడింది,... స్టోర్ రూం?"

"అవును. చెప్పానుకదా? ."

తల వంచుకుంది గీత.

చిన్నప్పట్నించీ లయ అల్లరి చేసినా, తనకిష్టం లేని పని చేసినా శిక్ష, కిటికీల్లేని ఆ బందిఖానా లాంటి గదిలో పడేసి, టివి చూడకుండా, స్నేహితులను కలవకుండా కట్టుదిట్టాలు చేసేవాడు మురళి . కానీ ఎప్పుడయితే ఆ అమ్మాయి డిగ్రీ కాలేజ్ లో అడుగుపెట్టిందో అప్పట్నించీ అలా చేయడానికి అవకాశం ఇవ్వలేదు లయ . కానీ ఇప్పుడు లయ చిన్నపిల్ల కాదు. ఇలాంటి ఆంక్షలు విధించడం మంచిది కాదు, గీత మనసు అంగీకరించలేకపోతూంది. మురళి ఇలా క్రూరంగా ప్రవర్తించడం సబబుగాలేదు.

"అసలు నీకు చెప్పడం నా బుద్ధి తక్కువ," మౌనంగా నిలబడిన గీతను ఏవగింపుగా చూస్తూ లేచాడు మురళి , "నేనే తీసుకెళ్తాను రా," లయ వేపు అడుగులు వేసాడు.

"డాడీ!" అరిచింది లయ .

కానీ వినకుండా ఆమె చెయ్యి పట్టి లాక్కెళ్ళాడు మురళి .

"డాడీ...నేను నాలుగేళ్ళ పాపను కాను, ఇరవయినాలుగేళ్ళ స్త్రీని," అతని చెయ్యి విదిలించింది లయ . కానీ అతని పట్టు ఏమాత్రం సడలలేదు.

అచేతనంగా నిలబడిపోయిన గీత మనసు బాధగా మూలిగింది. కొన్ని నిముషాల్లో వినిపించిన స్టోర్ రూం తలుపు తాళం వేసిన శబ్దం ఆమె హృదయాన్ని బ్రద్దలు చేసింది.

మూడురోజులు భారంగా గడిచిపోయాయి. మురళి కానీ, అతని తల్లి రాజ్యం కానీ ఏమాత్రం కరగలేదు. ఆ రూం లోకి ఆహారం తీసికెళ్ళడానికి మాత్రమే గీతకు అనుమతి ఇచ్చారు. అదీ టైం ప్రకారం మాత్రమే అత్తగారి దగ్గర దాచిన తాళంచేతులు ఇస్తుంది. మళ్ళీ తెచ్చివ్వడానికి ఏ కొంచెం ఆలస్యం అయినా అరుస్తుంది.

"లయా , నీకు తెలుసు మీ నాన్నకు ఎంత పట్టుదలో. ఈ యుద్ధాలన్నీ ఎందుకు? దయచేసి నీ మనసు ఎలాగయినా మార్చుకో. అశోక్ చాలా మంచి అబ్బాయి..," అనునయించబోయింది గీత.

"మమ్మీ! నువ్వు కూడానా?" ఆశ్చర్యంగా చూసింది లయ . "నాకసలు ఆ అశోక్ ఎవరో కూడా తెలియదు. ఎలా అంటున్నావు మమ్మీ?"

నా మాట విను తల్లీ, ఆ అబ్బాయిది చాలా మంచి ఉద్యోగం."

"అమ్మా!"

"నేను చెప్పేది విను. నీకు తెలుసు మీ నాన్న, బామ్మ ఒప్పుకోరని.

"అవును ఎంతసేపూ మీ నాన్న మీ బామ్మ. అసలు నీకు సొంత ఆలోచనలు రావా? నువ్వు నా కన్నతల్లివికదా, నువ్వు చెప్పు నేను సంతోషంగా ఉండాలా లేక నీలాగా ఆత్మాభిమానం చంపుకుని పడిఉండాలా?"

"లయా...! ఏం మాట్లాడుతున్నావు?"

"అవునమ్మా చిన్నప్పటినించీ చూస్తున్నాను. నాన్న, బామ్మ నిన్నెంత రాచిరంపాన పెట్టినా భరించుకుంటూ, ఒక్కమాటకూడా ఎదురుచెప్పకుండా పడి ఉంటున్నావంటే మరేమనమంటావు?"

"నీ అంత ఓపిక నాకు లేదు. నా మనసుకు విరుద్ధంగా నేనేపనీ చెయ్యలేను."

"అదికాదు లయా, అందరూ నాన్నలాగా, బామ్మలాగా ఉండరుకదా. ఈఅబ్బాయి నిన్నర్థంచేసుకునే మంచిమనసున్నవాడు అయి ఉండొచ్చు కదా?" నచ్చచెప్పడానికి ప్రయత్నించింది గీత.

''అమ్మా, ఇంకా ఈ ఇరవయిఒక్క శతాబ్దంలో కూడా, చదువుకున్నదానివి నువ్వే ఇలా మాట్లాడితే ఎలా? గంగిరెద్దులా తలూపి మనసులేని పెళ్ళిచేసుకోలేను.

"పెళ్ళికన్నా ముందు కాదు, పెళ్ళి అయింతర్వాత పుడుతుంది ప్రేమ. తర్వాత ఒకరిని ఒకరు మీరే అర్థం చేసుకుంటారు. మన సంస్కృతిలో అన్ని పెళ్ళిల్లూ అలాగే జరుగుతాయి. తరతరాలనుంచీ మేం చేసుకోలేదా?"

విచిత్రంగా చూసింది లయ , "ఓ మర్చిపోయా మీది పెద్దలు కుదిర్చిన పెళ్ళే కదూ!" వ్యంగ్యంగా అంది. "లయా! నాకెందుకో నమ్మకం అశోక్ నిన్ను బాగా చూసుకుంటాడని ." వినిపించుకోనట్లుగా అంది గీత.

"బాగా అంటే? నాన్న నిన్ను చూసినట్టుగానా?"

''నిజం చెప్పు మమ్మీ నువ్వు సంతోషంగా ఉన్నావా? మనసిచ్చిపుచ్చుకోవడం అంటే ఏంటో తెలుసా? అసలు ప్రేమ, అవగాహన ఉన్నాయా మీ ఇద్దరి మధ్యా?"

ఆ ప్రశ్నలు గుండెలమీద సమ్మెటపోటులా తాకాయి. సమాధానం చెప్పలేక కొన్ని క్షణాలు అలాగే ఉండిపోయింది గీత. "లయా...," తడబడింది ఆమె గొంతు.

ఆరాత్రి గీత కెంతకూ నిద్ర పట్టలేదు. లయ మాటలు పదేపదే ఆమె చెవుల్లో గింగురుమంటున్నాయి.

'ప్రేమా...? తనకు తెలుసా ప్రేమ గురించి? పేలవంగా నవ్వుకుంది. ఆమె మనసు ఇరవయి అయిదేళ్ళ వెనక్కి వెళ్ళింది.

ఒక చాకులాంటి అబ్బాయి కళ్ళముందు మెదిలాడు. "శరత్," ఆమె పెదవులు కూడబలుక్కున్నాయి.

శరత్, డిగ్రీ కాలేజ్లో తన క్లాస్ మేట్. చాలా తెలివయినవాడు. తనెప్పుడూ అతని నోట్స్ అడిగి తీసుకునేది. ఎన్నోసార్లు కాలేజ్ ఫంక్షన్లలో యుగళగీతాలు పాడారు. ఫైనలియర్ లోకి వచ్చేసరికి తామిద్దరికీ తెలుసు ఆ స్నేహం అలా పెరిగి ప్రేమగా మారుతూందని. చివరికి శరత్ తన మనసు విప్పి చెప్పాడు కానీ తనకు తెలుసు కులాంతర వివాహం తన తల్లిదండ్రులు ఒప్పుకోరని. వాళ్ళను బాధపెట్టడం ఇష్టం లేక, తన ప్రేమను బాహాటంగా వెల్లడించలేకపోయింది. చివరికి శరత్ కు కూడా. ఈలోపల తన వివాహం మురళి తో నిశ్చయించారు.

శరత్ కోసం మనసు ఎంత ఆక్రోశించినా, తన ప్రేమను చంపుకుని తల్లిదండ్రుల ఆదేశానుసారం మురళిని పెళ్ళి చేసుకుంది. అప్పట్నించీ ఇప్పటివరకూ ఒకరి ఆదేశానుసారం నడుచుకోవడమే తనకలవాటయి పోయింది.

"అప్పుడు ఇరవై ఏళ్ళ వయసులో ఎవరికీ ఎదురు చెప్పలేక నీ సంతోషాన్ని, ప్రేమను ఫణంగా పెట్టావు. కానీ ఇప్పుడు, ఈ నలభై అయిదేళ్ళ వయసులో కూడా, నీ భర్తకు ఎదురుచెప్పలేక నీ కూతురి జీవితంలో చీకటి నింపుతావా? ఒక్కసారి, కనీసం ఒక్కసారి నీవు నీ స్వంత నిర్ణయం తీసుకోలేవా? అతను చేసేది తప్పని తెలిసి కూడా, జీవితంలో ఒక్కసారి ఎదిరించలేవా? కనీసం నీ సర్వస్వమూ అయిన లయ కోసమయినా?" అంతరాత్మ నిలదీసి అడుగుతూంది.

"కానీ ఎలా? నా ఇంట్లో నాకే స్వతంత్రం లేదు, అధికారం అసలే లేదు."

''నీ ఇల్లా?'' నవ్వింది అంతరాత్మ. ''ఇది నీ ఇల్లని ఎలా అనుకుంటున్నావు? నువ్వు కేవలం ఒక భార్యవు, కోడలివి మాత్రమే. ఇల్లాలివి కావు. నీ భర్త, అత్తగారు దయతలిచి ఉండనిస్తే ఉంటున్నావు ఈ ఇంట్లో."

ఉదయాన్నే టీ తీసుకుని వెళ్ళింది గీత. లయ చాప పై అడ్డదిడ్డంగా పడుకుని ఉంది. ఎప్పటిలాగే రాత్రి భోజనం ముట్టుకోలేదని నిండుగా ఉన్న ప్లేట్ చెపుతూంది. నాలుగు రోజులనుంచీ కనీసం నీళ్ళు కూడా తాగలేదు. నిజానికి లయ కి బలవంతంగా ఇష్టం లేని పెళ్ళి చెయ్యాలని తనకు లేదు. ఈరోజుల్లో అంతటా జరుగుతున్నాయి ప్రేమ వివాహాలు . ఈ ఇరవయ్యొక్క శతాబ్దంలో, హైటెక్ సిటీలున్న హైదరాబాద్ లాంటి నగరంలో లో ఉంటూ కూడా తన భర్తలాగా, అత్తగారిలాగా, మన పద్ధతులు, మన ఆచారవ్యవహారాలు, మన సంస్కృతి అంటూ దొంగ ముసుగేసుకుని, కాలంతోపాటు మారకుండా తమ నమ్మకాలను, బూజుపట్టిన భావాలనూ నిరంకుశంగా, వాళ్ళ ఇష్టాఇష్టాలతో పనిలేకుండా పిల్లల మీద రుద్దుతూ వాళ్ళ జీవితాల్లో ఆనందం లేకుండా చేస్తున్నారు. ఇంట్లో పాత పద్ధతి, బయట మరో పద్ధతి. ఇంట్లో ఒకరకమయిన బోధలు, బయట ప్రపంచం మరో రకం. రెండు విభిన్న సంస్కృతుల మధ్యనున్న ఇరుకు దారిలో, ఎటువేపు గోడకు కొట్టుకుని పడిపోతారో తెలియకుండా పరుగులు తీస్తున్న యువత. ఏదీ పూర్తిగా అన్వయించుకోలేక, సందిగ్ధావస్త, సంఘర్షణ ల్లో పడి కొట్టుమిట్టాడుతూ, పెద్దలు కుదిర్చిన వివాహాలు చేసుకోలేక, తమంత తాము చూసుకోలేక, మనసులు చంపుకుని బ్రతుకుతున్న తనకు తెలిసినవాళ్ళే కొందరున్నారు. ఆలోచనలు మస్తిష్కాన్ని తొలిచేస్తూంటే చివరికి ఒక నిర్ణయానికొచ్చింది గీత.

ఆ మరునాడు, మురళి ఆఫీసుకు వెళ్ళిన తర్వాత, అత్తగారిని ఎప్పటిలాగే దగ్గర్లో ఉన్న శివాలయంలో భజన చేసుకోడానికి దింపి వచ్చి, స్టోర్ రూంలోకెళ్ళింది గీత. లయ అసహనంగా కదిలింది.

"లయా ..." మృదువుగా పిలిచింది, చాప అంచుల్లో కూర్చుంటూ. దూరంగా జరిగింది లయ .కొంచెం ముందుకు జరిగి కూతురు

ముంగురులు సవరించింది గీత. ఆమె చేయి నెట్టేసింది లయ .

"లయా , మనసివ్వడం అంటే ఏమిటో నాకూ తెలుసు. బయటికి రా. రంజిత్ నీ కోసం ఎదురుచూస్తున్నాడు."

ఒక్క క్షణం మాట్లాడకపోయినా, మరుక్షణం అర్థమయి ఒక్క ఉదుటున లేచి కూర్చుని నమ్మలేనట్టుగా చూసింది లయ .

"అవును..." కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ చిరునవ్వుతో తలూపింది గీత, "నిజంగా లయా."

"నాకు తెలుసు నా చిన్న పాప ఇప్పుడు ఎంతో ఎదిగిపోయిందని. నీకేం కావాలో సరిగా ఆలోచించి నిర్ణయించుకునే తెలివి, నమ్మకం నీమీద నీకున్నాయి, అనే నా నమ్మకం కూడా. ప్రేమించడం అంటే ఏమిటో అర్థం చేసుకోగలను."

"అమ్మా...." ఎంతో భావోద్వేగం లోపలినించి పెల్లుబికితే గానీ అలా తెలుగులో 'అమ్మా' అని పిలవదు లయ .

తనను చుట్టుకుపోయిన కూతురు తల నిమురుతూ ఒక్క క్షణం అలాగే ఉండిపోయింది గీత.

తను ధైర్యం చేసిన ఈ ముందడుగు వేసేముందు, రంజిత్ ను కలుసుకుని మాట్లాడి విచారణ జరిపింది . ఆ రెండు గంటలు మాట్లాడిన మాటల్లోనే తెలిసింది అతనిలో ఎంత పరిపక్వత ఉందో, సంస్కారముందో, ముఖ్యంగా లయ ని ఎంత ఆరాధిస్తున్నాడో. ఆ అమ్మాయి అన్నీ ఆలోచించి తనకు తగినవాడినే ఎన్నుకుందని అనిపించింది .

తన కూతురు చేయి రంజిత్ చేతిలో పెడుతున్నప్పుడు అతని ముఖంలో వికసించిన ఆనందం చూసి అనుకుంది తను ఇలా ధైర్యం చేయడం సరైనదేనని.

'నీకు పెట్టిన పరీక్షలో నెగ్గావు. మా అమ్మాయికి తగిన వరుడువి నీవే,' అన్నట్టుగా చిరునవ్వు నవ్వింది గీత. "సారీ రంజిత్ నిన్ను యక్ష ప్రశ్నలు వేసి వేధించాను. మరి నా ప్రియమయిన కూతురికి తగినవాడివో కాదో అని చూడాలికదా%ా%" సరదాగా అంది గీత.

"ఆంటీ, మీకు ఎలా ధన్యవాదాలు చెప్పాలో తెలియడం లేదు. మేము కోరుకున్న జీవితాన్ని మాకు ప్రసాదించారు మీరు. మీకు సర్వదా ఋణపడి ఉంటాము," పాదాభివందనం చేసాడు రంజిత్.

"అమ్మా..." లయ గొంతులో కృతజ్ఞతాపూర్వక మార్దవం, ప్రేమ. గట్టిగా హృదయానికి హత్తుకుంది తన కూతురుని గీత.

"అమ్మా...., నాన్నకు తెలియకుండా ఈ నిర్ణయం తీసుకున్నావంటే ఎంత ధైర్యం చేసావో తెలుసమ్మా. నీకు ప్రేమంటే ఏమిటో తెలియదని, మరెన్నో మాటలతో నిన్ను బాధపెట్టాను. క్షమించమ్మా...: " కన్నీళ్ళు పెట్టుకుంది లయ . "నీ ప్రేమకు ఎల్లలు లేవని, కండిషన్లు లేవని తెలిసిపోయిందమ్మా. నాకోసం నువ్వింత ధైర్యం చేసావు కానీ నాన్న బామ్మ నిన్నెంత చిత్రవధ చేస్తారో అని భయంగా ఉంది. "

కదలకుండా నిల్చున్న లయ కళ్ళల్లో తల్లిని గురించిన ఆందోళన.

"వాళ్ళు ఇప్పుడు నన్నేం చేయలేరు లయా. ఎప్పుడో తీసుకోవాల్సిన నిర్ణయం ఇది.

"అంటే?"

లయ కళ్ళల్లో ప్రశ్నకు జవాబుగా చేతిలోని అపాయింట్మెంట్ ఆర్డర్ చూపించింది. నా చిన్నప్పటి ఫ్రెండ్ శోభ గురించి ఎప్పుడూ చెపుతాను కదూ. తను వాళ్ళ కంపెనీలో నాకో చిన్న ఉద్యోగం ఇప్పించింది. ఈరోజే వరంగల్ వెళ్తున్నాను.

"అమ్మా.... నిజమా?" సంభ్రమంగా అడిగింది లయ.

"అవునమ్మా. నీదగ్గరే నేర్చుకున్నాను స్వతంత్రంగా ఆలోచించడం. ఎలాంటివాడయినా సరే భర్తే ప్రత్యక్ష దైవం అనే పాత నానుడి నమ్మి స్త్రీ తన అస్తిత్వాన్ని కోల్పోకూడదని నమ్ముతున్నాను."

"అయాం ప్రౌడ్ ఆఫ్ యు అమ్మా!"

"సరే సరే ఇక చాలు, ఆలస్యం చేయకుండా వెళ్ళండి," అంటూ ఇద్దరి చేతులూ పట్టుకుని నవ్వుతూ ద్వారం వేపు చూపించింది.

ఆ కొత్త జంట అలా చేయీ చేయీ పట్టుకుని, కొత్త జీవితంలోకి, కొత్త అడుగులు వేస్తూ వెళుతుంటే, కనుమరుగయేంతవరకూ చూసి కళ్ళు తుడుచుకుంది గీత.

**సుమలత దేష్పాండే..**

హైదరాబాద్..

ఇండియా...

9966799003





# " ఉగాది"

సుమంత దేశ్పాండే

పసుపుగడపలపై పడిపరావర్తనం చెదుతున్న ప్రభాతకిరణాలు...
ముత్యాల ముగ్గులపైపడి మెరసిపోతున్నాయి...
కోదండరాముని శిఖరంపై.. కోవెలగంటలపైపడి
పవిత్రతపొందిన ప్రభాకర కిరణాలు...
శిరస్సులను స్పృశించి శిరోధార్యమౌతున్నాయి...
చరాచర జగత్తునంతాచైతన్యపరచే బాలభానుని బంగరుకిరణాలు
భేదభావం లేకుండా...
ప్రసరిస్తూ ప్రమోదాన్ని కలిగిస్తున్నాయి...
గుండెలనిండా ఊపిరిపీల్చుకొని గూళ్ళనుండి బయిటకొస్తూ
కలసికట్టుగా ఆహారాన్వేషణకు బయిల్దేరిన పక్షులగుంపులు...
సమైక్యతాత్మక జీవనానికి... సజీవసాక్ష్యాలుగా కనిపిస్తున్నాయి....
పచ్చనిపైరులనుండి విచ్చుకుంటున్నవిరులపైనుండి
వీస్తున్న గాలులు... ప్రేమగా శరీరాన్ని నిమురుతూ...
ప్రకృతిని కాపాడుకోమని పరోక్షంగా చెప్తున్నాయి ....
శ్రమైక జీవన సౌందర్యానికి ప్రతీకలుగా సాగిపోయే
కర్షకులతో కార్మిక శ్రామికులతో కలకలలాడుతూ
సౌందర్యానికి సాకార మై...
ఉత్సాహంగా ఉగాది సంబరాలకు ముస్తాబౌతోంది ....
నిండు గర్భిణిలా నూతనోత్సాహంతో ఉన్న ప్రకృతికాంతకు
సీమంతం చేయడానికి సిద్ధమైన వసంతం
పచ్చనిచెట్ల పసుపు ఎర్రనిచిగుర్ల కుంకుమను పులుముకుని...
ఎదను పులకింప జేస్తోంది...
గున్నమామిడి గుబురులలో... మావిచిగుర్లు తిని
మత్తెక్కి కూసున్న కోయిలమ్మ...
కాల మహావిపంచిలోని
తంత్రిని మీటుతూ కుహు కుహురావాలతో
ఈకొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతోంది....
ఉగాది ఉషోదయం ఉత్సాహాన్నినింపుతూ
కనులపండువ చేస్తోంది...



# " గిరికర్ణి కాంబరీయము"

మూర్తి జొన్నలగెడ్డ

కనుల నిండుగ నుండె పుడమి
కదు హరితమై వన భరితమై
ఆ గగనంపు రారాజు
మధురోహ ఫలితంబు
మేఘ కన్నియల రాయబార
మతి ప్రేమ సారమది.

అరులు చూపిన గిరులు కూడగ
చిరు జల్లులై యా జడి సింధువై
పొంగి పొరలేను నేల 'తడి మేను
తడవ తడవకూ తాప తప్పదై
ఆ దేవి నటులనే తాకేటి సంద్రుడు
సోమ ధారల కూడి ఎగసి వగసేను
సోమ ధారల కూడి ఎగసి ఎగసేను

అదియు గాంచిన జగచ్చక్షువు
చండ కరుడై కడలి అవిని
మిన్ను కడకే మరలి వైచెను
ఆశ వీడని ప్రేమ వాడని ఆ
మింటి పెనిమిటి మిగుల పొంగెను
పచ్చంగ పొంగారు భామ కయ్యది
సమ్మతంబని తలచుచుండెను
సమ్మతంబని తలచుచూ మరి
శంబరమ్ముల పంపుచుండెను

ఓ ధరణీధర అవసధులార
తెలివి కరవై నిండు వనముల
ని కనువుగ నరకి ప్రోగిడి
పచ్చ కొండల నెర్ర బండల

వోలె అడచి అటుల విడిచి
వెడలి పోవుట అసలు తగదు
భూమి కన్నియ అనీహంబున
కెంపు వన్నియ దాల్చినటుల
ఆ రేడు తలచిన ఆ వాన నిలచిన
కల్ల లగునా తల్లి కలలిక
ప్రకృతి యందలి పండు చుండెడి
ప్రేమ గాథకు పెద్ద తోడుగ
నిలిచి యుండగ అదియు పండగ
వెల్లి విరిసెడి అమృత ధారల
ఆనంద తాండవ మాడు చుండగ
మనుజు లైనా అమరు లౌరట
మరిక భువియే స్వర్గ మౌనట!

**డా. మూర్తి జొన్నలగెడ్డ సౌత్ పోర్ట్.**

**యునైటెడ్ కింగ్డమ్**

(ఆకాశానికి, భూమికి మధ్య జరిగే ప్రణయాన్ని తమ హ్రస్వ దృష్టితో ప్రళయంగా మార్చి తమకే చేటు చేసుకునే మానవాళికి ముకుళిత హస్తాలతో చేయు వేడికోలు).

## "కాగితము"

సర్వసీహెచ్

పరిచయం లేని పేరు నాది , అందమైన అక్షరాలు నా అలంకారాలు. అందరూ నన్ను పలు విధాలుగా వాడేస్తూ ఉంటారు. పత్రికలుగా, పుస్తకాలుగా, ఇంకా చెప్పాలంటే ప్రపంచాన్ని శాసించే కరెన్సీగా, రాసుకొనే అస్త్రాలుగా ఇలా చెప్తూ ఉంటే నన్ను నేనే పట్టలేనంతగా నింపేసుకుంటానేమో. పసిప్రాణం పుట్టిన నుండి ఆ మనిషి పరమపదం చెందే వరకు అందరితో ప్రయాణం చేస్తూనే ఉంటాను.

నాపై ఎవరు ఏమి వ్రాస్తున్నా , ఎంతో ఆత్రంగా చూస్తూ ఉంటా, అది ప్రేమలేఖ అయితే చదివే వారికంటే ముందే నేను చదివి తెగ సిగ్గు పడిపోతూ ఉంటా. ఎన్నో జీవితాలు, వారి కష్టాలు నాలో పొందుపరుస్తూ ఉంటే ఎంత విలవిల లాడిపోతానో మీకెలా చెప్తే అర్థమవుతుంది.

నాలో దాచుకున్న విషయం పరిజ్ఞానం విశ్వమంతా చేరాలని, నన్ను అక్కున చేర్చుకొనేవాళ్ళకి మరి కొంచెం మక్కువగా తెలియపరుస్తూ ఉంటాను.

పిల్లల పాఠాలు నాలోనే, పెద్దల వీలునామాలు నాలోనే, ఉదయాన్నే ప్రపంచ విషయాల్ని విశదీకరించే వార్తలూ నాలోనే, పురాణాలైనా, మతగ్రంథాలైనా, అన్నీ నాతోనే ప్రయాణం చేస్తూ ఉంటాయి.

యాంత్రికంగా మారిపోయిన ఈ రోజుల్లో నన్ను ఎందుకో దూరం చేసేస్తున్నారు. నన్ను పక్కన పెట్టి, ఐపాడ్లు, ఫోన్లతో కాలక్షేపం చేస్తూ నన్ను నెమ్మదిగా పక్కకి నెట్టేస్తున్నారు. అందరికీ అన్నీ పంచిన నన్ను వేరు చేస్తుంటే ఎందుకో చాలా బాధగా ఉంటుంది .

నేను మీ నేస్తాన్ని , మీ కనులను ఎంతో ఆరోగ్యం గా ఉంచుతాను. మిమ్మల్ని నవ్విస్తాను, మీలో భావాలకి అక్షర రూపం ఇస్తాను, ఎవరికీ చెప్పలేని రహస్యాల్ని కూడా మీకోసం నేను నాలో దాచుకుంటాను.

ఒక పుస్తకం చదివేప్పుడు మీ మునివేళ్లతో నన్ను పక్కకు త్రిప్పుతూ ఉంటే నా ప్రక్కన ఉన్న స్నేహితులని కూడా మీరు పలకరిస్తూ ఉంటే, నేను ఎంత పులకరించిపోతానో మాటల్లో చెప్పలేను.

మన దేశంలో నన్ను సరస్వతిగా కొలుస్తారు, పొరపాటున నేను వాళ్ళ కాళ్ళకి తగిలినా, వెంటనే నమస్కరించి వాళ్ళ కళ్ళకి అద్దుకుంటారు. ఇంతటి మర్యాదని పొందే నేను పోను పోను క్షణికమైన ఆనందం కోసం గంటలు గంటలు వెచ్చిస్తూ నన్ను దూరం పెడుతుంటే ఎంతో బాధగా ఉంటుంది. కన్నీళ్లు పెట్టి నన్ను నేనే పాడుచేసుకోలేను కనుక మిమ్మల్ని ప్రాధేయపడుతున్నాను. దయచేసి నన్ను మీ చేయిదాటి పోనీయకండి, మిమ్మల్ని ఎంతో గొప్పగా తీర్చి దిద్దాలి అనుకొనే స్థానంలో మీ కంటే, మీ తల్లిదండ్రుల కంటే, మీ గురువుల కంటే, మీ శ్రేయోభిలాషుల కంటే కూడా నేనే ముందుంటాను, ఇది నిజం.

కావాలంటే ఒక ప్రయత్నంగా 41 రోజులు నన్ను మీ చేతిలో ఉంచుకొని నన్ను చదువుతూ ఉండండి, నేను మీకు ఎంత నేస్తాన్ని అయిపోతానంటే, మీ ప్రతీ ఆలోచనల్లో, మీరు చేసే ప్రతీ పనిలో నాలో దాచుకున్న అక్షర వాక్యాలని గుర్తు చేసుకుంటూ ఉంటారు. మిమ్మల్ని జోకొట్టి ప్రశాంతమైన నిద్రని కూడా ఇస్తాను.

దయచేసి నా గురించి పైన వ్రాసిన వాటినైనా ఒక కాగితం లో నిక్షిప్తం చేసి చదివితే ఎంతో ఎంతో సంతోషిస్తాను . కొన్ని విషయాల్లో నేను ఎలానూ భర్తీ చేయలేను , కనీసం మళ్ళీ పాతరోజులు వచ్చేలా నన్ను మీ చేతి నుండి వేరు చేయొద్దని నా మనవి .

సదా మీ భవిష్యత్తుకై ఆలోచించే మీ నేస్తం

# “ ఆడపిల్లని ఆట వస్తువుగా”

## పవన్ మద్దికుంట

ఆడపిల్లని ఆట వస్తువుగా చూశారని ఏడవాలా
నిర్భయ చట్టం వచ్చిందని భయం వదిలి బతకాలా
దిశ చావు తప్పించలేదని కుంగి కుమిలి పోవాలా
కీచకులని గుర్తించలేదని జనారణ్యాన్ని వదిలి వేయాలా
కామాంధులని శిక్షించలేని అన్యాయాన్ని అడ్డుకోవాలా!!

అలసిన హృదయం అమ్మ ఒడికి దూరం కావాలా
ఉప్పెన క్రోధం అంత ఓర్పుగ ఒదిగి ఉండాలా
కాటికి కాళ్ళు చాపిన దుష్టులను చంపక వదలాలా
తండ్రి విలువ తెలియని మూర్ఖులను ఉరివేయాలా!!

స్నేహం పేరుతో బలాత్కరించిన పశువుల్ని శాశ్వతంగా వదించుకోవాల..
చెల్లి వరుసతో కామం చూపిన కుక్కలను నరికి పెట్టాలా
తల్లి బంధాన్ని మరిచిన కీచకులని కాల్చి బూడిద చేయాలా
పాల బుగ్గల బాల్యాన్ని చిదిమేసిన చండాలుని పొడిచి పోవాలా!!

మాయ మాటల మోసబుద్దుల మేనమామల మృగాల్ని మట్టుబెట్టాలా
పిచ్చి చూపుల కర్కశకోర్కెల కాలయముల పంది కొక్కుల్ని కసితీరా కాల్చాలా
వావి వరుసలు లేని వక్ర బుద్ధుల బాబాయులని బజారుకి ఈడువాలా
సిగ్గులేని విలువలేని సోదరులని వల్లకాటికి సాగనంపాలా
మత్తు ధ్యాసలో పెరిగిన మానభంగాల చిత్తు చేయాలా
తాగిన మైకంలో సడలిన పురుషుల నెత్తురు చూడాలా!!

తల్లి విలువ తెలియజేసి తమ వంతు కర్తవ్యం గుర్తుకు తేవాలా
చెల్లి ప్రేమ పంచేసి మనమంతా మధుర ఆనందం పొందాలా
భార్య బంధం గుర్తుచేసి బంగారు భవిత సాకారం చేసుకోవాలా
బిడ్డ రుణం తీర్చేసి మహర్షిగా బతుకమని భుజంతట్టి సాగనంపాలా
చదువుల తల్లి చెంతలో పునాదులు వేసి పరిపూర్ణ జీవితం ప్రసాదించాలా

# “ నగరాన్ని చుట్టేసింది గాలి”

## పవన్ మద్దికుంట

నగరాన్ని చుట్టేసింది గాలి కాలుష్యం
గగనాన్ని తాకుతోంది అది ప్రతిదినం
భువనాన్ని మారుస్తోంది దిన దిన నరకం
మనుషుల్ని కోరుతోంది తప్పించమని గండం
దేవుడిని వేడుతోంది ఆపేయమని ఈ ప్రచండం!!

ఫ్యాక్టరీల గొట్టాల నుండి దట్టమైన పొగ
వాహనాల ఇంజనుల నుండి గుప్పుమన్న సెగ
ఏసి డబ్బాలు చేస్తున్నాయి గదిని చల్లగా హాయిగా
వాయు, ధ్వని కాలుష్యాలు పెరుగుతున్నాయి మెల్లగ
శ్వాస వ్యాధులు చేరుకున్నాయి నింగికి వున్న ఫళంగ!!

భాగ్యనగరం మొత్తం మారింది కాంక్రీట్ వున్న జంగల్
రాతి భవనం సొంతం వచ్చింది ప్రాజెక్ట్స్ ఎన్నో సింపుల్
పచ్చదనం అంతం అయ్యింది బిల్డింగ్స్ కొన్ని ఎక్సమ్సుల్
సుందర నగరం దండుగ మాయం చేసింది ఎస్టేట్ రియల్!!

నగర ప్రజలు పెంచెయ్యాలి మెట్రోలో ప్రయాణం
సోదర మూర్తులు తగ్గించాలి పెట్రోలు వాడకం
వాహనదారులు వెయ్యాలి భావితరాలకు మార్గం
బాధ్యత పౌరులు చూపాలి బంగారు భవితవ్యం
ఆశల హరివిల్లు కావాలి సుందర నగరం!!

# "జ్ఞాపకాల తెమ్మెర"

కొసనా అరుణకాంతి

పిన్నితోనే వెళ్ళను బాబూ! నిన్న ఈ వీధిలో ఈ చివరి నుంచి ఆ చివరి వరకూ వెళ్లడానికే అంతసేపు పట్టింది. ఇక ఈ రోజు పక్క వీధిలో ఉన్న పెదతాతగారి ఇంటిదాకా అంటే నా వల్లకాదు" బుంగబూతి పెడుతూ అక్కతో అంటున్నాడు తేజు.

అద్దంలో చూసుకుంటూ జడవేసుకుంటున్న నేను నవ్వుతూ వెనుతిరిగాను చిన్నప్పుడు నేనూ అంతే అత్తతో కలసి పెదనాన్నల ఇళ్లకు వెళ్లడానికి అచ్చంగా ఇలానే అనేదాన్ని.

ఈ ఊరు అలాంటిది మరి. బత్తిగా చూస్తే రెండు వందల గడప. నాలుగు పెద్ద వీధులు, వాటిని జత చేర్చుతూ చిన్న చిన్న సందులు. టౌనుకు పక్కనే ఉండటంవలన పల్లెటూరి వాతావరణం ఉండడం అన్ని కులాల వాళ్లు కలసి వుంటారు. ఎవరింట్లో ఏం జరిగినా అందరికీ తెలుస్తుంది. అందులోనూ పదేళ్ల తరువాత అడుగుపెట్టానేమో గడప గడపకీ పలకరింపులే.

"రాధమ్మ తల్లీ నువ్వేనా?, ఎలా ఉన్నావే రాధా? ఎన్నాళ్లకొచ్చావు రాధమ్మ? ఇప్పటికీ గుర్తొచ్చామా? ఎన్నాళ్లుంటారు? బట్టుంచుకుందువు వెళ్లేలోపు ఇంటికి రామ్మా!"

బయట అడుగుపెడితే చాలు. మూడు రోజులుగా ఇలా పలకరింపుల ఆప్యాయతల జల్లులతో తడిసి ముద్దవుతున్నాను.

నువ్వక్కర్లేదు తేజూ మీ పిల్లలంతా అల్లరి చేయకుండా అమ్మమ్మ దగ్గర వుండండి. పిన్ని నేను వెళ్లివిస్తాం" పదవే అంది అక్క.

నా మూడేళ్ల పాప నిద్రపోతోంది. గదిలో అక్క పిల్లలతో కలసి ఆడుకుంటున్నాడు పిల్లాడు.

"అరె ఆ సామాను తీయకండిరా. అమెరికా తీసుకెళ్లాలని కదా దాచుకుంది మీ అమ్మ" అమ్మ కోప్పడుతోంది..

ఒక్క ఉదుటన లోపలికి పరిగెత్తాను. లోపల పిల్లలు ప్రాణప్రదంగా బ్యాగ్ లో దాచుకున్న వస్తువులు ఒక్కొక్కటి పేర్చి ఆడుకుంటున్నారు. అవన్నీ నాన్నగారితో ముడిపడిన నా చిన్ననాటి జ్ఞాపకాలు.

పిల్లల్ని పక్కకు నెట్టి ఒక్కో వస్తువునూ ఆప్యాయంగా తడుముతూ తిరిగి బ్యాగ్ లో వేసుకుని ఒక్కసారి హృదయానికి హత్తుకుని జాగ్రత్త పెట్టుకున్నా మరోసారి సరిగ్గా నా మధ్య వేలుకి అమరిపోయిన నాన్నగారి పగడాల వుంగరం ముద్దుపెట్టుకున్నాను. ఇదంతా గమనిస్తూ నవ్వుతూ నా కోసం ఎదురుచూస్తోంది అక్క గుమ్మంలో.

ఇద్దరం కలసి ఆ సందు చివర మలుపు తిరిగి పెద్ద వీధిలోకి వచ్చాం. నిన్నటివరకూ ఆ వీధి అంతా ఒకటే సందడి. ఆ వీధిమధ్యలో ఉండే కామాక్షీదేవి ఆలయానికి ధ్వజస్థంభారోహణం జరిగింది. దాదాపు ఆ వీధి సగం వరకూ తాటాకుల పందిరి వేసి హెూమగుండాలు. ఏర్పాటుచేశారు. వేదమంత్రాలు అంతా వినబడేటట్లు ఊరంతా స్పీకర్లు, పగలో రాత్రి తెలియనట్లు లైటింగులు ఊరంతా పండగే ప్రతీ ఇంట్లోనూ ఎక్కడెక్కడి బంధువులో తరలివచ్చారు. ముఖ్యంగా ఇంటి ఆడపిల్లలు రావాలని ఆచారం. ఎవరింట్లోనూ పొయ్యి వెలగలేదు. ఊరంతా సంతర్పణే తతంగం అంతా నిన్నటితో అద్భుతంగా ముగిసింది. లైటింగులకోసం రోడ్లకు ఇరువైపులా పాతిన స్తంభాలు తీసేస్తున్నారు.. సందడితో కళకళలాడిన వీధులు ఖాళీగా విశాలంగా తెలుస్తున్నాయి. ఈ వీధుల్లోనే నాన్న నాకు సైకిల్ నేర్పించారు చిన్నప్పుడు. డిగ్రీ వరకూ కాలేజీకి స్నేహితురాళ్లతో సైకిల్ మీద తిరిగిన జ్ఞాపకాలన్నీ నిన్నా మొన్నా జరిగినట్లే వున్నాయి.

నాన్న లేకుండా ఈ ఊరిలో అడుగుపెట్టాలంటే గుండెల్లో ఏదో అలజడి. "ఎలానూ ఇండియా రావాలనుకుంటున్నారు. కదా చంటిదాని పుట్టెంట్రుకలు తీయించాలని. ఆ వచ్చేదేదో అమ్మవారి ఉత్సవ సమయంలో ప్రయాణం పెట్టుకోమని పదే పదే చెప్పి ఒప్పించింది అక్క ఎంత మంచి పని చేశానో వచ్చాకనే అర్ధమైంది. ఒకరా ఇద్దరా చిన్ననాటి స్నేహితులు, బంధువులు, ఆత్మీయుల కలయిక, వారి ఆప్యాయతల భావోద్వేగాలతో పులకించిపోతున్నాను..

దారిలో కనబడిన తెలిసిన వారందరినీ పలకరిస్తూ క్షేమ సమాచారం అడుగుతూ, తెలియజేస్తూ వెళ్తున్న మాకు ఆ వీధి మధ్యలో కుడివైపున ఉన్న కొత్తగా కట్టిన నాలుగంతస్తుల అపార్ట్ మెంట్ ముందు నా కాళ్లు నిలచిపోయాయి. నిన్న కూడా గుడికి వచ్చినప్పుడు చాలాసేపు అక్కడే నిలుచున్నాను. పదేళ్ల క్రితం వరకూ అదో చిన్న అందమైన పొదరిల్లు. ఒక పాత పెంకుటింటిలో ఒక పోర్షన్ కొని చిన్న డాబా ఇల్లుగా మార్చారు నాన్న నందనవనంలా మార్చేసింది అమ్మ ఆ ఇంటిని.. పచ్చగా కళకళలాడుతూ మొక్కలు కంటికింపుగా ఉండేవి. సన్నజాజి పందిరి ఇంటికి తోరణంలా అల్లుకుని అతిథులకు స్వాగతం

పలుకుతున్నట్లుండేది. ఇంటిముందు చిన్న గేటు అదేమిటో అదెప్పుడూ తెరిచే వుండేది. పూజకు పూలకోసం రోజూ ఒకరిద్దరైనా వచ్చేవారు. ఎవరైనా ఇంటికివచ్చి వెళ్లేటప్పుడు అమ్మ గేటుదాకా వచ్చి సాగనంపుతూ ఓ గులాబీనో, మందార పువ్వో తృంచి ఆడవాళ్ల జడలో తురిమేది.

వెనక కాస్త స్థలం ఉండటంతో పిల్లలకోసం ఒక గదివేశారు నాన్న అబ్బో మనది ఎంత పెద్ద ఇల్లో అనుకుంటూ తృప్తితో నిండిపోయిన రోజులని, అన్నయ్య, అక్కలతో ఆటలూ, పాటలూ, కొట్లాటలూ వెరసి ఎన్ని జ్ఞాపకాలు, వాళ్ల పెళ్లిళ్లు కూడా అందులోనే జరిగాయి. ఒక్క నాన్నని కోల్పోవడం తప్ప అన్నీ శుభకార్యాలే.

బావగారు పక్కటౌను కాలేజీ లెక్చరర్ కావడంతో ఇదే ఊళ్లోనూ, అన్నయ్య వదినలు ఉద్యోగరీత్యా హైదరాబాద్లోనూ స్థిరపడ్డారు. నాన్న పోయిన సంవత్సరం లోపుగానే అన్నయ్య స్నేహితునితో నా పెళ్ళి, వెంటనే అమెరికా వెళ్లిపోవడం. అక్క దగ్గరలోనే ఉన్నా అమ్మను ఒంటరిగా ఉంచడం ఇష్టంలేక అన్నయ్య తనదగ్గరకు తీసుకోపోవడం తర్వాత పాతదైన ఇంటిని అమ్మేయ్యడం అన్నీ త్వరత్వరగా జరిగిపోయాయి.

ఇంకెంతసేపు ఇక్కడుంటావే ఎంతసేపు చూసుకున్నా ఇది మనది కాదు. మనకళ్ళముందే ఎన్ని మార్పులు, పాత పెంకుటిల్లు శ్లాబ్ వేసి దాబాగా మారింది. మనం అమ్మేశాక అది కూర్చెసి ఖాళీ స్థలంగా చాలా సంవత్సరాలు అలాగే వుంది. రెండేళ్ల క్రితమే పక్కనున్న స్థలం కూడా కలుపుకుని ఈ అపార్ట్మెంట్ కట్టారు. కొన్నేళ్లకు ఇదికూడా వుండదు. ఏదీ శాశ్వతం కాదని ఇక్కడే తెలియడం లేదూ! ఇలారా నేనొకటి చూపిస్తాను. ఎడమవైపు రెండో ఇంటివైపు లాక్కెళుతూ అంది అక్క నీకు పార్వతమ్మ గుర్తుంది కదా! ఆవిడ కొడుకే ఇప్పుడు హోటల్ నడుపుతున్నాడు.

గుర్తులేకేం? ఇడ్లీ పార్వతమ్మ అంటే ఆ ఊరిలో ఎంత పేరు.

చిన్నప్పుడు అమ్మ అప్పుడప్పుడూ రెండు గిన్నెలు చేతికిచ్చి ఇడ్లీలు తెమ్మనేది. పెద్దగిన్నె ఇడ్లీలకోసం చిన్న గిన్నె పచ్చడికోసం ఆవిడ సినిమాల్లో సూర్యకాంతానికి రెట్టింపు సైజులో ఉండేది. పొయ్యి దగ్గర పీటవేసుకుని కదలకుండా వాయి తరువాత వాయి ఇడ్లీలు చేస్తుండేది. పాపం బక్కపలచగా పీలగా పొట్టిగా వుండే ఆమె భర్త మిగిలిన అన్ని పనులూ చేస్తుండేవాడు. అతను రోట్లో పచ్చడి రుబ్బుతూ వుంటే అందరూ గిన్నెలు పట్టుకుని ఎదురుచూసేవారు. అతను చేసే రోటిపచ్చడికి అంతపేరు ఇప్పుడు ఆ ఇంటి కుడివైపుకి షెడ్ దించి – నాలుగైదు బల్లలు వేసి వున్నాయి.

అటుచూడు' ఆగిపోయాయి నా అడుగులు

"అవును" అంది తల ఊపుతూ

ఇంటి ఎడమవైపున సందుకు ముందు భాగంలో పెద్ద రుబ్బురోలూ దానిని చేరి ఉన్న చిన్నరోలు, దుమ్ముకొట్టుకు రెండూ చాలా రోజుల నుంచీ వాడకం లేదని తెలుస్తోంది. చిన్న రోటిమీదే నా కళ్లు నిలిచిపోయాయి.

"మనం ఇల్లు ఖాళీ చేస్తున్నప్పుడు పార్వతమ్మ అత్తయ్య ఈ రుబ్బురోలు తనకు కావాలని అడిగిమరీ తీసుకెళ్లింది. తను ఉన్నన్నిరోజులూ వాడుకునేది".

అవును అది మన ఇంటి ముందు భాగంలో సన్నజాజి వంటగదికి పక్కగా ఉండేది. అమ్మ రోజూ స్నానం చేసి రాగానే చెంబుడు నీళ్లు తెచ్చి రోటిమీద కుమ్మరించి కడిగి విసుపు రాసి కుంకుమ చట్టు పెట్టం. నాలుగక్షింతలు చల్లి దండం పెట్టి పైకి చూసి సూర్య నమస్కారం చేసి వెళ్లేది. అమ్మ అందులో చేసే రోటి పచ్చని మహారుచిగా వుండేది.

ఎప్పుడైనా ఎక్కువ పనిలో ఉన్నప్పుడు ఆ చేయించిన దినుసులు నా చేతికిచ్చి రోట్లో కుమ్మి తీసుకురమ్మనేది బండతో రోట్లో కుమ్మడం సరదాగానే వున్నా ముందు ఆ పసుపు కుంకుమలు కడగడం, పచ్చడి అయ్యాక తిరిగి రోలంతా కడిగి శుభ్రం చేయడం మహాచిరాకు. అందుకే చులాగ్గా ఆ పని అక్కకు అప్పచెప్పి తప్పించుకునేదాన్ని.

"ఏమిటి ఈ రుబ్బురోలు కూడా అమెరికా తీసుకెళ్లిపోతావా?' నవ్వుతూ అడిగింది అక్క.

"కావాలని తీసుకెళ్లి ఇప్పుడిలా వదిలేశారు విలువలేకుండా కదా? చిన్న బుచ్చుకున్నట్లు అన్నాను.

"మనం కూడా మనకు అవసరం లేదనే కదా ఇచ్చేశాము. ఆ విలువను వాళ్లు ఇవ్వాలని మనం ఎదురుచూడకూడదు. తీసుకెళ్లిన పార్వతమ్మ తను ఉన్నంతవరకూ వాడుకుంది. ఇప్పుడు కొడుకు హోటల్ పెద్దదిగా చేసుకున్నాడు. అవే రుచులూ, అభిరుచులూ ఇంకా వుండాలని లేదుగా ఇప్పటికి సగం రోడ్డుమీదకి వచ్చింది. కొన్నాళ్లకు మరెక్కడికో పోతుంది. రాయి కాబట్టి ఇంకా ఇంతకాలం వుంది. ఏ వస్తువైనా అంతే ఇక అమ్మ పూజ చేసేదంటావా? ముట్లను కూడా భగవత్ స్వరూపాలుగా భావించడం నేర్చుకుని ఆచరిస్తే చాలు. పూజ నవసరంలేదు. పద పెదనాన్న ఎదురుచూస్తుంటారు" అక్క ముఖంలో అదే ప్రశాంతత.

----

అమ్మవారి గుడికి ఎదురుగా తాటాకు పందిరి ఇంకా వుంచారు. కొంతమంది రాశులుగా పోసిన కుంకుమను పొట్లాలు కడుతున్నారు.

ఊళ్లో అందరికీ పెంచడంకోసం, గుడిలోపలికి వెళ్లి నమస్కరించాము.
"ఈ రోజైనా వస్తున్నావా? లేదా?
వెనుకనుంచి భుజంపై పడిన చేతి స్పర్శకు తుళ్లిపడి వెనక్కి తిరిగాను 'లక్ష్మి నవ్వుతూ నిలబడివుంది.
ఇంకా రెండ్రోజులు వుంటాను కదే!
"అదంతా నాకు తెలియదు ఇప్పుడే రావాలి మా ఇంటికి" అంటూ గుడికి సరిగ్గా ఎదురుగా రోడ్డు దాటగానే ఉన్న డాబా ఇంట్లోకి లాక్కెళ్లింది. వరుసకు మావయ్య కూతురే అక్క సెళ్ళెంతరువాత, నేను కాలేజీ చదువులో పడ్డాక పేరంటాలకూ, షాపింగులకూ అమ్మకు లక్ష్మినే తోడు.
ఎప్పుడు చేసి పెట్టిందో రెండు తెల్లటి కప్పుల్లో చిక్కని పాయసం తీసుకొచ్చింది. చనువుగా మంచంమీద మఠం వేసుకుని కూర్చుని తింటూ పొందిగ్గా సర్దుకున్న ఇంటినే చూస్తున్నాను.
నా దృష్టి ఎదురుగా టేబుల్ మీదవున్న చిన్న పూలకూజామీద పడింది.
"గుర్తొచ్చిందా! నువ్వు తయారుచేసినదే అత్తయ్య ఇల్లు వదిలి వెళ్లేటప్పుడు నన్ను పిలిచింది. నాకు అవసరమైన చాలా సామాను తెచ్చుకున్నాను. ఇది నా కూతురికి చాలా నచ్చి తెచ్చేసుకుంది. మొన్నటివరకూ నీవు వేసిన అనే రంగులు వుండేవి. బాగా వెలసిపోతేనూ మళ్లీ కొత్తగా పెయింట్ చేసింది నా కూతురు" దానిని నా నా చేతికందిస్తూ అంది లక్ష్మి.
అందుకుంటున్న నా చేతులు వణికాయి. నాన్న గుర్తొచ్చారు.
అవి టెంత్ క్లాస్ సెలవులు. ఒక స్నేహితురాలి ఇంట్లో అందమైన పూలకూజా చూశాను. దాని ఆకారం చాలా ప్రత్యేకంగా ఉంది. కూజా మొత్తం చిన్న చిన్న పువ్వులతో నిండిపోయి వుంది. ఇప్పుడైతే మార్కెట్లో రకరకాల క్లేలు దొరుకుతున్నాయి. అప్పుడలాకాదు. ఆది, మా స్నేహితురాలు వాళ్ల అక్క పెళ్లికి వచ్చిన బహుమతి. అసలు ముందు ఆ కూజా దొరికితే ఎలాగోలా ఆ పువ్వులు తయారుచేసి రంగులద్దాలని ఆలోచన అప్పటికప్పుడు సైకిలేసుకుని వరహాల తాత ఇంటికెళ్లిపోయా. ఇంటి బయట ఎప్పుడూ ఉండే కుండలూ, ముంతలూ ప్రమ్మెదలు అరబెట్టి వున్నాయి. అడుగుదామంటే తాతకూడా ఊళ్లో లేదు. నిరాశగా వెనుదిరిగాను. ఇంకా రెండు మూడు చోట్లు వెతికాను. కానీ ఇలాంటి కూడా దొరకలేదు. అలా రెండు మూడు రోజులు గడచిపోయాయి.
"రాధమ్మా ఇలారా ముఖంలో ఆ దిగులేమిటి? కుండ కోసమేనా ఇదంతా!" నవ్వారు నాన్న.
"వరహాల తాత ఊరి నుంచి వచ్చేశాడట పద, కాస్త నవ్వు పులుముకుని రాజి స్కూటర్ మీద తాత ఇంటికి తీసుకెళ్లారు. చిన్నప్పుడు, నాన్నా వాళ్లు వరహాల తాత పక్కింట్లోనే ఉండేవారుట. అంటే అత్తయ్యలు, పెదనాన్నలు ఇలా పిల్లలంతా ఆయన కళ్లముందు పెరిగినవాళ్లే. ప్రయాణం చేసి అలసివున్నాడు తాత, అయినా మమ్మల్ని చూసి సంబరపడి లేచి కూర్చున్నాడు. కూజా ఎలా కావాలో వివరంగా చెప్పాను.. గుర్తుకోసం బొమ్మకూడా గీసి ఇచ్చాను.
నాలుగురోజుల తర్వాత కూజా తయారుచేసి ఇంటికి తెచ్చిచ్చాడు.
నాకు నచ్చిన షేప్ రాలేదని నాన్న దగ్గర మారాం చేశాను.
"నువ్వు అడిగావని నీ మీద ప్రేమతో ప్రయత్నించి తెచ్చిస్తే ఆ శ్రమను అర్థంచేసుకోకపోవడం నీ తప్పు" అంటూ నాన్న చివాట్లు ఇంకా గుర్తున్నాయి. తెల్ల జిగురుకు ఏవేవో పొడులు కలిపి చేతితో పూల ఆకారం తెప్పించి కూడా అంతా అంటించి రంగులు వేసుకోవడం గుర్తుంది.
"బావుంది తల్లీ అని నాన్న మెచ్చుకోవడం ఇంకా గుర్తుంది." "లక్ష్మీ నువ్వు ఏమీ అనుకోనంటే నేనిది తీసుకెళ్లచ్చా? కళ్లల్లో నీళ్లు తిరుగుతుండగా అడిగాను.
నీ వస్తువు నువ్వు తీసుకోవడానికి నా అనుమతి కావాలా?? లక్ష్మి అనునయంగా నా భుజం మీద చెయ్యి వేసింది.
"ఇచ్చిన వస్తువు తిరిగి తీసుకోవచ్చునా? వరహాల తాతయ్యకు తెలిసిందంటే ఒక సూటికేస్ నిండుగా బోలెడు కూజాలు చేసిస్తాడు.
నువ్వు మరో నాలుగు రోజులు ఉండాలి మరి నవ్వుతూ అక్క
"అవును ఉండొచ్చుకదే! పదేళ్లకు వచ్చావు?
"నీకు తెలియంది కాదు లక్ష్మీమూడు వారాలే సెలవు దొరికింది. అసలు ఈ పదేళ్లలో మూడుసార్లే ఇండియా వచ్చాను. వెళ్లిన మూడేళ్లకు అమ్మ వచ్చింది. పురుడు పొయ్యడానికి. తరువాత చంటాడిని తీసుకుని ఒకసారి వచ్చాను. మొదటివారం జెట్‌లాగ్, పిల్లలు. వాతావరణానికి సరిపోవడం, రెండవ వారం అత్తవారింట్లో తరువాత మొక్కులు, షాపింగ్ ప్రయాణం అంతే ఉద్యోగం ఒకటి వెలగబెడుతున్నాను కదా! ఎక్కువ రోజులు సెలవు పెట్టలేను" నా అమెరికా గోడు చెప్పుకొచ్చాను.
అరె సైదులు మావయ్యలా ఉన్నారే? అక్క పరుగున వీధిలోకి వెళ్లింది వెనకాలే నేనూ,
అక్క పిలుపుతో సైకిల్ మీద వెళుతున్న ఆయన వెనుతిరిగారు. అక్క వెనక నన్ను చూడగానే కళ్లు మెరిశాయి.
"నువ్వొచ్చావని తెలిసింది రాధా అత్తయ్య చెప్పింది. నేనే రావాలనుకుంటున్నా నిన్ను చూడటానికి, ఎలా ఉన్నావు? పిల్లలేరి?

ఎన్నాళ్లుంటావు? అంటూ ఒక్కటే ప్రశ్నలు ఆప్యాయత కురిపిస్తూ... ఆయన గొంతుకు ప్రక్కగా మెడవైపు నిలచిపోయాయి నా కళ్లు. అక్క ద్వారా ఆయనకు జరిగిన ఆపరేషన్ గురించి ముందే తెలుసు.

అదే అడిగాను.

"నాకేం చక్కగా ఆరోగ్యంగా ఉన్నాను చూడు నవ్వుతూ అన్నారాయన చిన్నప్పటి నుంచీ చూస్తున్నా అదే స్వచ్ఛమైన చిరునవ్వు ఉన్నంతలో ఇతరులకు సహాయపడే తత్వం. ఇప్పటికీ వారానికోసారి అక్క ఇంటికి వచ్చి పెరట్లో కాసిన కొబ్బరికాయ లేదా ఆనపకాయో ఇచ్చి వెళ్తుంటారట. సైదులు మావయ్య మా కాలేజీనే క్లర్క్ పనిచేసేవారు. నాన్నతో మంచి స్నేహం. అన్నయ్యగారూ అంటూ నోరారా పిలుస్తుంది అమ్మ మేం ముగ్గురం కాలేజీ లైబ్రరీలో పుస్తకాలను ఆయన పేరేమీదే తీసుకుని సంవత్సరం అంతా  ఉపయోగించుకొనే వాళ్లం.

"ఇంటికి వస్తావు కదా! చెయ్యి చాపు" అన్నారు.

నా చేతిలో మూడు బుడగలు వుంచారు నీ పిల్లలక్కూడా అంటూ జేబులో ఎప్పుడూ బుడగలు వుంచుకోవడం ఆయనకు అలవాటు. సైకిల్ మీద వెళ్లేటప్పుడు దారిలో ఎవరైనా పిల్లలు కనిపిస్తే ఆగి ఒక బుడగ తీసి ఊది ఇచ్చేవారు. పిల్లలు సంతోషపడుతుంటే చూసి మురిసిపోతుంటారు. ఊళ్లో పిల్లలు ఆయన్ని బుడగల మావయ్య' అంటుంటారు.

"మావయ్య మరి నాకో? అంది అక్క

"సాయంత్రం ఇంటికి వచ్చినప్పుడు" నవ్వుతూ సైకిలెక్కి వెళ్లిపోయారు.

-----

"ఇన్నాళ్లకు ఇదెలా బయటకొచ్చింది పెదనాన్నా?"

భోజనాలయ్యాక వరండాలో పడక కుర్చీలో కూర్చున్నారాయన. పెదనాన్న, పిల్లలు ముగ్గురు, మరో పెదనాన్న కూతురు, అక్క, పిల్లలందరం ఆయన చుట్టూ చేరిపోయాం. అప్పుడే ఆయన నా చేతిలో పెట్టారు చిన్న డిక్షనరీని.

ఆప్యాయంగా చేతితో తడుముతూ మళ్లీ అడిగాను.

"ఇన్నేళ్లకు ఎలా బయటకొచ్చింది పెదనాన్నా?"

"మా చిన్నప్పుడు ఎవరో ఒక బంధువులాయాన ఈ డిక్షనరీ ఇచ్చారు. నాదంటే నాదని మీ నాన్న, నేనూ కొట్టుకున్నాం. ఒకరోజు మీ నాన్న దీనిమీద తన పేరు రాసేసుకున్నాడు నాకు చెప్పకుండా. కోపంతో పేరు చించేసి ఎక్కడో అటకమీద పాత పుస్తకాల్లో పారేశాను. చాలా రోజులు వెతుక్కున్నాడు. ఎక్కడోపోయిందని సరిపెట్టుకున్నాడు కానీ నన్ను అడగలేదు. నాలా వాడిది దుడుకు స్వభావం కాదు. ప్రతి పనీ ఆలోచించి చేసేవాడు అన్నింటికీ నేనే ముందు గొడవపడేవాణ్ణి చిన్నప్పుడు. తక్కువ మాట్లాడుతాడు కదూ! అత్తయ్యలిద్దరూ నా పక్షానే వుండేవారు. కానీ నాకంటే తక్కువ చదువుకున్నా, మంచి ఉద్యోగం తెచ్చుకున్నాడని అసూయ వుండేది నాకు. పెదనాన్న, కాస్త సరదా మనిషే కానీ ఇంత ఓపెన్ అవుతారని నాన్నని ఇలా మెచ్చుకుంటారని ఊహించలేదు. వృద్ధాప్యం. అనుభవం మనిషికి అహంకారాన్ని తగ్గిస్తుందేమో లేదా అన్ని అసూయాద్వేషాలకూ అంతం మరణమా? ఏదేమైనా ఎవరైనా 'నాన్న' పేరు తలుచుకున్నా కంట్లో నీళ్లు గిర్రున తిరుగుతాయి పుస్తకంలో పేజీ తిప్పి చూశాను. నాన్నపేరు సగం వుంది. మిగిలింది చినిగిపోయింది నాకది అపురూపమైన వస్తువు. గుండెలకు పొదువుకున్నాను.

"పెదనాన్నా చిన్నప్పుడు మీరు రాధను నెత్తిమీద నీళ్లకుండ అనేవారు కదా! గంభీరమైన వాతావరణాన్ని సరదాగా మార్చేస్తూ అంది అక్క. తర్వాత అందరం చిన్నప్పటి కబుర్లు చెప్పుకుంటూ సరదాగా గడిపేశాం. పెద్దమ్మ ఆడపిల్లలందరికీ పసుపూ కుంకుమ చీరతోపాటూ ఒక అందమైన ఇత్తడి గిన్నెను బహుమతిగా ఇచ్చింది..

"రథసప్తమికి పాలుపొంగించుకుంటారని తలొకటి కొన్నానే" అంటూ సంతోషంగా తీసుకున్నాను. అమ్మకు రథసప్తమి చాలా ఇష్టం. గుమ్మం ముందు భాగంలో తూర్పు వైపుకు ఆవు పిడకలతో పొయ్యి పేర్చి పొంగలి వండేది.

రేగిపళ్లు చిక్కుడు కాయలతో రథంచేసి, చిక్కుడాకులలో ప్రసాదం పెట్టి వ్రతం చేసి అందరికీ పంచేది. చిన్నప్పుడు స్కూలు నుంచి ఇంటికి రాగానే ఆ రథంతో ఆడుకునేదాన్ని సాయంత్రం వరహాల తాతయ్య ఇంటికి వెళుతూ దారిలో అడిగాను.

"అమ్మవాడే ఆ పాత ఇత్తడిగిన్నె ఎవరికి ఇచ్చింది?"

"అది నా దగ్గరే ఉంది. తీసుకెళుదువుగానిలే! నవ్వుతూ నా వైపు చూసింది అక్క.

-----

"అరె అదేమిటే ఇవన్నీ తీసుకెళ్తానన్నావుగా! ఏమైంది?"

ప్రోగుచేసుకున్న ఒక్కో సామానూ బ్యాగులోంచి బయటపెడుతుంటే అమ్మ కంగారుగా అక్కను పిలిచింది. ఆ సామాన్ల మధ్యలో చేతికి మెత్తగా తగిలింది ఎర్రని బుడగ "నా ఈ చిరునవ్వు మీ నాన్న నుంచీ నేర్చుకున్నానని తెలుసా?! "ఎలా మావయ్యా ఎప్పుడూ నవ్వుతూ హాయిగా ఉండగలుగుతారు?" అనే నా ప్రశ్నకు సమాధానంగా నన్నే తిరిగి ప్రశ్నించారు సైదులు మావయ్య.

"ఉమ్మడి కుటుంబంలో కలహాలతో కట్టుబట్టలతో బయటకు వచ్చేశాం నేనూ అత్తయ్య. ఏ ఆదరవూ లేదు. ఉండటానికి ఇల్లుకూడా ఎక్కడా దొరకలేదు. ఏమీ ఆలోచించలేదు మీ నాన్న మమ్మల్ని తీసుకెళ్లి తన ఇంట్లో పెట్టుకున్నాడు. అప్పటికి మీరింకా పుట్టలేదు. చిన్న అద్దె ఇల్లు గది, వంటిల్లు అంతే. ఎవరెవరినో అడిగి కాలేజీలో చిన్న ఉద్యోగం వేయించి కాస్త కుదురుకున్న తర్వాతే నన్ను విడిచిపెట్టేడు. ఇప్పటికీ ఆలోచించుకుంటాను. నేనైతే ఇలా చెయ్యగలనా? అని.

"మీ నాన్నంత మంచివాణ్ణి నేను కాదు రాధా!" సైదులు మావయ్య కళ్లల్లో అంతులేని కృతజ్ఞత నాన్నపట్ల.. "ఏమిటీ ఆ డిక్షనరీ కూడా వద్దా అదేం?" ఆదుర్దాగా అడుగుతోంది అమ్మ నేనా డిక్షనరీని బయటకు తీయడం చూసి. పెదనాన్న మాటలు చెవిలో గింగురుమంటున్నాయి.

"అక్క సంసారంలో ఇబ్బంది వచ్చి ఇంటికి వచ్చేసిందోసారి. నా అంతట నేను మీ నాన్నకు చెప్పలేదు. తెలుసుకున్నాడు. ఎప్పుడు వెళ్లాడో అత్తింటివారితో మాట్లాడి వచ్చాడు. వారం రోజుల్లో వచ్చి అక్కను తీసుకెళ్లారు. వాళ్ల తప్పు వాళ్లు తెలుసుకుని వచ్చారని అందరితో చెప్పాను కానీ మీ నాన్నవల్లే అని చెప్పలేదు. అంత ఇగో నాకు. అసలు ఈ విషయం ఎవరికీ చెప్పకపోవడం మీ నాన్న గొప్పదనం. పిల్ల కాపురం నీవల్లే బాగుపడిందిరా అని చేతులు పట్టుకుని చెప్పాలని వుంది. కానీ వాడులేడు. నన్ను నేను ఎప్పటికీ క్షమించుకోలేను" పెదనాన్న కళ్లల్లో సన్నటి నీటిపొర.

డిక్షనరీమీద పడిన నా కన్నీటిని పమిట కొంగుతో తుడిచి పక్కనుంచాను. ప్రయాణంలో దెబ్బతినకుండా బబుల్రాప్ చుట్టిన చిన్న కూజా బయటకు తీశాను. వరహాల తాతయ్య కళ్లల్లో మెదిలాడు. కాలం ఎంతటి భారాన్నైనా తగ్గిస్తుంది. తీరని జబ్బుతో కొడుకు మరణం, ఆ వైద్యంకోసం చేసిన ఊరంతా అప్పులూ వీటన్నిటినీ దాటి ఇప్పుడు మనవడి ప్రయోజకత్వం, విదేశంలో ఉద్యోగం ఆస్వాదిస్తున్నాడు తాత ఆ కళ్లల్లో ఎంత ఆనందం గర్వం. మరి నా కళ్లల్లో ఈ నీళ్లేమిటి?

మంచి ఇంజినీరింగ్ కాలేజీలో సీటు వచ్చినా మనవడని చేరడానికి డబ్బులేకపోతే ఊరంతా తిరిగి అప్పు పుట్టక ఇంటికి తీసుకొచ్చాడు తాత. నాన్నదీ చిరుద్యోగమే అక్క పెళ్లిచేసిన కొత్త. వరహాల తాత మనవడిని వెంట తీసుకెళ్లి ఎవరెవరో తెలిసినవాళ్లకి విషయం చెప్పి ఫీజు తగ్గించేలా చేసి, ఆ ఫీజును తాను ఎలాగోలా ఏర్పాటుచేసి ఆ పిల్లాడి బంగారు భవిష్యత్తుకు పునాది వేసిన నాన్నను. తలుచుకుంటే హృదయం గర్వంతో ఉప్పొంగదా!

"ఏమయ్యిందే? నాన్న గుర్తొచ్చారా?"

దగ్గరకొచ్చి భుజంమీద చెయ్యివేసింది అక్క

నా కళ్లు జలపాతాలే అయ్యాయి.

"ఎంత పొరపాటు పడ్డానక్కా.. జ్ఞాపకాలంటే వస్తువులని ప్రోగుచేసుకుని తీపిగుర్తులుగా దాచుకోవడం అనుకున్నానక్కా.. అప్పుడవి వస్తువులుగానే మిగిలిపోయి వుండేవి. కొన్నాళ్లకు కాలంతో కలిసిపోయి వుండేవి. కానీ నాన్న తనచుట్టూ వున్న చాలామంది జీవితాలకు వెలుగయ్యారు తాను వెళ్లిపోయినా ఒక చిరునవ్వుగానో, ఒక సలహాగానో, ఒక చిన్న భరోసాగానో లేక ఒక సహాయంగానో మిగిలి జీవితం అయ్యారు. ఆయనను ఒక జ్ఞాపకంగా ఇక్కడనుంచి తీసుకెళ్లాలనుకోవడం లేదు. కాస్తయినా ఆయనగా మారి వెళ్లాలనుకుంటున్నాను.

తలయెత్తి చూస్తే అక్కలో అదే ప్రశాంతమైన చిరునవ్వు నాన్నలా...





# “ మహిళా వారోత్సవ ప్రసంగ వ్యాసం ”

హేమ మాచెర్ల

సేవ సంస్థ నిర్వహించిన మహిళా వారోత్సవ సందర్భంగా ప్రసంగ వ్యాసం.

‘యత్రనార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతా’ అంటే ఎక్కడ స్త్రీలు పూజింపబడుతారో అక్కడ దేవతలు నివసిస్తారు.’ అని అంటారు కానీ, మనందరికీ తెలుసు వేల వేల ఏళ్ళుగా.

ప్రపంచ వ్యాప్తంగా, స్త్రీ ఎంత అణగదొక్కబడిందో, ఎంత అస్వతంత్రురాలో ఎంత నిరక్షరాస్యురాలో. అలాంటి స్థితిలో ఉన్న అబల ఈరోజు అందనంత ఎత్తుగా, అన్ని రంగాల్లో రాణిస్తూ సబలగా ఎదగడానికి, దోహదం చేసిన స్ఫూర్తిదాయకమయిన మహిళామణులు చాలా మంది ఉన్నారు. ఉదాహరణకు అలనాటి, పండిత రామాబాయి, కమలాదేవి ఛటోపాధ్యాయ, ఆనందీ గోపాల్ జోషి, ఇలాంటి మరెందర్నో ఈరోజు తల్చుకుంటూ సెలెబ్రేట్ చేసుకునే సుదినం కూడా.

ఇప్పటికి కొంత ప్రగతి సాధించగలిగినా ఇంకా సమాజంలో మార్పు రావాల్సి ఉంది. స్త్రీ తన హక్కులకోసం ఇంకా పోరాడాల్సింది కూడా చాలా ఉంది. %Hilary Clinton గౌరన్నట్టు, Let it be that human rights are women's rights, and women's rights are human rights once and for all. Let us not forget that among those rights are the right to speak freely, and the right to be heard.

తొలి తెలుగు స్త్రీవాద రచయిత్రి, భండారు అచ్చమాంబ గారు వ్రాసిన వాక్యం ఒకటి గుర్తొస్తూంది. “మానవ దేహమున కలంకారమయిన విద్యభూషణము స్త్రీలకు లేకుండ చేసి లోహపు నగలను మాత్రము పెట్టి తమ వేడుక నిమిత్తమయి వారిని తోలుబొమ్మల వలె జేయుచున్నారు.” ఆనాటికీ ఈనాటికీ కూడా ఆమె మాట ఎంత సత్యం. అది ఇప్పటికీ కొందరికి వర్తిస్తుంది కదా!

ఈమధ్యనే ఎవరో అన్నారు. We are moving to a very exciting time in history where the world now expects diversity, equity, and inclusion. అలాగే ఆశిస్తూ ముందుకు సాగుదాం.

ఈ సంధర్భంగా నా నవలలు, నవలల్లోని కథా నాయికల గురించి అడిగారు కాబట్టి, ముందుగా, నా మొదటి ఇంగ్లీష్ నవల Breeze from the river Manjeera గురించి చెప్పేముందు, Virginia Wolf గారి ఒక వాఖ్యం, Swimming against the current, women have had to speak louder to get their voices heard.

ఈ కథకు స్ఫూర్తి ఒక అమ్మాయి నిజ జీవితం. ఈ నవల కథాకాలం 1985. నవలా నాయిక, నీల. ఇండియాలో ఒక అమాయకమయిన పల్లెటూరి అమ్మాయి. ఒక బ్రిటిషేషియన్ అబ్బాయిని పెళ్ళిచేసుకుని, ఎన్నో ఆశలతో లండన్ లో తన అత్తగారి ఉమ్మడి కుటుంబం లో అడుగుబెడుతుంది. కానీ మరుక్షణంలోనే తన ఆశలన్నీ అడియాసలే అని, భర్తకు తన అవసరం లేదని, అతని కుటుంబానికి తను ఒక పనిమనిషని తెలిసిపోతుంది. ఒక సాధారణ అమ్మాయి అసాధారణమైన క్లిష్ట పరిస్థితుల్లో ఇరుక్కుని, మానసికంగా, శారీరకంగా హింసాత్మక పరిస్థితులను, ఒడిదుడుకులను ఎలా ఎదుర్కొని, భాష రాని పరాయి దేశంలో, ఒక ఉద్యోగం సంపాదించుకుని తన కాళ్ళమీద తను నిలబడి, ఆ బంధీఖానా నుండి ఎలా బయటపడి స్వతంత్రంగా జీవించగలిగిందనేదే ఇతివృత్తం.

అలాంటి పరిస్తితుల్లో ఉన్న ఏ అమ్మాయి అయినా, భయం వదిలేసి, తనకంటూ ఒక చిన్న ఆర్థిక సదుపాయం సంపాదించుకోగలిగితే, సంకెళ్ళు తెంచుకుని స్వతంత్రంగా జీవించగలదని నిరూపించే పాత్ర నీల. ఇది పబ్లిష్ అయినతర్వాత, మా పబ్లిషర్స్ కి. నాకు వచ్చిన రీడర్స్ లెటర్స్ నాకొచ్చిన అన్ని అవార్డ్స్ కన్నా ఎక్కువ సంతోషాన్ని, సంతృప్తిని కలిగించాయి. వాటిల్లో ముఖ్యంగా, ఈ పుస్తకం చదివినందువల్ల ధైర్యం వచ్చిందని, అనూహ్యమయిన వారి పరిస్తితి నుండి బయటికి వచ్చి వారి కాళ్ళమీద వారు నిలబడ్డామని, ఓ ఇద్దరు అమ్మాయిలు రాసినవి మాత్రం ఇప్పటికీ గుర్తుంటాయి.

రెండో నవల Blue Eyes - Historic fiction. కథాకాలం 1920’s, బ్రిటిష్ ఇండియా.. దీనికి స్ఫూర్తి, చిన్నప్పుడు మా తాతమ్మ గారు చెప్పిన స్వతంత్ర యోధుల కథలే.

కథ రాజస్తాన్‌లో మొదలయి, సౌత్ ఇండియాలో సమాప్తమవుతుంది. ఒకవేపు గాంధీగారి అహింసా సిద్ధాంతం, మరొకవేపు ఆంగ్లేయుల నిరంకుశత్వం. ఒకవేపు మూఢనమ్మకాలు మరోవేపు ఆచారవ్యవహారాలు, కఠిన నిబంధనలు. వీటన్నిటి మధ్యా నలిగిన అప్పటి యువత.

తారుమారైన వారి జీవితాలు. అలాగే బ్రిటిష్ వారి జీవితాలు, నూతన వధువులుగా ఇండియాకు వచ్చిన బ్రిటిష్ అమ్మాయిల మనోగతాలు. ఇదొక హిస్టారిక్ ఫిక్షన్ అనొచ్చు.

కథా నాయిక, తల్లి లేని అంజలి. సవితి తల్లి ప్రోద్భలంతో పదేళ్ళ వయసులో, 40 ఏళ్ళ రంజిత్ కి రెండో భార్య అవుతుంది. ఆమెకి పద్దెనిమిదేళ్ళ వయసు రాగానే రంజిత్ చనిపోతాడు. అయితే అతని మొదటి భార్యకు పిల్లలు ఉన్నారు కాబట్టి, ఆమెని వదిలేసి పిల్లలు లేని అంజలిని సతీసహగమనానికి రెడీ చేస్తారు. అలాంటి భయంకరమయిన పరిస్థితి నుండి ఆమె ఎలా తప్పించుకుని, స్వతంత్ర పోరాటపు గందరగోళాల్లో, అల్లర్లలో ఇరుక్కుని కూడా ఒంటరిగా ప్రయాణం చేసి, I alone cannot change the world. But I can cast a stone across the waters to create many ripples అని మదర్ థెరెసాగారన్నాట్టు. నిమ్మకు నీరెత్తినట్టు కూర్చోకుండా, ఈ సమాజంలో ఒక రాయి విసర గలిగితే కానీ రాదు చలనం అంటూ, ఒక బ్రిటిష్ ఇంజినీర్ మిస్టర్ రాబర్ట్ సహాయంతో, మిసెస్ విల్సన్ అనే ఆంగ్ల వనిత అనాధ స్త్రీలకోసం స్థాపించిన సెయింట్ ఆగ్నెస్ విమెన్స్ హోరీంలో టీచర్ గా చేరి వారికి విద్య నేర్పుతూ తనలాంటి పరిస్థుల్లోనే ఉన్న మరికొంతమంది అమ్మాయిలకు, స్త్రీలకు చేయూతనిచ్చి, మనస్తాపం కలిగించే మూఢ నమ్మకాలను, ఆచారవ్యవహారాలను త్యజిస్తే తప్పు లేదు అని స్ఫూర్తినిచ్చి, బయటకు తీసుకొచ్చి, స్త్రీ తల్చుకుంటే చేయలేనిది లేదు అని నిరూపిస్తుంది.

మూడో నవల Letters in the Sand. కథాకాలం 1970s. ఈ కథ కు స్ఫూర్తి, నాకు తెలిసిన ఒక అమ్మాయి. అంతే కాక ఆకాలం నాటి సామాజిక స్థితిగతులు, ప్రైం మినిస్టర్ ఇందిరాగాంధీ గారి పాలనలో రాజకీయ చదరంగాలు మరియు నక్సలైట్ దాడులు, వాటికి కారణాలు. వీటన్నిటి మధ్యా, కథానాయిక కిరణ్మయి. అందరూ కిరి అని పిలుస్తుంటారు. అయితే కిరి గురించి చెప్పేముందు, నోబుల్ బహుమతి గ్రహీత 'మలాల' చెప్పిన ఒక వాక్యం, I am those 66 million girls who are deprived of education. And today I am not raising my voice, it is the voice of those 66 million girls అన్నట్టు, పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ లోనే కాదు, 1970 లలో ఆంధ్రప్రదేశ్ లో కూడా కొందరు ఆడపిల్లలను స్కూల్ కి పంపలేదన్నది అక్షరాలా నిజం. కిరికి మాత్రం అందరు పిల్లల్లాగా, తన అన్న రాజీవ్ లాగా తనూ బడికి వెళ్ళి చదువుకోవాలని ఉన్నా, మూఢాచారాలు, మూఢనమ్మకాలు పాటించే ఆమె కుటుంబం ఆడపిల్ల అని ఆంక్షలు పెట్టి స్కూల్ కి పంపకుండా ఘోషా పద్ధతుల్లో పెంచుతారు. తండ్రి, నాయనమ్మ, భర్తను ఒదిలేసిన మేనత్త చండశాసనులు ఆ ఇంట్లో. ఆమె తల్లి సుజాతకి కూడా కూతురు చదువుకోవడం లేదని బాధ. భర్త నిరంకుశత్వాన్ని ఏవగించుకున్నా, ఇంట్లో తనమాట చెల్లదు కాబట్టి ఏంచేయలేని పరిస్థితి. చాటుగా తన కూతురికి చదవడం వ్రాయడం మాత్రం నేర్పగలుగుతుంది. చివరికి ఒక భయంకర సంఘటన ద్వారా ఆమెలో తెగింపు కలిగి, అబలగా ఉన్న సుజాత సబలగా మారి, ఎదిరించి పోరాడి కిరి తనకు నచ్చినట్లుగా జీవితాన్ని మలుచుకోడానికి ప్రోత్సహిస్తుంది. కథానాయిక కిరి అయినా, అప్పటివరకూ తన మంచితనాన్ని, అణకువను బలహీనతగా భావించే తన భర్తకు, తనలో ఉన్న ఏమిటో చూపించే పాత్ర సుజాత.

హేమ మాచెర్ల

(తెలుగు, ఆంగ్ల కథానవలా రచయిత్రి)





# “ జ్వరం ”

డాక్టర్ వివేకానంద మూర్తి

భూమికి పాతికేళ్ళు పాతబడిపోయిన పరమహంసకి జీవితంలో మొదటిసారిగా జ్వరం వచ్చింది. జ్వరానికి, పరమహంసకి మధ్యన ఉన్న సంబంధం అయస్కాంతం యొక్క నార్త్పుల్నీ, సౌత్పుల్నీ గుర్తుకు తెస్తుంది. చీకటికీ, దొంగలకీ, దెయ్యాలకీ, ప్రాణం మీదికొచ్చే ప్రమాదాలకీ చివరికి భార్య మాటకి కూడా భయపడని పరమహంస జ్వరానికి భయపడతాడని తెలిస్తే నవ్వు వస్తుంది. చంటిపిల్లలు బూచాడు ఎత్తుకుపోవడం గురించి, పెద్దవాళ్లు ప్రమాదాల గురించి, రాజకీయ నాయకులు నిజం గురించి భయం భయంగా ఆలోచించినట్టు జ్వరాన్ని గురించి భయంగా ఆలోచిస్తాడు పరమహంస.

అతని తాతగారు జ్వరం వచ్చి పోయారు. తండ్రి మలేరియాతోనూ, తల్లి న్యుమోనియాతోనూ పోయారు. బామ్మ బోదకాలు జ్వరంతో పోయింది. వాళ్ళింట్లో ఎవరేనా 'జ్వరం' అన్న మాట తలిస్తే చాలు సాయంత్రానికల్లా ఎవరికో ఒకరికి వచ్చేసేది. అతను జరీ అంచు కండువాను కండువా అంటాడు. తన మిత్రుడు జగన్నాధాన్ని 'ఒరేయ్' అనే పిలుస్తాడు. జనతా హోటల్లో కాఫీ తాగాడు.

పరమహంస జ్వరాన్ని చావుతో పోల్చుకుంటాడు. తనకే కాదు, తన చుట్టు ప్రక్కల ప్రాణికోటిలో ఎవరికి జ్వరం వచ్చినా, చావు తన కోసం వచ్చినట్టు, తన చుట్టూ తిరుగుతూ హైరాన పెడుతున్నట్టు ఫీలవుతాడు.

పెళ్ళయిన కొత్తలో తన భార్య సుశీలకి జ్వరం వచ్చినప్పుడు అతను బెంబేలు పడిపోయాడు. అంతేకాదు – మనస్సుని లోతు చేసుకుని భవిష్యాన్ని ఆలోచించాడు. అప్పుడతని మనస్సులో – సుశీల అమాయకత, పెళ్లాం పోయిన భక్తవత్సలం రెండవ పెళ్ళి – ఇవన్నీ చేరి గొడవ చేశాయి. మనస్సుని వికలం చేశాయి. డాక్టర్ సీతాపతిని తీసుకువచ్చి భార్యకు మందు యిప్పించాడు. డాక్టరు ముందు డీలా పడిపోయాడు. పెళ్ళాం జ్వరం తగ్గేవరకూ పరమహంస డబ్బున్న వాళ్ళ పెంపుడుకుక్క యజమానులు వెనకే తిరిగినట్టు, డాక్టరు సీతాపతి వెనకే తిరిగాడు. భార్య జ్వరం తగ్గింతర్వాత పాత ఆలోచనలు జ్ఞాపకం వచ్చి కాస్సేపటి వరకూ తన్ను తాను తిట్టుకున్నాడు. కాస్సేపయిం తర్వాత అతని మనస్సుకి యెంతో రిలీఫ్ కనిపించింది.

నిజంగా – భార్యకి జ్వరం తగ్గిపోగానే పరమహంస – స్వీటు సంపాదించిన పావలా, అర్ధరాత్రి అరణ్యంలో అనుకోకుండా అందమైన అమ్మాయి కోరికతో తన్ను కోరి వచ్చినప్పటి మగాడిలా, నెలాఖరున నెల జీతంలో సగం లంచం సంపాదించిన తాలుకాఫీసు గుమాస్తాలా – సంబరపడిపోయాడు.

ఇప్పుడు భార్య పక్కన లేదు. తొలికాన్పుకి పుట్టింటికి పంపించాడు. పక్కన భార్య లేనప్పుడు వచ్చినందుకు జ్వరాన్ని తిట్టుకున్నాడు హంస. కారణం–జ్వరం వచ్చినప్పుడు భార్య పక్కన ఉండి సపర్యలు చేస్తుంటే, 'జ్వరం' బాగుండకపోయినా 'జ్వరం రావడం' బాగుంటుంది – అని భార్య బ్రతికి ఉన్నప్పటి భక్తవత్సలం చెప్పిన జ్ఞాపకం. డాక్టర్ సీతాపతికి ఫోన్చేసి వచ్చి పడకకుర్చీలో మేను వాల్చాడు, హంస.

అరగంటయింది.

సీతాపతి ఇంకా రాలేదు. స్నానంచేసి వస్తానన్నాడు. ఇంతసేపా? మగాడి స్నానానికి, ఆడదాని కోపానికి ఆలస్యం బాగుండదు. సాయంత్రం ఆరున్నర దాటింది.

ఆకాశాన్ని నల్లటి మేఘాలు, పిడిరాయిలాంటి వ్యక్తిని జ్వరంలా ఆవరిస్తున్నాయి. చీకటి టెంపరేచరూ పెరుగుతోంది. నక్షత్రాలన్నీ వెలేసినట్టు ఆకాశంలో ఓమూలగా ఉన్నాడు చంద్రుడు. మరీ సన్నం గాకుండా, మరీ గుండ్రంగా కాకుండా నార్మల్ గా ఉన్నాడు. ఇంటిముందు కారిడార్ ఈజీఛైర్ పరమహంస వొళ్ళు వేడిగా వుంది.

ఎందుకో పరమహంసకి ఆకాశాన్ని చూసేసరికి మనస్సులో ఆలోచనలు బయులుదేరతాయి. దానికి కారణం ఏవిటా? అని గతంలో హంస ఒకరోజు సాయంత్రం ఆకాశం కేసి చూసి ఆలోచించాడు గాని అంతు పట్టలేదు.

రెండింటికి ముందువున్న 'ఆ'లో తప్ప, ఆలోచనలకీ ఆకాశానికీ వున్న సంబంధం ఏవిటో అతను తెలుసుకోలేకపోయాడు.

రోడ్డు మీద హారన్ మోగింది. డాక్టర్ కోసం గేటు వైపు చూశాడు. రాలేదు. అతను మొదట్నించి అంతే నెమ్మది.

సీతాపతి ఆర్ట్స్ కాలేజీలో తన క్లాస్మేట్. మనిషిలో నిదానం, ఓర్పు, శ్రద్ధ యెక్కువ. చలాకీతనం లేదని అప్పుడు అందరూ అతన్ని 'మబ్బు' అని పిలిచేవారు. అలాగని అతను 'మఫ్ ' కాదు. ఎంతో తెలివైనవాడు.

అప్పట్లో అతని మంచితనం, తెలివిచూసి అతన్ని ప్రేమించిన 'కవిత' అనే అమ్మాయి కోరి వస్తే 'ప్రేమించడానికి నాకేం అభ్యంతరం లేదు గానీ, నాకు టైము లేదు. చదువుకోవాలి' అని చెప్పి పంపేశాడు. ఇది అతని మంచితనానికి కొలబద్దో, లేక అతని అమాయికతకి నిదర్శనమో తెలియదు. అందుకే తను ఆకాశాన్ని చూసి సీతాపతిని తల్చుకొన్నప్పుడల్లా ఆలోచనకి బదులుగా నవ్వు వస్తుంది హంసకి.

తనకి సీతాపతితో పెద్ద స్నేహమేమీ లేదు హలో అంటే హలో అనుకోడం తప్పిస్తే భార్యకి జ్వరం వచ్చినప్పట్నించీ కొంచెం దగ్గరితనం ఏర్పడింది. పనిలో చుఱుకు పాలు తక్కువగా ఉండటం, తనకు తెలిసిన సీతాపతికి తనకు తెలియకుండా పెళ్ళవటం ఇవన్నీ హంసతో అతనికి ఎఎక్కువ స్నేహం లేకపోడానికి నిదర్శనాలు. పతికి పెళ్లయిందని విన్నప్పుడు హంస ఇంత మందకొడిని పెళ్ళి చేసుకోవడానికి సిద్ధపడిన ఆమె అమాయకురాలు అని మనస్సులో జాలిపడ్డాడు. అది 'ప్రేమ పెళ్ళి' అని విని నవ్వుకున్నాడు. ఆశ్చర్యపడ్డాడు. కారణం సీతాపతికి అసలు ఆమె యెవరో తెలియదుట. ఆమెగా ఆమె వెతుక్కుంటూ వచ్చి ప్రేమించానని చెప్పి, పెళ్ళి చేసుకోమని అడిగిందని కూడా తను విన్నాడు.

పరమహంసకి పాత రోజులు స్ఫురణకొచ్చాయి. నాలుగేళ్ళ తర్వాత 'కవిత' తలపుకు వచ్చింది. అవును, తన్ను నిరాకరించిన 'కవిత'. తనుగా తను వెళ్ళి ప్రేమించానని, పెళ్ళిచేసుకోమని, అమాయకంగా ఆశగా అడిగినప్పుడు తన్ను కాదన్న 'కవిత', తను ఎందుకూ కొరగాకుండా పోయాడు? తను అందంగా ఉంటాడా? తను తనలాగే వున్నా కొంచెం రాకాహడ్సన్ కూడా ఉన్నాడని అప్పట్లో తన్ను ప్రేమించి వచ్చి తనచే నిరాకరింపబడ్డ, అందంగా లేని ఆడ ఇంగ్లీషు లెక్చరర్ ఓసారి అంది. ఆవిడంటే యిష్టం లేకపోయినా, ఆవిడ మాటంటే అతనికి పెద్ద గురి. తను చాలా శుభ్రంగా ఉంటాడన్నందుకు సాక్ష్యంగా వారానికి ఆరుజతల ఇస్త్రీ బట్టలు వాడతాడు. మూడు జతల కర్చీఫ్ లు వాడతాడు. రోజుకి రెండుసార్లు సింథాల్ సబ్బుతో స్నానం చేస్తాడు. రోజూ గడ్డం గీస్తాడు. తనెందులోనూ తీసిపోడు. తన తక్కువతనం విదితమైంది. అప్పటి ఒక్క సంఘటనలో, తన అయోగ్యత, చేతకానితనం జ్ఞప్తికొచ్చి బాధపడ్డాడు. సీతాపతి ఎవరో తనకు తెలిసి ఉండకపోతే ఈ బాధ ఉండేది కాదేమో. నాలుగేళ్ళ క్రితం మనస్సులో రేగి మనస్సులో అణిగిపోయిన కోపం, కోరిక, ఆశ పరమహంస జ్వరాన్ని ఒక డిగ్రీ పెంచాయి.

విచిత్రం

తను కోరిన స్త్రీ తన్ను నిరాకరించింది. సీతాపతిని స్త్రీ కోరి వచ్చి వరించింది. హుషారైన హంస కోరిక, ప్రేమ చేతిలో ఓడిపోయింది. కోరికలేని 'మబ్బు' సీతాపతిని ప్రేమ కోరి వచ్చింది.

మెడ నొప్పిగా వుంది. మెడ విరుచుకోడానికి తల అటూ ఇటూ తిప్పాడు. ఆకాశంలో నక్షత్రాలూ, థెర్మామీటరులోని పాదరసం మెరుపులా మెరిశాయి. గేటుదగ్గర కారాగింది.

డాక్టర్ సీతాపతి కుడిచేతిలో స్టెత్, ఎడం చేతిలో మెడికల్ చెస్ట్, తలమీద అణిచి దువ్విన జుట్టు, – నల్లపాంటుతో, తెల్లటి షర్టుతో, నెమ్మదిగా, మౌనంగా డాక్టర్ సీతాపతి, మెల్లగా గేటు తెరుచుకుని, భూమి నొచ్చుకుంటుం దేమో అన్నట్టు అడుగులు వేస్తూ వచ్చాడు.

"గుడ్ ఈవినింగ్!" మోతాదుగా నవ్వాడు. "హలో–గుడ్ ఈవినింగ్! ప్లీజ్ బి సీటెడ్" పేము కుర్చీచూపాడు పరమహంస.

మెడికల్ చెస్ట్ టీపాయ్ మీద పెట్టి సీతాపతి కూర్చున్నాడు. "ఎప్పుడు వచ్చింది జ్వరం!" నాడి పరీక్షిస్తూ అడిగాడు. "సాయంత్రం"

ఎన్ని డిగ్రీలుంది?"

"ఎన్నేవిటీ? నూటమూడు. చావుకి మూడో నాలుగు డిగ్రీల దూరం.". అతను చిరునవ్వు నవ్వాడు. క్రింది కనురెప్పలు లాగి చూశాడు. నాలిక చూశాడు. జలుబుగా వుందా? దగ్గొస్తోందా? కీళ్ళు నొప్పులున్నాయా? అంటూ అడిగాడు. అన్నిటికి ఉంది, వస్తోంది, ఉన్నాయి అని, జవాబు లిచ్చాడతను.

"మరేం భయపడకండి. తగ్గిపోతుంది. ఈ టాబ్లెట్స్ వాడండి. ప్రతి ఆరుగంటలకీ రెండు చొప్పున మంచి నీళ్ళతో వేసుకోండి. కాఫీ తప్ప మరేం తీసుకోవద్దు."

పరమహంస కంగారు చూసి సీతాపతి మోతాదు మించి నవ్వాడు. "ఇందులో కంగారుపడాల్సిన అవసరం లేదు హంసా? బైట కూర్చోకుండా లోపలికి వెళ్ళి హాయిగా విశ్రాంతి తీసుకోండి. నేను మళ్ళీ రేపు ఉదయం వస్తాను. గుడ్ నైట్."

సీతాపతి లేక పరమహంస పాలిటి దేవుడు – వచ్చి వెళ్ళిపోయాడు. వాళ్ళావిడ జ్వరం తగ్గినప్పటి నిండుతనం పుంజుకుంది మనస్సు. లోపలికి వెళ్ళి టాబ్లెట్స్ మింగి, వంటవాడిచేత వేడి కాఫీ చేయించుకు త్రాగి పక్కమీద నడుం వాల్చాడు హంస.

వొళ్ళంతా వేడిగా వుంది. మండుతున్న గాడిపొయ్యి మీద మంచం వాల్చుకు పడుకున్నట్టుంది. వేడికోరికలు, పెళ్ళయిన కొత్తలో వేడిరాత్రులు జ్ఞాపకం వచ్చి, బుర్ర ఆలోచనల్లో వేడెక్కిపోయింది. వాతావరణం అంతా వేడిగా వుంది, జ్వరం తగ్గించమని దేవుణ్ని వేడుకున్నాడు. ఓ గంటసేపు అలా˘ దేవుణ్ని వేడి వేడి వేడి కళ్ళు మూసుకుని వేడిజ్వరం సందిట్లో వేడిగా నిద్రపోయాడు వేడి

పరమహంస.

రేపు వచ్చింది. పరమహంసకి మెలుకువొచ్చింది. పక్కమీది నుండి లేచాడు. నీరసంగా వుంది. వాళ్ళు తూలింది. కాలకృత్యాలు తీర్చుకున్నాడు. స్నానం మాత్రం చేయలేదు.

హాల్లో పడకకుర్చీలో కూర్చుని పొద్దుటి పేపరు చదువుతుండగా సీతాపతి వచ్చాడు.

"గుడ్ మార్నింగ్."

"గుడ్మార్నింగ్! రండి కూర్చోండి."

"ఎలా వుంది?" పరీక్ష చేశాడు. టెంపరేచరు చూశాడు. నూరు ఉంది.

"ఫరవాలేదు. తగ్గిపోతుంది రేపటికి. నిన్నటికిలాగే ఈ రోజు కూడా టేబ్లెట్స్ వేసుకోండి. అటూ ఇటూ తిరగవద్దు." వంటవాడు కాఫీలు తెచ్చాడు. కాఫీలు ముగించి కాస్సేపు ఇతర విషయాలు మాట్లాడుకున్నారు. సీతాపతి మళ్ళా మర్నాడు వస్తానని చెప్పి వెళ్ళిపోయాడు.

మూడోరోజుకి టెంపరేచర్ చేసింది. అతని నొళ్ళంతా సంతోషం అంటుజ్వరంలా పాకిపోయింది. ఎందుకో సీతాపతి రాలేదు ఆరోజు, నాలుగో రోజుకల్లా పరమహంస మామూలు మనిషై పోయాడు. ఖైదు నుంచి తప్పించుకున్న దొంగలా, సంజరంలోంచి బైటపడ్డ హంసలా 'రిలీఫ్ ఫీలయ్యి - ఇక భార్యకేం 'మొగుడు నష్టం' లేదు. సుశీల వచ్చిం తర్వాత ఇలా జ్వరం వచ్చి తగ్గిన సంగతి చెప్పకూడదు. సీతాపతి యింటికి వెళ్లాలి. తన కృతజ్ఞత చెప్పాలి. బిల్లు మొత్తం చెల్లించాలి. నిజంగా సీతాపతి దేవుడు - ఇదీ అతని మనస్సు.

స్నానం చేసి, లాల్చీ, పైజామా ధరించి గోల్డ్ ఫ్లేక్ సిగరెట్టు ముట్టించి, స్కూటరు ఎక్కి సీతాపతి యింటివేపుగా దారితీశాడు జ్వరం తగ్గిన హంస మనస్సు ఆనందంతో గంతులు వేస్తోంది.

-----

అదేవిటి?

సీతాపతి యింటిముందు అన్ని కార్లు ఉన్నాయేం?

పోర్టికోదాటి లోపలికి వెళ్ళాడు. వాకిటినిండా జనం. ఊళ్ళో పెద్ద డాక్టర్లూ, పెద్ద మనుషులూ, పెద్ద పెద్ద జ్వరాలు వచ్చి తగ్గినవాళ్ళ విషణ్ణతని తోడు చేసుకుని తచ్చాడుతున్నారు.

పరమహంసకి ' ఆయుర్వేద భిషగ్వర యగ్గెన్నగారు ఎదురు వచ్చారు.

"ఒరేయ్ పరమం! అయిపోయిందిరా! సీతాపతి యిక లేదు. విషజ్వరం వచ్చి కొట్టేసింది. అంతా అయిపోయింది. " కండువాతో కళ్ళొత్తుకున్నారు జీవితంలో జ్వరం అంటే ఎరుగని యగ్గెన్నగారు.

అందరూ మాట్లాడుకుంటున్నారు.

"హీ పజేస్ ఇన్టెలిజంట్ డాక్టరండీ. పూర్ ఫెలో!"

"ఏం చేస్తాం. అంతా విధికృతం."

'రియల్లీ, అవర్ సిటీ హేజ్ లాస్ట్ ఎ గుడ్ డాక్టర్. "

'కమాన్ లెటజ్ హేవ్ ఎ కండోలెన్స్ మీటింగ్"

పరమహంస వెదికాడు - సీతాపతి కోసం. అరగంటయింది తీసుకుపోయి.

ఒక్కక్షణం కళ్ళు తిరిగాయి హంసకి

విచిత్రం! పాములవాణ్ణి పాము కాటేసింది. మాంత్రికుడ్ని మంత్రం దహించి వేసింది."

పాపం! పాపం!

డాక్టర్కి జ్వరం వచ్చింది. ఆరోగ్యానికి జ్వరం వచ్చింది. సీతాపతి బ్రతుకుని జ్వరం మింగేసింది. మబ్బు విడిపోయింది. తను రోజూ చూసే ఆకాశంలాగ. సీతాపతి మెళ్లో అస్తమానం కనబడే స్టెతస్కోపులాగ, మెడికల్ చెస్ట, థెర్మామీటరు లాగ, మందుల్లాగ, జ్వరాల్లాగ సీతాపతి కూడా ఎప్పుడూ ఉండిపోతాడనుకున్నాడు హంస. ఉండిపోవాలనుకున్నాడు హంస. అమాయకుడైన 'మబ్బు' సీతాపతి రేపట్నించి కనిపించడు.

హాలుకి అనుకుని ఉన్న గదిలో మూలగా పేముకుర్చీలో ముడుచుకుని, జ్వరం వచ్చి తగ్గి పథ్యానికి సిద్ధమయిన రోగిలా, కూర్చుని చేతుల మధ్య తల దూర్చి హృదయం బ్రద్దలయ్యేలా ఏడుస్తోంది. సీతాపతి భార్య.

దగ్గరగా వెళ్ళాడు. అతనికి ఎలా మాట్లాడాలో తెలియడం లేదు.

"విచారించకండి. అయిందేదో అయిపోయింది. నిజంగా సీతాపతి పోయినమాట విన్న తర్వాత గుండె పగిలింది."

ఆమె తలెత్తి చూసింది. ఆమె "కవిత', తన్ను కాదన్న 'కవిత', 'మబ్బు' సీతాపతిని ప్రేమించి పెళ్ళి చేసుకున్న 'కవిత', హంస మనస్సు రెపరెపలాడి, ఒక్క క్షణం కళ్ళు తిరిగాయి. మనస్సులో మహారణ్యం తగులబడినట్టుంది.

"ఏమైనా నేను మళ్ళీ పెళ్ళి చేసుకోదల్చుకోలేదు హంసా! దయచేసి వెళ్ళిపోండి."

ఏడిచే కళ్ళూ, వణికే పెదాలూ - మళ్ళీ పాత 'కవిత'.

ఉన్నట్టుండి నూటయిదు డిగ్రీల టెంపరేచరుతో జ్వరం వచ్చినట్టయింది హంసకి.

పరమహంస వెనక్కి తిరిగారు.

## " సోయగం "

వింజమూరి రాగసుధ



గిరి తాకెడి ధూమికందము, చరిలో నదిపాయలందము
కరినీరద ధారలందము, ఝరి రువ్వేటి చిత్తడందము
ఇరి కొమ్మున పికములందము, చిరి పలుకుల రవములందము
పురి చాపిన  మరుకమందము, దరి చేరిన హరిణమందము
విరి మోవిన కణికలందము, తిరి తనరున మెలికలందము
సరిలో మణికాంతులందము, సిరిమువ్వల నాదమందము
సురి నడకన సొబగులందము, హరుస్థొరుల గతులు అందము
తరి వెంబడి పయనమందము, మురి సల్పెడి కవనమందము

## " నీకిదే మా స్వాగతం "

సీహెచ్. హరిప్రియ

పసుపు రాసిన పచ్చని గడపలు
కళ్ళాపి చల్లిన రంగవల్లుల వాకిళ్లు
మామిడి ఆకుల తోరణాలతో
ఎదురు చూస్తున్నాం !
ఏదీ నీ జాడ   !

నీలి నీడలకు ఓదార్పు లేపనంతో కాపడాలు పెడుతూ
రాలిన ఆకుల శిశిరం
నవ వసంతానికి పలుకుతోంది స్వాగతం !

వేపమ్మ శానిటైజరై  నక్షత్ర సుమాలతో పుడమి తల్లికి చేస్తోంది అర్చన
గున్నమామిడి తోపుల లేచిగుర్లను గ్రోలిన కోయిల
చేదు గతాలను మరిచి నవ్య గీతాలను ఆలపించమని
మధువులూరు గానంతో గొంతు సవరించుకుంటుంది
చేదు గతాలనుమరచి
ఆత్మవిశ్వాసపు   వెలుగులను దోసిలిలో నింపుకోమంటుంది

వేపమ్మ నక్షత్ర సుమాలతో అర్చన చేస్తోంది పుడమికి
మామిడి తోపుల లేచిగుర్లను గ్రోలిన కోయిల చిగురించిన ఆశల
ఎదవీణ పై ఆమని రాగాల ఆలపిస్తోంది !...
శుకపికముల  గాన కచేరీల సందళ్లు

నవ శకానికి ఆరంభం  !
సృష్టికర్త బ్రహ్మ సృష్టిని ఆరంభించిన శుభదినం
నిరాశలను ఆశలమేనాలో ఎక్కించి
వర్తమానంలో సంచరిస్తూ
గత కాలపు వైఫల్యాలకు భవిష్య త్ ప్రణాళికలు వేస్తూ....

కష్టాల సుడిగుండాలున్నా ! వేధించే సమస్యలున్నా !
ఎదురీదే ధైర్య  మిచ్చి,
వ్యయం  పెరిగినా ధరలను అదుపులో ఉంచి,
రాజ్య పూజ్యం లేకున్నా అవమానం ఉండకుండా ....
కోరే వరాల చిట్టాను చూసి కినుక వహించకుమా !
శోభక్రుత్ నామ వత్సరమా.!

షడ్రుచులసమ్మేళన సారమే జీవితమనే ధర్మసూత్రాన్ని తెలియజేసే
యుగాది
యుగస్య ఆది యుగాది

కొత్త ఆశల పందిళ్లకు
పూతమివ్వమని ప్రతి లోగిలి వేచి చూస్తోంది నీ రాకకై...

నవ వసంతమా నవ్య రాగదీప్తుల మా జీవితాల నింపు శుభకృత్
నామ సంవత్సరమా !

గ్రహ స్థితిగతులను తెలుసుకొని ఊరటకై శాంతి మంత్రాలు
పఠించి భవిష్యత్ ప్రణాళికలకు స్కెచ్ వేసుకొని

స్వాగతం పలుకుతున్నాం ! శోభకృత్ నామ సంవత్సరమా నీకు
ఇదే మా స్వాగతం !

# " తల్లిదండ్రుల సాయంత్రం "

సూర్యకాంతం

స్కూల్లో మా అబ్బాయి ఆఖరి సంవత్సరం కావడంతో, నేను మావారు ఇద్దరం కలసి, ఉపాధ్యాయుల తో సమావేశానికి వెళ్ళడానికి నిశ్చయించుకున్నాము.

కానీ, ఆఖరి నిముషంలో, మావారికి పని వత్తిడి ఎక్కువ అయితే, నేను మాత్రమే బయలుదేరాను.

మా అబ్బాయి నాకు ముందురోజే సూచనలిచ్చేసాడు, ' ఇవీ, నాకు వచ్చిన గ్రేడ్స్. నువ్వు అక్కడికి వచ్చి ఆశ్చర్యపోవక్కర్లేదు, నన్ను ఇబ్బంది పెట్టే మాటలేవీ మాట్లాడక్కర్లేదు'. అని.

దానికి నేనెందుకురా రావడం అని మనసులో అనుకుని, హాజరు వేసుకోవాలి కదా అనుకుని బయలుదేరాను. దారిలో ఎన్నో ఆలోచనలు, మళ్ళీ ఇలాంటి సందర్భంలో స్కూల్ కి వెళ్లాల్సిన అవసరం ఉండదు కదా అన్న భావోద్వేగంలో, కారు ముందుకు వెళ్తుంటే, నా ఆలోచనలు వెనక్కి మళ్ళాయి.

వాడు ప్రైమరీ స్కూల్‌లో ఉండగా, టీచర్‌లతో ఇటువంటి సాయంత్రాలతో సరిపోల్చకుండా ఉండలేక పోయాను.

అప్పట్లో, వాడి స్నేహితుల తల్లి తండ్రుల తో మేమూ ఎంతో స్నేహంగా ఉండేవాళ్ళం.

ఇలాంటి మీటింగ్ లప్పుడు, చక్కగా బయట అందరితో మాట్లాడుకుని, తరువాత వారితో కాఫీ కో ఫలహారానికో వెళ్ళే వాళ్లం.

ఇప్పటికీ నాకు అర్థం కానిది ఏంటంటే, అప్పట్లో టీచరేమో వాడిని పొగిడేసేవారు. ఎంత బుద్ధిమంతుడు, చాలా మర్యాదగా ఉంటాడు అని. మొదటిసారైతే నేను చాలా ఆశ్చర్యంగా ఆవిడతో " మా వాడి పూర్తి పేరు ఇదండీ, మీరు మాట్లాడేది వీడి గురించేనా?" అని అడిగి నిర్ధారించుకోవాల్సి వచ్చింది.

టీచరేమో "ఆటపాటల్లో అన్నింట్లో ముందు ఉంటాడు, ఎవరికి ఏ సహాయం కావాలన్నా చేస్తాడు" అన్నారు.

"మరి చదువులో?" అని అడిగాను.

వాళ్ళు చెప్పిన దాని బట్టి నేను అర్థం చేసుకున్నది ఏంటంటే, వాడు బాగా చదువుతాడు అని. సంవత్సరం మొత్తం మీద వాడి రిపోర్ట్ వస్తూ ఉండేది. కర్ర విరగదు , పాము చావదు అన్నట్టు వాళ్ళు రాసినా, నేను చాలా పాజిటివ్ గా చూసాను.

సంవత్సరం చివరలో జరిగిన పరీక్ష ల్లో వాడి రిపోర్ట్ చూస్తే, నాకు నోట మాట రాలేదు. నిజంగా వాడికి బంగారు పతకం ఖాయం అనుకునే సమయంలో ఈ మార్కులు చూసేసరికి, నాకు ఎలా స్పందించాలో అర్థం కాలేదు.

నా చిన్నప్పుడు, మార్కులే పెద్ద కొలత. అవి రాగానే పక్క వారితో సరి పోల్చుకోవడం, ఏమాత్రం ఒకటి అరా తగ్గినా, లేక పక్క వారి కన్నా తక్కువ వచ్చినా, అంతే సంగతి. మంగమ్మ టైపు లో శపథం పట్టేసి, తరువాత పరీక్షలో, పక్క వాళ్ళకంటే ఎక్కువ వచ్చే దాకా తిండీ నిద్రా త్యాగమే మరి.

ఒక పక్క మార్కుల తో పాటు, వాడిని పొగుడుతూ(నాకు అలానే అర్థం అయింది!! భాగవతం కూడా ఉండేది ఆ రిపోర్టు లో.

ఈలోగా, వాడు వాళ్ల నాన్న తో నవ్వుతూ తుళ్ళుతూ రిపోర్ట్ చూపించాడు. వాళ్ళ నాన్న ముఖంలో గర్వం.

నాకు చాలా ముచ్చటేసింది. వాడు ఆనందంగా ఉండటమే కదా నాకు కావాల్సింది అనిపించింది. ఆ తరువాత మా ఆయన నాకు హితబోధ.(అదంతా చెప్పాలంటే, మరో కథ అవుతుంది) నిజమే కదా అనిపించింది.

టీచర్ చెప్పింది వేరుబీ నాకు ఎలా కావాలనుకున్నానో అలా నేను అర్థం చేసుకున్నాను. అప్పటి నుంచి నేను వాడి చదువు విషయంలో జోక్యం చేసుకోవడం మానేశాను. అలా సంవత్సరాలు గడిచాయిపోయాయి.

నా ఆలోచనలకు కారుకూ బ్రేకు వేసి స్కూలు లోకి వచ్చాను.

వాడు గేటు దగ్గర కలిస్తే మీటింగ్ జరుగుతున్న హాల్లోకి తీసుకొచ్చారు. అప్పటికే ఒకొక్క టీచర్ దగ్గరా చాంతాడంత క్యూ ఉంది. చాలా మంది తెలిసిన వారే, ప్యాండెమిక్ ముందు కలసి మాట్లాడినవా రే. అందరికీ బాగా వయసు పడిన ఛాయలు (నాకంటే ఎక్కువగా) కనిపిస్తున్నాయి. పిల్లల్ని గుర్తు పట్టడం కష్టం అయింది.

ఏదో హలో అనుకోవడం తప్ప, ఎవరూ బాతాఖానీలు పెట్టట్లేదు.

ఒకొక్కరూ ఒక్కో టీచర్ దగ్గర చాలా సేపు గడుపుతున్నారు. ఏంటేంటో అడిగేస్తున్నారు.

నా సమయం వచ్చింది. టీచర్ లేచి నిలబడి, నాకు కరచాలనం చేసి

కూర్చుని, వాడి కేసి చూసి వాడితో మాట్లాడటం మొదలుపెట్టారు. నాకు పెద్దగా అడగడానికి ఏమీ లేకపోయినా, చాలా ఉత్సాహంగా, ముఖానికి పెద్ద నవ్వు పులుముకుని కూర్చున్నాను. ఒక పక్క ఇలాంటి సందర్భం నాకు మళ్ళీ రాదు అని ఉద్వేగం, మాట్లాడడానికి ఏమీ లేకపోయినా, ఏదో మాట్లాడేద్దామని తపన, అయినా అవకాశం లేక వింటున్నాను.

టీచర్: "ఎలా చేసాననుకుంటున్నావు?"

వీడేమో , "బాగానే చేసాను, ఫలానా చోట ఇంకా బాగా చెయ్యాలి".

టీచరు: వాడు చేసిన తప్పులు చూపిస్తూ, "ఆ ప్రశ్న కి ఇదీ పద్ధతి, ఇలా చెయ్యాలి", అని చెప్పుకుంటూపోతూఉన్నారు

ఇద్దరూ నా వైపు చూడలేదు, నాతో మాట్లాడలేదు. నేను, వాళ్లిద్దరిలో ఎవరు మాట్లాడుతుంటే వాళ్ల వైపు చూస్తూ, కొంచెమైనా నన్ను కూడా వారి సంభాషణ లో కలుపుతారా , నాకు అవకాశం ఇవ్వకపోతారా అని చూసాను.

అక్కడకీ గొంతు సవరించుకున్నాను, అయినా లాభం లేకపోయింది. టీచరు చెప్పినదానికి (ఏమీ అర్థం కాకపోయినా) ఔను అన్నట్టు తలాడించాను.

అటూ ఇటూ చూసాను, అబ్బే లాభం లేకపోయింది.

గీతాబోధచేస్తున్నట్టు టీచర్, అర్జునుడు టైప్ లో పూర్తి ఏకాగ్రత తో వీడుబీ ఇదేదో క్లాసులో వింటే ఏమైనా ఉపయోగం ఉండేది కదా అని అనుకున్నాను.

పది నిమిషాలు పూర్తి కాకుండానే, వాళ్లిద్దరూ ఒక ప్రణాళిక వేసేసుకున్నారు.

టీచర్ నావైపు చూసి, మీరు ఏమైనా అడగదల్చుకున్నారా అని నన్ను అడిగారు. నేను సమాధానం చెప్పేలోగా, వీడు టేబుల్ కిందనుంచి నా చేయి తట్టాడు. వెనుక క్యూ కూడా పెరగడంతో, లేవాల్సివచ్చింది. టీచర్, నా చెయ్యి పట్టుకుని

గట్టిగా ఊపేసి, మిమ్మల్ని కలసి నందుకు నాకు చాలా ఆనందంగా ఉంది అన్నారు. నేను పెద్ద చిరునవ్వుతో, "నాకు కూడా" అని అన్నాను. అక్కడ నుంచి వేరే టీచర్ దగ్గర కు వెళ్లేసరికి, అక్కడ ఇంకో క్యూ. తప్పదు కదా, లైనులో కూర్చుని, చుట్టూ చూసాను. అబ్బే, ఎవరూ కూడా మాట్లాడడానికి, సుముఖంగా లేరు. కళ్ళ తోనే పలకరింపులు. రెండోసారి చూస్తే ఎక్కడ మాట్లాడేస్తానేమో అన్న బెదురు నాకైతే కనిపించేసింది.

ఇక రెండో టీచర్ దగ్గరా ఇదే తంతు. వీడు అదే పాట, "చిన్న చిన్న తప్పులు చేసినందుకు మార్కులు పోయాయి, ఏంచేయాలో తెలుసుకున్నాను." అనిబీ టీచరేమో, "నువ్వు ఇంకా బాగా చేయగలవు, ఫలానా పేపర్ చేసి తీసుకుని రా, నేను పేపర్ దిద్దాక ఏమైనా తప్పులుంటే చెప్తాను ". అని ఈ డైలాగ్ ఎందుకో ఎక్కడో విన్నట్టు గా అనిపించింది.

నేను నిజానికి మాట్లాడడానికి ఏమీ లేకపోయినా, మాట్లాడే అవకాశం ఇవ్వలేదని ఉక్రోషం వస్తోంది. నోరు మూసుకుంటే ముక్కు మూసుకున్నట్టు, ఊపిరి తీసుకోవడం ఆగిపోయినట్టయ్యింది.

పైగా, అందరి దగ్గరా ఊరికే పళ్ళు ఇకిలిస్తూ కూర్చునేసరికి, దవళ్ళు లాగేస్తున్నాయి.

ఉక్రోషం, ఉద్ధృతం అయి, ఆఖరి టీచర్ దగ్గర వచ్చేసరికి, నోరు తెరవకపోయినా నా ముఖంలో ఎనిమిది భాషలలో నా వేదన అంతా సబ్ టైటిల్స్‌లో ప్లే అయిపోయాయి.

ఆవిడ చదివినట్లు ఉన్నారు. (ఫ్రెంచ్‌లో కాబోలు, ఎందుకంటే, మావాడికి అర్థం కాలేదు)

ఆవిడ నన్ను కదిపేసరికి, గాప్ లేకుండా మూడు నిముషాలు మాట్లాడేసి అప్పుడు ఊపిరి తీసుకున్నాను. ఆపద్భాంధవురాలు లాగా కనిపించారు మేమిద్దరం మాట్లాడుకున్నది ఏంటంటే, పిల్లలు ఎంతో తొందరగా ఎదిగి పోయారు, వారిని ఎలా మిస్ అవుతామని అని.

ఆవిడ, అప్పుడు వాడితో సంభాషణ ముగించారు.

మరొకసారి మా దగ్గర లో ఉన్న వారికి చిరునవ్వుతోనే వీడ్కోలు తెలుపుతూ అక్కడ నుంచి బయటపడ్డాం.



# " ఊహలకందని మొరాకో "

డాక్టర్ నిమ్మగడ్డ శేషగిరి



ఉత్తర ఆఫ్రికాలోని Morocco దేశంలో చాలామందికి అంతగా సుపరిచితం కాని ప్రదేశం. ఈ మొరాకో యాత్రాదర్శిని ద్వారా Dr.నిమ్మగడ్డ శేషగిరి రావు తన యాత్రనుభావాలను ఆంగ్లంలో గ్రంథస్తం చేశారు. దీనిని దాసరి అమరేంద్ర తెలుగులో మన ముందుకు తీసుకువచ్చారు. ఇందులో Berbers తెగ వారి ఆచార్య వ్యవహారాలని, వారి సంప్రదాయాలని మనకు సజీవంగా, కళ్ళకు కట్టినట్టు వర్ణించారు. ఈ గ్రంథం చదువుతున్నంతసేపు పాఠకుడికి రచయితతో పాటు మొరాకోలో పర్యటించిన అనుభూతి కలుగుతుంది అనడంలో అతిశయోక్తి లేదు

కాకినాడలో మెడిసిన్ చదివి ఇంగ్లండ్లో ఫోరెన్సిక్ సైకియాట్రిస్టొ గా స్థిరపడిన నిమ్మగడ్డ శేషగిరికి యాత్రలన్నా జీవితమన్నా అంతులేని పిపాస. గత పాతికేళ్లుగా ప్రపంచమంతా విస్తారంగా పర్యటించారాయన. తెలుగు వారికి అంతగా పరిచయం లేని మొరాకో దేశంలో 2014–2020 ల మధ్య మూడు విడతలుగా మొత్తం నెల రోజులు తిరుగాడారాయన. ఆ అనుభవాలను ఆంగ్లంలో వివరంగా రాసారు. స్వయంగా యాత్రారచయిత అయిన దానరి అమరేంద్రకు శేషగిరి చేసిన ప్రయాణాలంటే ఎంతో ఇష్టం. ఆ అనుభవాలను తెలుగువారికి చేర్చాలన్న కోరికతో వాటిని అనువదించి ఈమాట వెబ్ పత్రికలో డిసెంబర్ 2021 జనవరి 2023 మధ్య పన్నెండు భాగాలుగా ప్రచురించారు. వాటి పుస్తకరూపమే ఈ ఊహల కందని మొరాకో !

… ఒక మలుపు తిరిగీ తిరగగానే పచ్చటి పైకప్పు ఉన్న చిట్టి కట్టడం కనిపించింది. దాని గోడ మీద ఇబ్న్ బటూటా యాత్రామార్గాల చిత్రపటమొకటి అమర్చి ఉంది. ఆ ప్రదేశమంతా నిర్మానుష్యంగా నాకోసమే ఎదురుచూస్తున్నట్టుగా ఉంది. ఒక మహాయాత్రికుడిని కలుసుకోడానికి అంతకుమించిన తరుణం ఇంకేముంటుందీ?! యాత్ర అన్నదానిని ఒక జీవన విధానంగా మలచుకొన్న వ్యక్తి అతను.

అక్కడ నిలబడ్డ క్షణాన వర్తమాన యాత్రా చరిత్రకారుడు ఆదినారాయణ గుర్తొచ్చారు. ఇబ్న్ బటూటా సమాధి స్థలం నుంచి ఫోను చేసి ఆ అరుదైన ఘడియను ఆయనతో పంచుకోవాలనిపించింది. విషయం తెలుసుకొని ఆయన మహదానందపడిపోయాడు. ఫోను సంభాషణ సమయంలో నేను చూపించిన ఉత్సాహం, పొందిన ఉత్తేజం గమనించి దారినపోయే ఓ పెద్దావిడ విస్తుపోయింది. ఇబ్న్ బటూటా సాక్షిగా ఒక అపురూపమైన సంభాషణ సాగుతోందన్న విషయం ఆమె ఊహకు అందే అవకాశమే లేదు!!



# FREEDOM CIRCLE

## MORTGAGE & INSURANCE SERVICES




**www.freedomcircle.co.uk**

*PLEASE CONTACT US FOR FREE CONSULTATION* **07523421138** **07467431083**

**Disclaimer : Your home or property may be repossessed if you do not keep up repayments on your mortgage**

*The Financial conduct authority does not regulate some forms of mortgage. Freedom Circle Limited does not charge any fee. We are paid a procuration fee by the Lenders. For Mortgages, Freedom Circle Limited canadvise from a comprehensive panel of Lenders. For Insurance, Freedom Circle Limited can advice froma range of insurers. Freedom Circle Limited is authorised and regulated by the Financial Conduct Authority (Reference 808384). Freedom Circle Limited is a registred company in England and Wales (Registration number 11323478). Freedom Circle Limited trading address is Eaton House, 1 Eaton Roadm, Conentry CV1 2FJ*




# SAKTHI
## Cash & Carry

Specialists in
**INDIAN AND SRILANKAN**
**GROCERIES**

245-247 High Street North,
Manor Park, London, E12 6SJ
Phone: 020 8471 4713 / 5577

639-643 Cranbrook Road,
Ilford Gants Hill, IG2 6SX
Phone: 020 3876 7999